UNIVERSAL
LIBRARY
OU_204444
UNIVERSAL
LIBRARY

# గెలుపు నీదే

## నాటకం

★


కె. యల్. నరసింహారావు


★


సంగీత సవిత

రెడ్డి హాస్టలు

హక్కులు రచయితవి | హైదరాబాదు | వెల: రూపాయి

ప్రథమ ముద్రణ

జనవరి
1952

ప్రజావాణి ప్రెస్, హైద్రాబా

# INTRO

నేనా పరిస్థితుల్లో యిక్కడ లేకపోతే బహుశా యీ నాటకం వ్రాసేవాణ్ణి కానేమో! కాని - దురదృష్టవశాత్తూ నాకలాంటి సదవకాశం లభించనందువల్ల యిది వ్రాయాల్సి వచ్చింది.

ఇది- వ్రాయాల్సి వచ్చినందుకు నేనేమీ గర్వపడడం లేదు; పై పెచ్చు చాలా సిగ్గు పడుతున్నాను కూడాను. ముఖ్యంగా- యీ సమయానికిది అచ్చాయి. యీ మూడు ముక్కలు వ్రాయాల్సి వచ్చినందుకు మరీ బాధ పడుతున్నాను.

ఎందుకంటే- నేడనేకమంది జైళ్ళలోనూ, అజ్ఞాత వాసంలోనూ మ్రగ్గుతున్నారు. ఎంతోమంది చనిపోయ్యారు. ఎందరివో సుఖసంసారాలూ, నివసించే గృహాలూ సర్వనాశనమయ్యాయి. ఎందరో ఘోర అవమానాల పాలయ్యారు. అటువంటి వారందరికీ యిదిచూస్తే కడుపు మండిపోతుంది. నిజమే. వారిబాధ అలాగే వుంటుంది. ఏ మానవుడూ కాదనలేడు.

కాని- నేనిక్కడ చేసే మనవేమంటే, యీ నాటి పరిణామానికి పూర్వం అంటే దాదాపు యీ కల్లోలపు ఉధృతి దశలో యీ నాటకం వ్రాయబడింది.

ఆనాడు: ఇప్పుడెవరైతే జైళ్ళకూ, అజ్ఞాతవాసాలకూ, కాల్పులకూ గురియై అష్టకష్టాలు పడ్డారో- అలాగే వారివల్ల అత్యంత ఘోరంగా హత్యగావింపబడ్డ అమాయకులూ, స్త్రీలూ, వృద్ధులూ, చితికిన సంసారాలు ఎన్నో వున్నాయి.

'పోరాటం'లో చనిపోయినవారు 'మృతవీరు' లయిన పక్షంలో- వారివల్ల నిర్దాక్షిణ్యంగా చంపబడ్డ నిరపరాధులు అధమం 'అల్పప్రాణు'లయినా కాకపోలేరు! ఆ 'మృతవీరు'లకు ప్రపంచమంతా జోహార్లర్పించి నప్పుడు- కనీసం ఆ 'అల్ప ప్రాణు'లకు ఒక్క- యీ 'ప్రాణి' అయినా కన్నీటి బొట్లు రాల్చడం అధర్మమూ. అసహజమూ. అభివృద్ధి నిరోధకమూ అనుకోను.

ఆ ఘోర హింసాకాండ ఒకరోజు కాదు; రెండురోజులు కాదు. కొన్నిమాసాల పాటు సాగిస్తూ వుంటే, కొన్ని దినాల్లో వారి కార్యక్రమాలకు మురిసిపోయ్యే నేను వీటిని చూస్తూ చూస్తూ మురవలేకపోగా- ఏదో చెప్పలేని తీవ్రమైన ఆవేదనతో మథింపబడ్డాను. ఆ ఆవేదన హఠాత్తుగా అగ్ని పర్వతం బ్రద్దలైనట్టు ఒకనాడు యీ నాటక రూపంలో బయల్పడింది. ఈనాటకమంతా 1½ రోజుల్లో పూర్తయింది. 28-10-48 ఉదయాన్నుంచి 29-10-48 సాయంత్రానికి పూర్తయింది. ఇదీ- యీనాటక రచనకు కారణం.

ఇలా వ్రాయబడుతోన్నప్పుడు యిది అభ్యుదయమా? కాదా? అని ముక్క- ముక్కకు ఆలోచించుకోవాలని నాకు తట్టలేదు; ఆ అవకాశంకూడా అప్పుడు చిక్కలేదు. బహుశా- నేను హృదయపూర్వకంగా వాస్తవమని నమ్మిందాన్ని వ్రాస్తున్నాననుకొని వుంటాను. ఇక-యిప్పుడు సహృదయ పాఠకులకే కాని కిందులో అభ్యుదయమూ, వాస్తవమూ, ప్రయోజనమూ ఏ ఏ రూపాల్లో ఎంతవరకు కనిపిస్తుందో వారి

అమూల్యవిమర్శల ద్వారా తెలుసుకొని, అందులో వారు నేనేమైనా పొరపడ్డానని సలహాలిస్తే-అలా యెందుకు వెళ్లానో కూడా మరోమారు తిరిగి తాపీగా ఆలోచించుకొని, మున్ముందైనా వారు చూపే సత్పథాన నడవడానికి శాయశక్తులా ప్రయత్నించాలని ఆశ. దానికి పెద్దలూ, మిత్రుల అభిప్రాయాల నర్థిస్తున్నాను.

తరువాత: యికయీ నాటకానికి జనతా కళా మండలి దర్శకులైన శ్రీ వారణాసి వెంకటనారాయణ శాస్త్రిగారూ, సభ్యులైన డాక్టర్ అలవాల వెంకయ్యగారూ పాటలు వ్రాశారు.

ఇకయిది 'జనతాకళామండలి' (సూర్యాపేట) వారిచే తెలంగాణాలోని దాదాపు 80 ప్రాంతాల్లో 100 ప్రదర్శనలదాకా యివ్వబడింది. నచ్చో, నచ్చకనో లక్షలాది ప్రజలు చూశారు. ఇదీ- దీని ప్రదర్శనల వృత్తాంతం.

ఇన్నాళ్లకిది యిటీవలనే యిక్కడి 'ప్రజావాణి' పత్రికలో సీరియల్‌గా ప్రచురింప బడింది.

దీన్ని శ్రీ పి. మాణిక్యరెడ్డిగారు తమ రెడ్డిహాస్టల్ సంగీత సమితి తరఫున పుస్తకంగా ప్రచురించ దలుచుకున్నా మంటే సరేనన్నాను.

మండలికీ, పత్రికా సంపాదకులకూ, ప్రచురణ కర్తలకూ, యితరంగా తోడ్పడ్డ పెద్దలూ, మిత్రుల కందరికీ కృతజ్ఞతలు.

హైదరాబాద్
10 జనవరి, 1952

—నరసింహారావు

# రెడ్డిహాస్టలు సంగీత సమితి

మొదటి ప్రచురణ :

**ఒ క రో జు**

[నాటిక]

రచన: కె. యల్. నరసింహారావు

వెల : రూపాయి

రెండవ

ప్రచురణ :

**గెలుపు**
**నీదే**

★

## ——— త్వరలో ———

మూడవ ప్రచురణ :

**రాగజ్యోతి**

[ఖండ కావ్యం]

రచన : సి. నారాయణరెడ్డి

వెల : ?

నాల్గవ ప్రచురణ :

**'ఒడుదుడుకులు'**

[హాస్యరస సాంఘిక నాటకం]

రచన : కె. యల్.

# గెలుపు నీదే

# ఇందులో

★

| | | |
|---|---|---|
| రాఘవయ్య | — | రైతు |
| వెంకటమ్మ | — | రాఘవయ్య భార్య |
| విశ్వం | — | వారి పెద్దకుమారుడు |
| ప్రభాకర్ | — | ,, చిన్న కుమారుడు |
| లింగన్న | — | ,, పాలేరు |
| జానకి | — | విశ్వం భార్య |
| స్వామి | — | కుమారుడు |
| బ్రహ్మం, సుబ్బన్న, పుష్ప, వెంకటన్న | } | ప్రభాకర్ బృందం |

సమయానుకూలంగా తదితరులు

# ఒకటవరంగం

## రాఘవయ్య ఇల్లు

[వసారాలో మంచంపై చుట్టకాలుస్తూ రాఘవయ్యకూర్చుంటాడు. ప్రక్కన చిరుకొయ్యకు వ్యవసాయపనిముట్లుంటాయి. నాగలి భుజాన బెట్టుకొని సుబ్బన్న బయటికి వెళ్ళబోతుండగా]

రాఘవయ్య : సుబ్బిగా !

సుబ్బన్న : (మాట్లాడకుండా పోతుంటాడు)

రాఘు : అరే, నిన్నే పిలచేది! మాట్లాడవేం?

సుబ్బన్న : ఎంత పెద్దోరైతే మాత్తరం అరే ! అనడమేందుండీ!

రాఘు : పోనీలెండి ! సుబ్బన్నగారూ అంటే బాగుంటుందా?

సుబ్బన్న : మా బతుక్కి గారెందుకు లెద్దురూ?

రాఘు : అటు అరే అనొద్దు. ఇటు గారూ అనొద్దు. ఇంకేమనాలండీ?

సుబ్బన్న : మాబతుక్కి సుబ్బన్నంటె సాల్లేరి!

రాఘు : సరె కాసేండి ధొరవారూ! నిన్ననేమో జీతంఎగ్గొట్టారూ?

సుబ్బన్న : ఏం? రోజూ చేసే జీతమేగద ! ఒక్కరోజు రాకపోతె ఏం మునిగిపోద్ది?

రాఘు : అవేంకూతలురా? (చుట్ట పారేస్తాడు)

సుబ్బన్న ; ఏందేంటి ? మేం జీతాలు సెయ్యాకేం ? ఈ బూములన్ని మాయే అయిపోతంటే మీకెందుకు జీతాలు జెయ్యాల్నయ్యా?

రాఘు : ఓరి వెధవా ! అప్పుడే తల పొగరు పట్టినట్టుందే?

సుబ్బన్న : పొగ రెండుకెక్కుద్దీ ?

రాఘు : ఎందుకా? (లాగి చెంపపై కొట్టి)ఇందుకు! (ఫెళా ఫెళా వేస్తుంటాడు. డాక్టర్ విశ్వం వచ్చి)

విశ్వం : నాన్నా ! ఎవర్నీ మీరు కొట్టేది ?

రాఘు : నన్ను నాశనం చేయబూనే శుంఠను.

విశ్వం : ఒక్కసారి లోకాన్ని బాగా కళ్ళు తెరిచి చూడునాన్నా !

రాఘు : చూస్తున్నావుగా గుడ్లప్పగించి.

విశ్వం : మిమ్మల నాశనం చేసేవారెవరూ లేరు, స్వంతంగా చేసుకుంటే దప్ప !

రాఘు : మాటలు హద్దుమీరుతున్నాయి సుమా !

విశ్వం : తమ నిరంకుశత్వం కంటే మాత్రం కాదనుకుంటాను.

రాఘు : పిచ్చపిచ్చగా వాగబోకు !

విశ్వం : పిచ్చ పిచ్చగా కొట్టడం బావుందీ ?

రాఘు : చూడలేకుంటే కళ్ళు మూసుకో!

విశ్వం : కళ్ళు మూతలు బడబట్టేనా, ఈ దుష్కృత్యాలు? ఎన్నో సార్లు చెప్పాను-తమ ప్రవర్తనను మార్చుకోవలసి ఉంటుందనీ, మన భూములను మనమే స్వంతంగా దున్నుకోవలసి వుంటుందనీ !

రాఘు : నీవొక చెప్పేవాడవూ, నేనొక మార్చుకునే వాణ్ణీనా ?

విశ్వం : మీరు పెద్దలు; పైగా తండ్రివి. పరిస్థితులన్నీ తెలుసుకొని గూడా యిలాకొట్టడం బావుంటుందా ?

రాఘు : కూడుపెట్టే యజమానిని నాశనం చేద్దామనుకోవడం మాత్రం బావుంటుందేం ?

విశ్వం : మనందరికీ కూడుపెట్టే యజమానెవరో తెలుసు.

రాఘు : విశ్వం! పెడర్థాలు తీస్తున్నావుసుమా ?

విశ్వం : ప్రతిరోజూ లోకం చూస్తూనే వుంది, అతనే మనకు పండించి పెడ్తున్న సంగతి.

రాఘు : బానిసను తల కెక్కించుకుంటున్నావని తెలుసా ?

విశ్వం : సోమరులను తల కెక్కించుకున్నందుకు అనుభవిస్తూనె వున్నాడీ సుబ్బన్న. అతనే పండించకపోతే.........

రాఘు : వాడు పండించేదేమిటోయ్ ? ఏం మనకోసం పండిస్తున్నాడా ? వాడి పొట్టకోసం వాడు పండించుకుంటున్నాడు.

విశ్వం : మనదేమో అనుభవించే పొట్టా, అతనిదేమో చాకిరీ పొట్టానా ? ఒక్కరోజు అతను పనిని మానేస్తే తెలుస్తుంది మన బ్రతుకు లేమిటో ?

రాఘు : వాడు కాకుంటె వాడి తాతలు లకలు దిగుతారు.

విశ్వం : అదే వచ్చింది ఛిమా. ఇంకా ఎన్నాళ్ళీ అస్వతంత్రపు కూడు తిందామని ?

రాఘు : విశ్వం! నీకు కొంతతెల్సు, కొంత తెలియదు. ఆ మిడిమిడి జ్ఞానంతో ఎందుకు వాగుతావు చెప్పు. అసలు యీ రోజుల్లో ప్రతి వాడూ నలుగురు గాలి వెధవల్ని వెనుక వేసుకొని రావటం నాగరికతై పోయిందిలె.

విశ్వం : ఎదుటి మానవుడు పీడింప బడుతుంటె చూస్తూ ఊరొ్ప వడం నాగరికతేనేం ?

రాఘు : ఏం? వాడు కూసె కూతలు కనబడవు కాని, నేను పీడించటం మాత్రం కనబడుతుందేం?

సుబ్బన్న : (అందుకొని) నేనేం మాట్లాడలేదండీ! అన్నాలింగ కొడ్తుండరు!

రాఘు : ఏమ్మాట్లాడలేదెం వెధవ! (అని అక్కడున్న కర్రను లాగి సుబ్బన్నను మరీ కోపంతో కొట్టబోతాడు. సుబ్బన్న తప్పుకుంటాడు. విశ్వం అడ్డుపడ్తాడు. రాఘవయ్య కన్నూ మిన్నూ కానకుండా కొట్టేస్తుంటే విశ్వం గాయపడి పడిపోతాడు. లోపల్నుంచి స్వామి, వెంకటమ్మ, జానకి, లింగన్నలు ఏమి టేమి టంటూ గబగబ పరుగెత్తు కొస్తారు.)

స్వామి : ఏమిటి తాతా ఎవర్ని కొడుతున్నావు? (అని తాత చేతిలోని కర్రను లాక్కుంటాడు. రాఘవయ్య నిస్సహాయుడైపోయి చేసిన పనికి సిగ్గుపడ్తాడు. రాఘవయ్య యింట్లోక, సుబ్బన్న నాగలక్కడ బడేసి బయటకు వెడతారు. అక్కడున్నవారిలో లింగన్న మంచం తెచ్చివేస్తే విశ్వాన్ని దానిపై పడుకో బెడతారు. స్వామి గాయానికి కట్టు గడ్తాడు. ఈ మూగిదృశ్యం రంగమ్మీద జరుగుతున్నంతసేపూ బ్యాక్‌గ్రౌండ్ పాట వినబడుతుంటుంది.)

కాంతినివిడి ప్రేమనువదలి చెలగుటయే మరియాదా? జీవా
అంధకారమగు ఆవేశముతో ఆప్తుల హింసించెదవా!
నీజీవితమును నిజమార్గములో నడిపెడి యోగ్యుడు కాడా?
నీ కోపము నిన్నే పరిమార్చును నిజమని నమ్ముమురా! జీవా!

వెంకటమ్మ : ఏమిటొనమ్మ! ఈ మధ్య ఇదేం పొయ్యేకాలమో గాని మరీ చిరచిర లెక్కువై పోతున్నాయి.

జానకి : ఎంత ఇదైతేమాత్రం ఇంత ఘోరమేమిటమ్మా ?
స్వామి : ముందు కొంచెం కాఫీ కాచివ్వవె అమ్మా ! (జానకి లోనికి వెళ్తుంది. వెంకటమ్మ విశ్వం వద్ద కూర్చొని వుంటుంది)
విశ్వం : అమ్మా ! కాసిని మంచినీళ్ళివ్వవే !
వెంక : స్వామి ! తొందరగా మంచినీళ్ళు పట్టుకొరా నాయనా ! (తెస్తాడు) లేచి కూచో నాయినా ! కొద్దిగా త్రాగు, కాఫీ త్రాగుదువు గాని (త్రాగాక) పడుకో బాబూ !
విశ్వం : అమ్మా ! నాన్న ఏడమ్మా?
వెంక , అదిగో, ఉన్నారక్కడ. ఇప్పుడెందుకు నాయినా ! పడుకో !
విశ్వం : అలా కాదే ! పిలవాలి. స్వామీ! తాతయ్యను పిలువురా !
స్వామి : ఏయ్ తాతా ! ఇలారా (పిలుస్తాడు దురుసుగా)
విశ్వం : ఛా అదేమిటి స్వామీ ! పెద్దలనలా పిలవొచ్చా ? తప్పు కాదూ !
స్వామి : నిన్ను కొడితే మాత్రం తప్పులేదేం ?
విశ్వం : ఏదో తెలియక కొట్టారులే.
స్వామి : అయితే, నేనూ తెలియకనే అన్నాననుకో యేం ?
విశ్వం : సరేగాని అమ్మా ! నీవైనా పిలవవే.
వెంక : (లోనికివెళ్ళి బిగ్గరగా) మిమ్మల రమ్మంటున్నాడండీ విశ్వం.
వెంక : (ఇక్కడికివచ్చి) రానంటున్నాడురా !
విశ్వం : సరే, నేనే వస్తాను. (లేవబోతాడు)
వెంక : వద్దు నాయనా, వద్దు. పడిపోతావు ! ఏమండీ! మిమ్మల్నే నండీ ! లేకుంటె వాడే వస్తాట్ట.

(రాఘవయ్య విశ్వం దగ్గరకొచ్చి కన్నీరు కారుస్తాడు.)

విశ్వం : ఎందుకు నాయనా, ఏడుస్తావు ?

రాఘు : (వెళ్ళు నిమురుతూ) నాయనా ! వెళ్ళంతా రక్తమయ మైందా నాయనా ! అబ్బ ! చాలా ఘోరం చేసాను.

విశ్వం : ఎందుకింకా వ్యథ పడ్తావు నాయనా ! చేసిన తప్పేమిటో తెల్సుకుంటే అంతేచాలు.

రాఘు : ఆ గాడిద పొగరుగా మాట్లాడుతుంటే కొట్టబోయాను. ఇంతలో నివు కోపాన్ని మరి రెట్టించావు. ఒళ్ళు తెలియని ఆవేశ మొచ్చింది. ఏంచేసేది నాయనా ! కన్న కొడుకును చావ మోదుకున్నాను.

విశ్వం : ఎవరిమీదనైనా అంతకోపమైతె ఎలా నాన్నా ?

రాఘు : వాన్నేదో నిన్న జీతాని కెందుకు రాలేదంటె ఎంత పొగరుగా మాట్లాడా డనుకున్నావు ?

విశ్వం : నివు చేసిందేమిటో నాకు తెలుసు నాన్నా !

రాఘు : ఏదో మనవాటి వాళ్ళందర్ని నాశనం చేద్దామని వాళ్ళు......

విశ్వం : అవును, వాళ్ళనుకుంటున్న మాట నిజమే మరి.

వెంక : అలాంటి వాండ్లను పెచ్చు పెరగనిస్తె మనమేమై పోవాలి ?

విశ్వం : అదేనమ్మా, మీతో వచ్చే చావు. మనం సరిగా వుంటె వాళ్ళలా పెచ్చు పెరుగుతారు చెప్పు !

రాఘు : మనమిప్పుడు సరిగా వుండక ఏమంటున్నామురా ? మనమే మన్నా జీతాలు తక్కువిస్తున్నామా ? చాకిరి ఎక్కువ చేయించు కొంటున్నామా ?

విశ్వం : చాకిరి ఎక్కువైన, తక్కువైన వాళ్ళు పొందుతున్నదం, మనం అనుభవించటం జరుగుతున్నదా లేదా ?

వెంక : నిదరో చౌర్యంగాని లోకమ్మీద అంతా చేయించుకోవటం తెదురా జీతాలు?

విశ్వం : అవును, మన వొక్కరి సంగతేనా నేచెప్పేది ? కాలుమీద కాలువేసుకొని జీతాలు చేయించుకొనేవారందరి గతీ అంతేమరి.

జాన : (కాఫీ తెస్తూ) నిజమేకదా అత్తయ్యా! మనమేమో భూమి దున్నుకోం ! వాళ్ళేమో దున్నుతారాయె. ఇక వాండ్లమీద మనం ఆధారపడ్డాక వాళ్ల ఇష్టమొచ్చిన కోర్కెలెల్లా కోర్తారు. ఏం చేస్తాం మరి ? ఒప్పుకొక తప్పదు. పైగా వాళ్ళను రెచ్చగొట్టడానికి, భూములిప్పిస్తా మనడానికి ఎందరు ప్రముఖులు లేరుగనక.

విశ్వం : మన ప్రభాకరం చాలడా ?

వెంక : (కాఫీ తీసుకొని) ఏమిటో నాయనా, వాడి బ్రతుకంతా ఆలా అయిపోతున్నది. ఏమోగాని కాఫీ త్రాగు నాయనా ! ఈ గొడవలు రోజు రోజుకు ఎక్కువైపోతున్నాయి.

విశ్వం : అవును మరి ! మన మొక క్రొత్తమార్గాని కొచ్చేదాకా యిలాగే ఉంటాయి అల్లర్లు.

రాఘు : మరి యేంచేద్దామంటావురా, వాని ?

విశ్వం : ఏంచేద్దామేమిటి నాన్నా ! మన భూమిని.........

జాన : మనమే దున్నుకోవాలి ?

స్వామి : నేను దున్నుతా తాతా ! నేను దున్నుతా .

రాఘు : సరె, ఇక నీవు దున్నడమూ, మేము తినడమూను.

వెంక : ఏమో అంటావుగాని ఎలా సాధ్యంరా ?

విశ్వం : ఎలా సాధ్యమేమిటమ్మా ? మొన్నటి దాకా మన తాతలు దున్నలేదా ? ముత్తాతలు దున్నలేదా ? నాలుగు పైసలు చేతికి రావటంతో పాలేర్లను పెట్టుకోవటం, ఈలోగా మనకు సోమరితనం అలవాటు కావడమే ఈ కష్టాలకు కారణం, మనమిలాగే

ఇంకా మీనమేషాలు లెక్కిస్తూ పోతే ఇక అకాస్త కూడా దక్కదు.

జాన : అవును మరి. దున్నేవానికే భూమి హక్కన్నాక మనకు మాత్ర మేలా వుంటుంది ఇలాగే కూర్చుంటే ?

స్వామి : తాతయ్యా ! మన భూమిపోతే మనకు అన్నమెట్లా తాతయ్యా?

రాఘు : (దగ్గరకు తీసుకొని) జానెడున్నావో లేవో నీకూరాజకీయాలు తెలుసేరా ?

వెంక : స్వామి అన్నదీ నిజమే. అకాస్త భూమీ పొయ్యాక ఇంకేం చేస్తాం గాని మన భూము లలా తీసుకుంటుంటే చూస్తూ వూరుకోవలసిందేనారా ?

విశ్వం : అవునమ్మా ! సోమరిపోతు లెవరూ ఉండటానికి వీలులేదనీ, ప్రతివాడూ కష్టపడాలనీ, దున్నేవానికే భూమి హక్కుండా లనీ లోకమంతా ఒప్పుకున్నది.

రాఘు : అలా అనడం మంచిదే గాని, మళ్ళీ మనం దున్నగలమా అని.

విశ్వం : (లేస్తూ) మీరు దున్నలేకుంటే, ఇక నేను దున్నుతాను ! పండి స్తాను ! నాహక్కులను నిలుపుకుంటాను.

వెంక : (పట్టుకొంటూ) ఎక్కడికిరా నాయనా, యీ దెబ్బలతో.

విశ్వం : ఎక్కడి కేమిటి ! కూడుపెట్టే భూములే పోతుంటే ఎందుకీ వృత్తి ? మనలో ఎవరైనా దున్నుతుంటే ప్రక్కన ఈ వైద్యవృత్తితో కాలం గడపవచ్చు ననుకున్నాను. ఇక లాభం లేదు. వెడతాను.

జాన : (లేస్తూ) ఇదిగో నేనూ వస్తున్నా !

స్వామి : (లేస్తూ) ఇదిగో నేనూ వస్తున్నా !

రాఘు : (చివాలున లేచి) ఏమిటీ ఆవేశం? నేను లేననుకున్నారా ? అంతదాకా వస్తే నేనూరు కుంటానాయేం? కూర్చో ! ఈపాపి

కొట్టిన దెబ్బలు మానేదాకా నీవు ఇంట్లోనే వుండి వైద్యవృత్తి చెయ్యి. ఇక చూద్దాం నాకు చేతకానప్పుడు నీ సహకారం. (అక్కడ సుబ్బన్న వేసి వెళ్ళిన నాగలి నెత్తుకొని రాఘవయ్య వెళ్తాడు-పేడతట్టతో లింగన్న ప్రవేశం-అతనికి కాస్త చెవుడు.)

లింగ : ఇదేందిదొరా! అయ్యాల్నెవ్వో గడిబిడిగుందివారం?

వెంక : వారూ, దున్నటానికి పొలానికెడుతున్నారు.

లింగ : (వినపడదు) ఏందమ్మా! చుబ్బిగాడు లేడనా? అడు చంగ పోల్ల కాడికి పాయినట్టుందది.

స్వామి : అదికాదురా! తాతయ్య దున్నటానికి పొలాని కెడుతున్నాడు.

విశ్వం : స్వామీ! ఎవర్నీ అరే! అనకూడదనలే. అన్నా! అనాలి. లింగన్నా అనాలి!

లింగ : (ఆ వినబడ్డ పేరు తనదనుకొని విశ్వంవద్దకు వెళ్ళి) ఏందుండీ పిలిసిను?

విశ్వం : అబ్బ, చెవిటి మాలోకం! (పెద్దగా) నిన్నుకాదులే. ఏరా స్వామీ! లింగన్నకు రోజూ చెవిలో మందు వెయ్యటంలే?

స్వామి : వేస్తుండబట్టే ఆకాస్త వినబడుతున్నది. ఇక లేకుంటే......

లింగ : నన్నుకాద్దొరా? అరే! అని కూకేత్తిరిగదా?

జాన : ఓరి నీచెవుడు కాలిపోను, ఏదోకాని నీపని నీవు చేసికో పో నాయనా!

లింగ : ఏందుండీ! పోయి చుబ్బిగాన్ని పిల్చుక రమ్మంటరా?

జాన : కాదు—కాదు.

లింగ : మరేందుండీ? గట్టిగ శవుల పడేట్టు అరువురి!

జాన : (గట్టిగా) ఇకనుంచి మేం పొలం దున్నుతాం. అందుకనే మామ గారటు వెడుతున్నారు.

లింగ : ఏందీ? మీరు దున్నుకోటమే! చుబ్బిగాడు పాయిండనా?

జాన : కాదు, కాదు. ఇక ప్రతిరోజూ ఇంతే.

లింగ : మరి సన్ను జీతం మానిపిత్తరా ఏందుండీ ?

జాన : ఇకముందు నీవు జీతం చేయుటం కాదు. మాతో పాటే దున్న టము, అనుభవించటం అంతే.

లింగ : మేపుంటే మీరెందుకుండీ ?

విశ్వం : ఏం ? మేం దున్నుకో గూడదా, మా భూమిని ?

లింగ : ఎట్టనయినఁ శాతకావొద్దుండీ ?

జాన : చేతకాకేం చేస్తుంది ? మీలాంటి రెక్కలేగా మావీ.

లింగ : గంతేలేరి గాని, ఎట్టనైన కట్టంగాదుండీ ?

విశ్వం : కష్టపడకుంటె ఖానా ఎల్లాగోయ్ మరి ?

లింగ : మీకేపుండీ, నాల్గు చూదు లెక్కచ్చి పరాకత్గ కూనుంటె పైస లొల్తయి.

జాన : దాంతో మనమందరమూ ఎలా బ్రతుకుతాం ? అందుకని ఎలాగూ కష్టపడి వ్యవసాయం చేసుకోవాలి.

లింగ : గదైతెమాత్తరం మీరు కూకుంటె మేం సెయ్యావాఁ అని.

విశ్వం : చేశారో లెదో ఇంతవరదాకా గడచి పోయింది. ఇకముందు మీరూ మేమూ కల్సి పనిచేద్దాం. ఏమంటావ్ ?

లింగ : బల్సేసైన మాట లేరిగని, పేడ తియాలెహ, పొతాండ. (తట్టతో వెళ్తాడు. తండ్రిని మెడబట్టి గెంటుకుంటూ ప్రభా కర్ సుబ్బన్నతో ప్రవేశం.)

ప్రభా : ఇప్పటిదాకా కాలుమీద కాలు వేసికొని పెత్తనం చలాయిస్తూ మా సుబ్బారావును చచ్చేట్టు కొట్టి ఇవాళేమో నేరని పత్తిత్తు లాగా దున్నడాని కెడుతున్నావేం పాపం !

స్వామి : సుబ్బన్న వచ్చాడే అమ్మా ! (సుబ్బన్న భయపెడ్తాడు)

వెంక : మధ్య ఇదేమిట్రా ప్రభాకర్, యీ గడుసుతనం! ఎక్కడో సంఘాలంటూ పనిచేసుకునే వాడివి చేసుకోక యీ అల్లరంతా ఏమిట్రా?

ప్రభా : నోరుముయ్! మాసంఘానికి ఫిర్యాదు వస్తేనే యిలా వచ్చాను.

విశ్వం : ఏమిట్రా ఫూల్! తల్లీ తండ్రీ అనకుండా ఏమిటా వాగుడు?

రాఘు : నీవూరుకో విశ్వం! వాళ్ళు నేను తప్పలేక పొయ్యానా గాని, ఆ మహానీయుని కోర్కెలేమిటో కనుక్కోనియ్యి ముందు.

ప్రభా : ముందు నాకొక వెయ్యి రూపాయిలిలాయివ్వు.

రాఘు : ఏం? రూపాయలంటే చెట్టుకాస్తున్నాయనా నీఊహ?

విశ్వం : కాదు; చప్పులకు వ్రేలాడుతున్నాయని.

ప్రభా : అరే! మధ్య నిన్నెవరూ మంపలించలే. అనవసరంగా వాగబోకు తెల్సిందా?

వెంక : ఎందుకా పెద్దాచిన్నా లేని వాగుడు?

జాన : ఎంత కార్మిక నాయకులైతే మాత్రం కొండెత్తు సింహాసనం మీద కూర్చోండి గాని ఎందుకీ విరగబాటు?

ప్రభా : నోరుముయ్యవే పక్షీ.

స్వామి : (రివ్వునలేచి) ఏయ్, ఒళ్ళు పొగరెక్కిందా? మా అమ్మనలా అంటావెందుకూ?

ప్రభా : ఓరి కుర్రకుంకా! తంతే మూతిపళ్ళు రాల్తాయి తెల్సా?

రాఘు : ఊరుకోరా స్వామీ! ఊరుకో నాయనా!

ప్రభా : ఇంతకూ నాకు డబ్బిచ్చేదుందా? లేదా?

రాఘు : ఎందుకు?

ప్రభా : ఎందుకైతే నీకెందుకు? మా సంఘానికి విరాళ మివ్వాలి.

రాఘు : నావగ్గరొక్క దమ్మిడీ లేదు.

ప్రభా : అపక్షి డాక్టరీ చదువుకు మాత్రం పంపుతావేం?

రాఘు : నీవూ చదువుకో ! ఇస్తాను.

ప్రభా : నేనూ చదువుకోటం మొదలెడ్తే మా సంఘాలేమైపోవాలి ?

విశ్వం : ఏం పర్వా లేదు. ఈ కుంకామూలే నేమిటి సంఘాలు నడిపేది?

ప్రభా : కాస్త (సుబ్బన్నను చూపి) మాఫార్స్‌ను చూసి మాట్లాడు.
ఇంతకూ ఇచ్చేదుందా, లేదా ? చెప్పవేం ?

రాఘు : నాదగ్గరొక్క చిల్లి గవ్వయినా లేదన్నాగా .

ప్రభా : మరి చదువుకుంటానంటే ఎలావస్తాయి ?

రాఘు : చెరబోయి భూమి తాకట్టు బెట్టి తెస్తాను, బాగుపడ్తానంటే.

ప్రభా : ఆభూమి నిప్పుడు తాకట్టు బెట్టు.

రాఘు : ఆ. ఇక నీకోసం పెట్టాల్సిందే తాకట్టు !

విశ్వం : పాపం వచ్చావని.

ప్రభా : అయితే నాభాగం నాకు పంచివ్వు !

రాఘు : నీకో భాగం కూడానా ఏమిటి ?

ప్రభా : అంటే ?

రాఘు : అంటె యేముంది ? కొంప వదులుతున్నావుగా !

ప్రభా : అయితేమాత్రం కొడుక్కు భాగం ఉండదా ఏం ?

రాఘు : ఆహా కొడుకువు ! పుట్టావు సుపుత్రుడవు . కొంపలో ఉన్న
వానికే హక్కు .

ప్రభా : నాహక్కు లేదంటావేం ?

రాఘు : ఆపప్పులుడకవు. నాతోపాటు దున్నుకొని బ్రతుకంతే .

ప్రభా : మరి, వాడు దున్నుతాడా ?

రాఘు : వాడికేం ? వాడు మగరాయడు. అవసరమైతే దున్నుతాడు.
లేదా, హాయిగా వైద్యవృత్తితో కాలం గడుపుతాడు. మరి నీవో?

ప్రభా : నాయిష్టం. నేనెలాగో కాలం గడుపుకుంటాను.

రాఘు : అయితే ఇంకేం ? నీయిష్టం, ఏమైనా చేసుకో పో

ప్రభా : ఎలా ?

రాఘు : ఏమో, ఎలాగో.

ప్రభా : అవేం అర్థంలేనిమాటలు ?

విశ్వం : అవును.. మీరు చెప్పె ధర్మసూత్రాలేగా. నీకు హక్కుందం టావా దున్నుకో ! లేదా చదువుకో, డబ్బిస్తారంతే.

ప్రభా : అంటే ఏమి ఇప్పుడుండా ఎగ్గొట్టే ఎత్తున్నమాట ఇది.

విశ్వం : అవునోయ్ ! సోమరితనంగా జీవిస్తానంటే ఎవడిస్తాడోయ్ డబ్బు ? సంపాదించుకో, కష్టపడి !

ప్రభా : అహాఁ ! ఇదా మీకుట్ర ?

రాఘు : కుట్రేం కుట్రోయ్ ? నీవెక్కడో బలాదూరుగా తిరుగుతూంటే ఎవడు కూచోపెట్టి పెడ్తాడనుకున్నావ్ ?

ప్రభా : ఆఁ! ఎంతమాట ! నేను ప్రజాసేవ చేస్తూంటే మీరిలా బలా దూర్ వ్యవహార మంటారుకదూ ! మావాళ్ళతో తీర్పు చెప్పించి, యేం చేయిస్తానో చూడు ! ఇక మీకు భూమి లెలా దక్కు తాయో , మీకు దున్నేవా రెవరుంటారో చూస్తాగా ! (వెడతా రిద్దరూ. సుబ్బన్న స్వామిని పుఁడిపిస్తాడు.)

రాఘు : ఒకరు దున్నేదేమిటోయ్, మేమే దున్నుకుంటాం.

అంతా : మేమే ! మేమే !

విశ్వం : ఏమిటీ నీ బెదిరెంపు ?

వెంక : ఏమిట్రా నాయినా ! మన ప్రభాకరం బాగు పడేది లేదారా ?

విశ్వం : ఏమిటోనమ్మా ! వాళ్ళదంతా విచిత్రతత్వంగా ఉంది. మొన్నటిదాకా కాస్తో కూస్తో బాగుపడే వేషాలే కనపడ్డాయి గాని, ఇప్పుడు వట్టి రౌడీ మూకైపోయింది. బలవంతంగా చం పడం, దోపిళ్ళు చెయ్యడం ఎక్కువైపోతున్నాయి.

వెంక : ఏమోనాయనా ! ఏపోలీసువాళ్ళచేతిలో పడ్తాడో యేమో !

రాఘు : ఏం చేస్తావేఁమరి ! చిలుకకు చెప్పినట్లు చెప్పాం. చివరకు వాడు చెప్పినట్లల్లా విన్నాం. ఈవేళ ఇలా మారాడంటే యేం చెయ్యగలం చెప్పు !

వెంక : ఏమోనండీ ! బెదిరించి వెడుతున్నాడు. ఏం చేయిస్తాడో, యేమో.

విశ్వం : ఏడిశాడు.

జాన : అలా అనకండి. ఇప్పుడు వాండ్లు పూర్తిగా పాపానికొడి కట్టు తున్నారు. దేనికైనా సిద్ధమే.

విశ్వం : అది నిజమే కాని, అలాగని మన మలక్ష్యంగా ఉంటామా ?

స్వామి : చూచావా తాతయ్యా! సుబ్బులు నన్ను వెనుకనుండి బెది రించి వెడుతున్నాడు .

వెంక : ఇక వాడు కాస్తా నాన్నమీద ఏం ప్రచారం చేస్తాడో ?

విశ్వం : అదే నేను చెప్పడంలా ! ఇప్పుడు ఇదివరకు కాలాలుకావు. పరిస్థితులకు తగ్గట్టు నడచు కోవాలి. ఎంత ఇదైనా ఇంకొక ళ్ళను అలాకొట్టడం, అందులో కూలీలను ఈరోజుల్లో కొట్టడం మరీ పనికిరాదమ్మా.

వెంక : మరెలా బాబూ ?

రాఘు : ఏమున్నాగానీ, జడుస్తామా యేమిటి ! ఏదో జరిగిపోయింది. రోట్లో తల దూర్చాం. భయమెందుకూ ?

విశ్వం : సరేగాని వాడి కోర్కెలు చూశారా ? వారు దున్నడట, చదప డట. మనంమాత్రం కష్టపడి వాడికి తిరగడానికి డబ్బి వ్వాలట. ఇలాఫుంది, వాడి ప్రజాసేవ !

జాన : ఎందుకొచ్చిన సేవలివి ?

రాఘు : మనుష్యుల కోయడానికీ, చంపడానికీ .

# రెండవ రంగము

## రహస్య మందిరం

[డ్రాయరు, కుర్చీలు, కొన్ని కాయితాలూ, ఫైళ్ళూ]

బ్రహ్మం : ఏం పుష్పగారూ ! ఏమిటీ విశేషాలు ?

పుష్ప : ఇంకా ఎన్నాళ్ళూ గారూ ! అని పిలవడం ?

బ్రహ్మం : అదేంమాటలెండి. ఎవరి గౌరవం వారికి ముట్టజెప్పాలి.

పుష్ప : ఇంత చనువేర్పడ్డాక కూడా అలా పిలవడం నాకేమీ బాగని పించదండీ.

బ్రహ్మం : ఎంత యిదైనా అలా పిలవడం ప్రజాశ్రేయస్సు దృష్ట్యా మాత్రం మంచిదికాదు.

పుష్ప : మన వ్యక్తిగత విషయాలు గూడా మాట్లాడుకోకూడదా ?

బ్రహ్మం : ఈ సంఘంలో యింకా వ్యక్తిత్వమేమిటి ? అయాం సారీ ! వ్యక్తిగతమేమిటి ? సంఘపరమేమిటి ? అంతా వొకటే. నీవింత స్వార్థపరురాలవనుకోలేదు.

పుష్ప : నేనా స్వార్థపరురాలను , మీరా ?

బ్రహ్మం : అదేంమాట పుష్పా ! నేను స్వార్థపరుడనా ?

పుష్ప : కాకుంటే నన్నీ సంఘంలో కెందుకు తీసుకొచ్చారు చెప్పండి?

బ్రహ్మం : నాకోసంకాదే. మన సంఘ అభివృద్ధికోసం, మన ప్రజల కోసం. ఏమంటావు ? ఆఁ! ఇంతకూ నీకిక్కడ స్వేచ్ఛగా వున్నట్లా ?

పుష్ప : ఆహా ! తమ దయవల్ల.

బ్రహ్మం : నా దయేముందిలే. అంతా, ఆ ప్రజల దయ.

పుష్ప : ఏమో ! నాకైతే మీదయే కనపడుతుంది ఎక్కువగా.

బ్రహ్మం : ఔను మరి. సంఘమంటే కనపడేదా ? వినపడేదా ? మన బోటి వ్యక్తుల కలయికే సంఘం.

పుష్ప : తమలాంటి గొప్పవ్యక్తుల కలయికంటే బాగేమో.

బ్రహ్మం : అదెలాగే, మనకంటె గొప్పవారు లేరూ ?

పుష్ప : మిగతావారి సంగతి మన కెందుకు గాని మీవరకు మీరైతే జిల్లానాయకులు గదా !

బ్రహ్మం : ఏదో ప్రజలు కోరుకున్నాక నాయకత్వం వహించక తప్పుతుందా యేమిటి ?

పుష్ప : ఎవరు కోరుకున్నారేం పాపం !

బ్రహ్మం : ఆఁ ఒకరు కోరుకోవాలా ఏమిటి ?... అయినా వాండ్లకేం తెలుసు పాపం ! అమాయకులు. మనం ప్రజాసేవ చేయదల్చుకోవడమే వాండ్లు కోరుకోవడం; వాండ్లు కోరుకోవడమే మనం ప్రజాసేవ చేయదల్చుకోవడం.

పుష్ప : బలే నిర్వచనాలు.

బ్రహ్మం : అవునుమరి. అక్షరాలా అంతేకాక ఏమిటి మరి ?

పుష్ప : సరేకానిండి, నానృత్యం ప్రజల్లోపెట్టిస్తామన్నారు. ఇంత పరకూ మీకు దయ రాలేదుగా !

బ్రహ్మం : మళ్ళీ మన దయంటావు ! మనదేముంది ? అంతా ప్రజలది. వాండ్లదయే కలగాలి.

పుష్ప : వాండ్లకేంతెలుసు పాపం ! అమాయకులు. మనం నృత్యం చేద్దామనుకోవడమే వాండ్లకు దయ కలగడం; వాండ్లకు దయ కలగడమే మనం నృత్యం చేద్దామనుకోవడం.

బ్రహ్మం : వెరీగుడ్. సూత్రాన్ని క్షణంలో భట్టిపట్టేగావు. దానికి మా ప్రజాసేవక సంఘం తరఫున ధన్యవాదా లర్పిస్తూ — ప్రజలందరి తరఫునా నే కోరే దేమంటే ప్రస్తుతానికి తమ గాన మాధుర్యాన్ని చవి చూపించాలని.

పుష్ప : అబ్బ ఎన్నాళ్ళ కెన్నాళ్ళకండీ.

నిదుర మేల్కొనుము కూలి
దేశానికి నీవే మాలి
నీశక్తి చూపుమో ధీరా ..... ।నిదుర।

పిరికి తనంబును విడి
ప్రజల క్షేమమును గోరి
తుపాకి బట్టుము భాయీ ..... ।నిదుర।

నీతి కోసమని యెపుడు
నియమంబులనే మరచి
నీరస పడకోయీ వీరా ..... ।నిదుర।

బ్రహ్మం : అబ్బా ! ఎంత గొప్పగా పాడావు పుష్పా ! ప్రజలంతా మోహితులౌతున్నారు నీ గాన మాధుర్యానికి.

పుష్ప : ఇక్కడ ప్రజ లెవరున్నారని, అనడానికి?

బ్రహ్మం : అఁ! ఇక్కడ కాకపోతే యింటిదగ్గర వుంటారనుకో. ప్రజల అభిప్రాయమే మన అభిప్రాయం. మన అభిప్రాయమే ప్రజల అభిప్రాయం. ఏది చేసినా ఏది మాట్లాడినా వాండ్ల తరుపున్నే మనం మాట్లాడాలి.

పుష్ప : ఏమిటో ఎప్పుడూ ప్రజలూ, ప్రజాసేవ, ప్రజాశ్రేయస్సు (కాగితాలు తిరగేసి) ఏమండీ బ్రహ్మంగారూ! ఇదేమిటో కాస్త చెప్పండి. మొన్న కొందరు ప్రజాద్రోహులను హతమార్చినప్పుడు వాండ్లవద్ద దొరికినవి:—

ఒకటవ క్రూరుడు, నాజీహిట్లరువద్ద పదివేల రూపాయలు నాల్గు ఉంగరాలు, ఒక జరీ కండువా—

2 వ ద్రోహి ముస్సోలినీవద్ద వక గడియారం, బంగారపు గొలుసు, వెండికడియాలు, తర్వాత ఏమిటో అర్థం కావడము లేదండీ

( ప్రభాకర్ ప్రవేశం )

బ్రహ్మం : ఒహోహో! ప్రభాకర్ వస్తున్నట్లున్నాడు. ఏం ఒక్కడవే వచ్చావు, మన సుబ్బన్న వాండ్లూ ఎటు వెళ్ళినట్లు?

ప్రభా : ఏదో కొందరు దళంలోకి వస్తామన్నారంటే కొట్టుకోరమ్మని పంపాను.

పుష్ప : ఏమండీ! మీ అన్నగారి పోలసీ యిప్పటికైనా మార్చుకునేట్టుందా ?

ప్రభా : మంత్రాలకి చింతకాయలు రాల్తాయటండీ? కాస్త మన తడాఖా చూపించంది లాభంలేదు.

బ్రహ్మం : మనమంటే పాతకాలపు మనుషులనుకుంటున్నాడేమో పాపం.

పుష్ప : అలా మోసపడే వాండ్లలో అతనొకడేమిటట.

ప్రభా : ఏదేమైనా వాడిమీద మనసు షైరెక్టుగా దెబ్బతియడం కష్టం.

బ్రహ్మం : ఏం ?

ప్రభా : ఎలాగైనా వాడికీ ప్రజల్లో కాస్తోకూస్తో పలుకుబడి వుంది కదూ, అందుకని మనం మరోమార్గం తొక్కాలి.

పుష్ప : పోనీ ఏంచేద్దామంటారు ?

బ్రహ్మం : మనవాండ్లందరితో ఆలోచిద్దాము, ఏమంటారు ?

ప్రభా : అలాగే !

పుష్ప : ప్రభాకర్ గారూ ! మనం చాలా విషయాల్లో అవినీతిగా ప్రవర్తిస్తున్నట్టు ప్రజాభిప్రాయ మైనప్పుడు ఏదైనా మార్పుకోవటానికి వీలుండదా ?

బ్రహ్మం : నీతి, అవినీతి సంగతి ప్రజలకేం తెలుసునండీ ? మనం నడిపిస్తే నడిచేలోకం, పాపం ! అయినా- యీ బూజుపట్టిన పాతలోకానికి మన నవ్యభావాలెలా అర్థమవుతాయి ?

ప్రభా : మీరన్నదీ నిజమే కావచ్చు కానీండి పుష్పగారూ ! మనమిక వెనక్కుగూడా చూచుకునే పరిస్థితి దాటిపోయిం దనుకోండి. మంచి కానీండి, చెడుకానీండి ముందుకు సాగిపోవలసిందే, తప్పదు.

పుష్ప : నేను భయపడ్తున్నానని కాదు చెప్పేది. ఎప్పుడైతే మనవిధానం ప్రజలకు కొంత వ్యతిరేకంగా వుంటుందో అప్పుడే ఆలోచించు కోవడము మంచిదేమోనని.

బ్రహ్మం : మంచిదేకాని, అదంతా నిర్ణయించ వలసింది, ఆలోచించాల్సిందీ మన హైకమాండు. మనం నిజమైన సంఘ సభ్యుల

మనుకుంటే, ఆ కార్యక్రమాన్ని తూచా తప్పకుండా అమలు జర్పాలి.

ప్రభా: అవునుమరి. ఈ జీవన్మరణ పోరాటంలో మనం, వెనుకంజ వేసి అటూ, యిటూ కాకుండా పోతే ఎలా ?

పుష్ప: మధ్య వెనుకంజ వేయుటమనే సమస్య యిందులో చేరేనాడే వదులుకున్నా మనుకొండి. కాని, మనకు ఆప్తులైన వాళ్లు కూడా చాలామంది దూరమౌతున్నారని చింత. అంతే!

ప్రభా: కావచ్చుమరి, మనకవంతా మునుపటివాళ్ళేగా. ఆమాటకొస్తే యీనాడు చివరకు, మానాన్న మాఅన్న- అందరూ నాకు వ్యతిరేకులు కారూ ?

బ్రహ్మం: ఏమిటో పుష్పగారు తికమక పడుతున్నట్లున్నారు.

పుష్ప: బ్రహ్మంగారు పొరపడుతున్నట్టున్నారు. అలాగైతే, నేనుస్త్రీ యుంగా భర్తహత్యకు ఒప్పుకుంటానా ?

ప్రభా: పట్స్ డీ వే. నిజమైన ముక్కన్నారు. నిండా మునిగితే చలే లేదు.

ప్రభా: అదీమాటన్నారు, బాపుంది.

బ్రహ్మం: అనన్య సామాన్యమైన ముక్క కదూ! చేతినిండా పని లేకపోబట్టి నీకు యిన్ని పిచ్చి ఆలోచనలూ వెర్రిపూహలున్నూ. మన సుబ్బన్నా వాళ్ళూ వస్తున్నట్టున్నారు. ప్రభాకర్! నీవు వాళ్ళతో మాట్లాడుతూ ఉండు. నేనూ పుష్పగారు యీ కార్యక్రమాన్ని చూస్తూ వుంటాము. (పుష్ప బ్రహ్మంలు లోని కెడతారు. సుబ్బన్న, వెంటన్నతో వస్తాడు)

ప్రభా: మంచిది. అఁ, కూర్చోండి. ఏం సుబ్బన్నా! కడుపునిండా భోంచేసారా ?

సుబ్బన్న : మన చంగంల జెరిసంక-బువ్వ బట్టకేం కరువు ?

ప్రభా : ఇంకా అప్పుడే మన ఆశయం పూర్తి కాలేదు.

సుబ్బ : గప్పుడే ఐపోతె ఎట్లనుండీ.

ప్రభా : (పెంటన్నతో) ఆఁ ! మీపేరు ?

పెంట : పెంటిగాదంటరుండీ.

ప్రభా : అలా అనుకోగూడదు. పెంటయ్య అనాలి. ఆఁ ! అయితే, పెంటయ్యగారూ ! మీబాధ లేమిటో చెప్పారు కాదు.

పెంట : అయ్యోదొరా ! నన్ను గారంటరేందుండీ ?

ప్రభా : సరేగాని యికనుండి నన్ను దొరా అనకూడదు. తెల్సిందా ?

పెంట : ఆదేందుండీ పెద్దలు గామాటంటె మెమెట్ల బత్తం, మీ దయుండాలి గనిరి.

ప్రభా : ఇక్కడ పెద్దా, చిన్నా అనే తేడా వుండదు.

పెంట : అదెట్లనుండీ ! ఎట్లనైన సదువుకున్నోరు.

ప్రభా : ఏంచదువుల్లే ! వెధవబానిస చదువులు-మానెగాలేగాని, నన్ను దొరా అని పిలవడం తప్పు. సోదరా ! అనాలి.

పెంట : ఎబ్బెట్టుగుండదుండీ ?

సుబ్బ : (పెంటన్న తలమోది) ఓరంధా ! నీసోదె నువ్వుగని అరు సెప్పేదేంటె యినిపిచ్చుకోవుగదా !

పెంట : చర్లేరి-అడుగుతిదొరా (నాలిక కరుచుకొని) ఆఁ ! చోదరా ; ఎబ్బె. ఏఁవుండి అంటలేరి.

ప్రభా : అలాగే గాని, మీ బాధలు చెప్పావుకాదు.

పెంట : ఏంబాద లుండయుండీ ?

ప్రభా : ఏమిటోయ్, సుబ్బన్నా ! ఇలాంటివాణ్ణి కొట్టుకొచ్చావు ?

సుబ్బు : ఏదో మనిసి గట్టిగుంటె తీసుకొచ్చిన. అయినగని యీణ్ణీ జీతం ఉంచుకున్నేరు ఎప్పుడు కొడుతుంటరంట.

ప్రభా : ఏం పెంటన్నా! మీ యజమాని, నిన్నెప్పుడూ బాధిస్తుంటాడా?

పెంట : గప్పుడప్పుడు జీతానికి పోకపోతే.

ప్రభా : పాపం! అలాగేం, చూశావా! నీవు రాత్రింబవళ్ళు కష్టపడి పనిచేస్తూ భూమి దున్నుతున్నా నీకీ తన్నులు తప్పడం లేదుగా!

పెంట : ఊకెనే ఎందుకు తంతరు గానీరి, యేంజేత్తమ్మరి?

ప్రభా : ఏం చేస్తావేమిటి? ని శక్తిని చూపాలి.

పెంట : గదేంటో నాదగ్గర లేదుండీ.

ప్రభా : నీకు తెలియదా విషయం. నీ చేతిలోనే ఉంది.

పెంట : (చేయిచూచుకొని) ఏది? లేదుపండీ.

ప్రభా : ఉంది నే చూపుతాగా!

పెంట : సూసుకున్నసుండీ! గీతలుంటయంతే.

ప్రభా : అలా గాదు. నే చెప్పుతా గాని, నీకు కూలీలేకంగావలెరా అనే పాటొచ్చా?

పెంట : ఎందుకేకంగావాల్నండీ?

ప్రభా : పోని-నీకు సుఖపడాలని వుందా?

పెంట : అయ్యో ఉండదుండీ.

ప్రభా : అయితే, నీకేంకావాలో చెప్పు!

పెంట : (సుబ్బన్నవైపు చూస్తాడు.)

సుబ్బు : (అందిస్తాడు) కడుపునిండబువ్వ.

పెంట : కడుపునింద బువ్వ.

ప్రభా : ఇంకా?

సుబ్బ : కట్టుకునెటందుకు-మంచిబట్ట.

పెంట : కట్టుకునెటందుకు మంచిబట్ట.

సుబ్బ : ఉంచేందుకు పెద్దమేడ.

పెంట : ధనెపా! మేడ లెట్టొత్తయిలేరా, అన్ని కూలగొడ్తానుగద.

ప్రభా : అయితే ఏంలే. అవన్నీ నీకు వస్తాయిగాని, ముందు నీవీ సంఘంలో చేరాలి. ఇక నీవేమి చెయ్యాలంటే-జీతం మానెయ్యా లంతే. అప్పుడు మేము చెప్పినట్లల్లా ఆ ప్రజా ద్రోహుల, అంటే నిన్ను బాధించే వాండ్ల నన్నుమాట-శిక్షించొచ్చు. వాండ్ల ఆస్తులు పోచెయ్యొచ్చు, నికసి తీర్చుకోవచ్చు-ఆభూములు, ఆ యిండ్లు, అవన్నీ మనవే. ఏం? బాగాలే.

పెంట : అదెట్ల సాద్దైవెద్దుండీ ? తప్పుగాదురుండి ?

ప్రభా : నీకెందుకూ ? మేం చూస్తుతాంగా-ఏంతప్పులేదు. అయితే మా సంఘంలో చేరుతావుగా ?

పెంట : మీ యిట్టం.

సుబ్బ : అన్ని యిషయాలు నేను సెపుతగానీరి, యింక మీరెల్లురి.

ప్రభా : సరె. (లోనికివెడతాడు)

సుబ్బ : పెంటన్నా! అట్టమాట్టాడ వేవేఁ? నాతో ఆడ జెప్పిందేంది ? యీాడ అంటుండదేంది ?

పెంట : దీని గడబిడేందో అంతుపట్టటం లేదెహె.

సుబ్బ : ఏవుందే! మనమ్మసం, అంతా పోటి. మనకాడ తుపాకు లుండై. ఆదొరోల్లను, రైతోల్లను సంపిన్నే వోఁ; దోసుకొచ్చింరేఁ వోఁ; అయిగగూకోని తిన్నరేఁవోఁ;

పెంట : (భయపడి వెళ్ళబోతూ) ధనెపా! నాకు బయవఁయితాంది. పోతనెహె, పోలీసోండ్లు సంపరె ?

సుబ్బ : (ఆగి) చరెగాని, యాడికో పోతుండవూ? ఇండ్లకొచ్చినాంక బైటకి పోటానికి యీల్లేదు. ఏమైనాగాని, మాతోపాటు పెజా సేవ చెయ్యాల్సిందే, చుకపడాల్సిందే. పోలీసోల్లు మన నెందుకు పట్టుకుంటరు? ఎబ్బె.

పెంట : అంటరు గద.

సుబ్బ : మన యెతిరేకులు — పచ్చిఅబద్దాలు మాట్లాడ్తరు. నమ్మ కూడదు.

పెంట : అదిగో! రాగయ్యగారి జీతగాడు - నీతోటోడు లింగడు బోతుండడు. ఆన్ని పిలుద్దాయాఁ?

సుబ్బ : పిలు.

పెంట : (గట్టిగా) లింగిగా!

లింగ : (బయటనుండి ఓ అని అరుచుకుంటూ వచ్చి) ఏందిరో చుబ్బిగా! యాడుంటవూ?

సుబ్బ : (అరవకని సైగ చేస్తాడు)

లింగ : ఓరు, మన సినదొరుంటడా?

సుబ్బ : అఁ అఁ;

లింగ : పోనా ఆడికి?

సుబ్బ , పోటాని కీల్లేదు. మా సంగంల జేరాలె.

లింగ : అంటేందిరో? నువ్వు జెరినావుర పెంటిగా!

పెంట : గిప్పుడే సేరిన్నే.

లింగ : అంటేందే?

పెంట : అఁ ఏవుండదే! జీతం పూరొవాలంతే.

లింగ : మరి బువ్వో?

సుబ్బ , ఈడ వుంటది గద.

లింగ : ఇదేమన్న సత్తర నాంనె ?

పెంట : కాదే. మనపంత ఓటిగావాల్నే.

లింగ : ఇప్పుడు ఓటిగాక, కొట్టక సస్తున్నావేం ?

సుబ్బ : అట్లగాదె, కూటకిలేనోల్లంత ఒక సంగం పెట్టుకొని, బాగు పడాల్నే.

లింగ : దానికేంవేం ? గట్టసెగని మీరంత జీతాలెందు కూకున్నరే ? పాపం, అరాగయ్యాగారు ఎంతకట్టపడ్తుంతనుకున్నొ !

సుబ్బ : అడిగతి అంతే గావాల్లెరా ?

లింగ : నీకాడ నాయం లేదహె. నీకోసంగాదె ఇస్సయ్యాగారు దెబ్బలు దిన్నది.

సుబ్బ : ఓడు దినమన్నడు ?

లింగ : ని మడుసెంతకటినవేం!

సుబ్బ : మేము ఓడైనా సరె—తప్పు జేస్తె మా పోడైన సరె కొడ్తం.

లింగ : మీ అయ్యానైన ?

సుబ్బ : ఓ.

లింగ : మీ అమ్మనైన ?

సుబ్బ : ఓ.

పెంట : తప్పుగాదె చుబ్బనా ?

లింగ , గట్టుడుగె పెంటన్నా !

సుబ్బ : తప్పేం తప్పు ? మేం నాయం దప్పంగా. మేం నాయంకోసం ఎవ్వయినా సరే ఎదురుకుంటాం.

లింగ : ఐతే సంగం గాని, సెలవిక సహో. (వెళ్ళిపోతాడు)

పెంట : (లాగి) అట్టకాదే ! దానెవారవింను చెప్త.

సంగంల జేరితే ఓరన్నా
బల్ సర్దార్లు అయితరట లింగన్న
బంగారు సొమ్ములూ బాగ వేసుకుంతయుంటి
అంగీలు దోతులూ అన్ని మనయేనంట
బంగలాలొత్తాయి ఓరన్నా మనకు బాగ్యవేం
కలుగుతది లింగన్నా ॥సం॥

అద్దరేత్తిరికాడ-నిద్దరొతుంటెను
పెద్ద పెద్దోల్లను గుద్ది సంపెత్తరట
కలకటేర్లము మనమె లింగన్నా
మనకు కామందు సుబ్బన్న ఓరన్నా ॥సం॥

పెంటన్న : ఇన్నవా ? గదీ యెవారం.

లింగ : అయితె ఆయెగని నేను బోతనహె-అమ్మో !

సుబ్బ : (లాగి) నువ్వాళ్ళ జీతం వూకుంటావా ! లేదా ?

లింగ : అం! నువ్వాకున్నవని నే వూకుంటనా? మేం మయ్యాకాణ్ణించి వుంటాండం ఆడ. అయినా యింగ జీతన్వాడిచే ? అంత కల్సి దున్నుకుంటాండం, అనుబగిత్తాండం. నాబుప్వ, నావుంటం, మావోల్లు అంత ఆడ్నే.

సుబ్బ : అట్టయితె వూకోవుగదూ ! (అని గబ గబా లింగన్నను కొడ్తుండగా ప్రభాకర్, బ్రహ్మం, పుష్పల ప్రవేశం)

ప్రభా : ఏమిటి సుబ్బన్నా అల్లరి ?

సుబ్బన్న : లింగిగాడు జీతం వూకోసంటుండడు.

బహ్మం : నాలుగంటించలేక పొయ్యావూ?

పెంటన్న : అమ్మో ! చుబ్బిగాడూకుంటడా ? మెడలిరిగేటట్టు దంచిండు లేరి.

పుష్ప : మంచిపనిచేశాడు.

ప్రభా : సరేగాని, సుబ్బన్నా! ఆరాఘుమయ్యగాడే స్వయంగా భూమిమీది కొస్తున్నాడటగా, దున్నడానికి.

పెంటన్న ; రాగయ్యగారోరుండీ ? మీ అయ్యగారానుండి?

ప్రభా : ఇంకా నాన్నట, నాన్న!అః, యింతకూ పెంటన్నా ! నీవిక యింటికి వెళ్లవుగా?

పెంట : ఏదో చుబ్బిగాడుజెప్పిండుగద, యెల్లనుతేరి.

ప్రభా : అయితే సుబ్బన్నా! ఆ రాఘవయ్యగాడ్ని జాగ్రత్తగా కనిపెట్టు. ఏలుచిక్కితే నీకసితీర్చుకో. మన ప్రజాకోర్టులో తీర్పయిందిలే.

సుబ్బన్న : ఓ! (మీసం మెలివేస్తాడు)

బ్రహ్మం : మరి, పుష్పగారి మొగుడున్నాడుచూడూ రామానుజయ్య. వాడికన్యాడా తప్పు చెప్పాం. ఆపని మన పెంటయ్యచేత చేయించాలి.

సుబ్బన్న : ఓ,అట్టనె... పెంటిగా! సదువిపాట.

(అందరూ చదువుతారు)

ధైర్యమూనిలేవరా- పిరికితనము వీడరా
సాహసించిముందు నడుపుమోయి ప్రజాసేవకా
ఓహెూ ప్రజాసేవకా
నిలుపలేరు యాజగాన నీకుఅడ్డుపడినవారు
ఎదురుతిరుగు వ్యతిరేకుల యమలోకముకంపరా
బూర్జువాలతొత్తులైన పోలీసులు మిలటరీలు
సాయుధముగవచ్చిగూడ చంపలేరు మనదళాల
"ధైర్యమూని"

(అంతాలోనికి వెడుతుడగా)

తెర

# మూడవ రంగం

## విశ్వం డిస్పెన్సరీ

[కొద్దిపాటి డాక్టరింట్లో వుండతగిన సామానూ, ఫర్నిచరూ. అనేకమంది రోగులతో బ్రహ్మం, పుష్పలు కూడా వచ్చి బల్లలపై కూర్చుంటారు. విశ్వం వరుసగా కొందరి జబ్బులు తెలుసుకొని మందులిచ్చి పంపుతాడు. బ్రహ్మం దగ్గరి కొస్తాడు.]

విశ్వం : ఏమండీ, మీకేంగావాలి ?

బ్రహ్మం : ఏమిటో జ్వరం తగులుతున్నదండీ.

విశ్వం : (థర్మామీటరు నోటవుంచి తీసి) ఇప్పుడేమీ జ్వరం లేదండీ.

బ్రహ్మం : ఏమిటో, సాయంకాలమప్పుడు ఎక్కువ సుస్తీగా వుంటుందండీ. విరేచనబద్ధకంగా కూడా వుంది.

విశ్వం : మంచిది. సీసా యివ్వండి (సీసా అందుకొని పుష్ప దగ్గరకు వచ్చి) ఏమమ్మా, మీకేంకావాలి ?

పుష్ప : బాధండీ బాధ.

విశ్వం : ఏంబాధమ్మా ?

పుష్ప : ఏదో పోటులా వుంది.

విశ్వం : ఎక్కడ ?

పుష్ప : గుండెలోనండీ.

విశ్వం : శ్వాస సరిగా వస్తూందా ?

పుష్ప : అలాగే అనుమానంగా వుందండీ. పరీక్ష చెయ్యాలి.

విశ్వం : సరె. సరె, (మిగతావారితో) మీరంతా కాస్త అగదిలో కూర్చోండి. (అంతా లోని కెళ్తారు. పుష్పను బల్లపై పడుకో పెడ్తాడు. పుష్ప వాలుచూపులు చూస్తూ వుంటుంది. విశ్వం సందేహించి) ఏమీ భయము లేదులెండి. కండ్లు మూసుకొండి.

పుష్ప : (నవ్వి) పర్వాలేదు. (విశ్వం అలాగే చూస్తుండగా పుష్ప గభాలున లేచి, విశ్వం మెడ కౌగలించుకొని పైగా) ఓయి బాబో ! రండి, రండి. ఆడదాన్నిచేసి యీ డాక్టరుగారు ఎంతపని చేస్తున్నాడండో, బాబో ! (అరుస్తుంది. లోనికి వెళ్ళిన రోగులంతా రంగమ్మీదికి పరుగెత్తుక వస్తారు. పుష్ప విశ్వం మెడ వదులుతుంది. పశ్వానికి ముచ్చెమటలు పోస్తాయి.)

విశ్వం : ఏమిటమ్మా, యీ పిచ్చివేషాలు ? ఇదేనా నీగుండె బాధ !

పుష్ప : (ఇక అందుకుంటుంది) ఇదేనటయ్యా నీమంచితనం ! ఏదో మంచివాడు, మంచివాడు, సత్ప్రవర్తనుడు అని లోకం అనుకుంటుంటేనా ? ఓరి నీదుంపతెగా ! ఎంతపని చేశావురా, ఒంటరిదాన్నిచేసి.

విశ్వం : అనవసరంగా అపనిందలు వేయకండి.

ఒకరోగి : ఏ ఆడదయినా అబద్ధాలయితే అంత యిదిగా మాట్లాడుతుందటయ్యా.

బ్రహ్మం : (అందుకొని) చూడవయ్యా ! ఏదో గొప్పవాడు గొప్పవాడు అని అనుకోవడ మిదేనన్నమాట.

పుష్ప : ఏదో మీరంతా వుండబట్టి సరిపోయిందిగాని......

బ్రహ్మం : అయ్యో పాపం! లేకుంటే, ఎంతకైనా సిద్ధుడేలాగుంది.

పుష్ప : ఏదో సత్పురుషుడు గదా అని నమ్మి ఎంతమంది ఆడవాండ్లు వస్తున్నారో పాపం!

బ్రహ్మం : తెలియనప్పుడంతే వచ్చారు. ఇంకా ఏంవస్తారు లెండి.

విశ్వం : అనవసరంగా మాట్లాడకండి. ఇక ముందు బయటికి నడవండి.

బ్రహ్మం : ఇక నడవకపోతే, యీ ధర్మబుద్ధి కలవాని యింట్లో కూర్చోబోతున్నట్లుందే ఏమో. ..

పుష్ప : ఇదేనా ఉచిత వైద్యాలయమని దేశమంతా కొనియాడ బడుతున్నది ?

బ్రహ్మం : ఈయనగారే నెమిటి విశాల హృదయుడూ, ప్రజాసేవకుడూ, ధర్మ నిరతుడూ అని పేరుగన్నది.

విశ్వం : సరే యిక ఏమో గాని, వెంటనె దయచెయ్యండి.

బ్రహ్మం : వెడతాంలెండి. మహానుభావుడిలా సీసా తీసుకున్నావు. అదిలా పారెయ్యి.

విశ్వం : (మందివ్వబోతాడు.)

బ్రహ్మం : మందెందుకులెండి ! పైగా విషం కల్పినా దిక్కులేదు. మా ఖాళీ సీసా మాకు పారేస్తే అదే పదివేలు.

పుష్ప : ఏదో మీబోటివారు అడ్డుపడబట్టి కానీండి. అబ్బా, ఎంత కూౄరమండీ. ఏదీ-గుండె సరిగా చూడని చూడని అని సాగ దీసి చూసి చూసి చివరకు అబ్బ ! ఎంతపనండీ! తల్చుకుంటే గుండె అవిసి పోతున్నాయి.

బ్రహ్మం : ఇకరండి. ఆ తుచ్ఛుల్తో ఎన్నంటె ఏముంది ?

పుష్ప : వాళ్లంటే ఏముంది, వాళ్లో గొప్పవాళ్లు చేసిన వాళ్ళనవాలె గాని.

బ్రహ్మం : చూస్తున్నాడు చూడు, నాలిముచ్చులాగా. వెడతామండీ మహాశయా, దయుంచండి. (అంతా వెళ్ళిపోతారు.)

విశ్వం : (విచారంగా) హమ్మా ! (కుర్చీలో కూలబడ్తాడు. జానకి ప్రవేశించి)

జాన : ఏమండీ, ఎంతవరకు నిజమండి ?

విశ్వం : నీకూ-నాపైన సందేహమేనా జానకి ?

జాన : లేకుంటె, ఆడది అంత తెగబడుతుందా చెప్పుకోడానికి ?

విశ్వం : నాకూ అదే ఏచిత్రంగా ఉంది.

జాన : ఆఁ ! కాకపోతే - ఏదైనా పరిహాసంగా...

విశ్వం : జానకీ ! ఇక నీవే అలా అంటే.. ...

వెంక : (గబగబా వచ్చి) ఏంరా నాయనా ! ఊళ్ళో అప్పుడే గోల గోలై పోతున్నది. ఎంతవరకు నిజంరా అబ్బాయీ ?

విశ్వం : పాపం, పుణ్యం-నాకూ ఆవిడకూ తెలుసు. నేను అబద్ధమంటున్నాను. నమ్మితే నమ్మండి. లెకుంటె నేనుమాత్రం ఏంచేస్తాను ?

వెంక : లోకం కోడై కూస్తుంటే అబద్ధమంటె ఎలారా ?

విశ్వం : అలా అంటే యిక నేను మాత్రం ఏంచేసేదమ్మా ?

జాన : ఆవిడకు మీమీద పగ యేముంటుందండీ ?

విశ్వం : ఏమీలేదు మరి.

వెంక : ఏమీలేందే ఎందుకలా అంటుంటనె సందేహం కలగదూ ?

విశ్వం : అదే తెలియకుండా వుంటమ్మా.

జాన : అంటే లోకం నమ్మొద్దూ ?

వెంక : పదిమంది వచ్చి పొయ్యే యిల్లుగదా, యిలా పరువు ప్రతిష్ఠలు పాడుజేస్తే ఎలారా ?

విశ్వం : నాకూ తెలుసునమ్మా ! పరువూ ప్రతిష్ఠల సంగతి. నాకూ భార్యా పిల్లలున్నారు కదా.

జాన : ఆసమయంలో భార్యను మరచారేమో !

విశ్వం : జానకీ ! నీవే ఇంత కటువుగా అంటె ఎలా బ్రతకాలి చెప్పు.

వెంక : అది మాత్రం ఏమంటున్నదిరా ? ఉన్న విషయం అంటూ వుంది.

విశ్వం : అబ్బ ! ఏమిటో తలనొప్పిగా వుంది. మీరిక్కడ్నుంచి వెళ్లండి. (చికాకు పడ్తాడు. వాళ్ళిద్దరూ వెడతారు. బ్యాక్‌గ్రౌండున పాట మొదలవుతుంది. విశ్వం poison అని వ్రాసి వున్న సీసాను తీసుకుంటాడు.)

నీతిని లోకము వీడే
మనుజుల నియమములే తెగిపోయే......

(విశ్వం విషాన్ని త్రాగబొయ్యేసరికి స్వామి గబగబా వస్తాడు.)

స్వామి : ఏమిటది నాన్నా ? poison.

(వెంకటమ్మ, జానకమ్మలు పరుగెత్తుకొస్తారు)

వెంక, జాన : ఏమిటి ఏమిటి ?

స్వామి : విషం !

వెంక : విషమా ! అదేంపనిరా ? అన్యాయంగా ప్రాపిరి తీసుకొనేటట్లున్నావు.

జాన : స్వామీ ! నీవే రాకుంటే నాన్న ప్రాణాలు తీసుకునేవారన్నమాట.

విశ్వం : ఎందుకే యింకా యీ బ్రతుకు? అక్కడ జరిగిన విషయమా అబద్ధం. మీరేమో చెబితే నమ్మరు-పరువు ప్రతిష్ఠలా మంటకలిసాయప్పుడె. ఇంకా యీ బ్రతుకెందుకమ్మా ?

వెంక : అదేమ్మాటరా ? ఏదో లోకం అనుకుంటూ వుందని అన్నామే గాని మాకేమన్నా పగవుండి అన్నామటరా ?

విశ్వం : అబద్ధమన్నాను; వెంటనే నమ్మాలి. మళ్ళీ రెట్టించి రెట్టించి అడుగుతుంటె నేనేంచెసెది ?

వెంక : మంచిపనె చెశాం అంతా. ఇవేళ ఎవరి మొహం చూశామో ఏమో.

జాన : వస్తుంటాయి యీలాగె అపవాదులు.

వెంక : కృష్ణునంత వానికే తప్పలేదు.

జాన , ఏంచేస్తాం మరి ? అనుభవించాలె.

స్వామి : ఏమిటె అమ్మా ! నాన్న ఏదొ...?

జాన : ఆఁ, ఏమిలెదు నాయనా ! ఊరుకో.

స్వామి : మరి యీ సీసా ఎందుకు తీసుకున్నాడే ?

జాన : ఏమిలేదులెగాని వూరుకో ! తాతయ్యొస్తున్నాడు.

(నాగలి భుజాన ఉంచుకొని చెమట కారుతూ రాఘువయ్య ప్రవేశించి నాగలటుప్రక్కన పడేసి)

రాఘు : ఏంరా నాయనా ! నీవూ సుపుత్రుడ వనిపించావే !

వెంక : ఏమీ లేదుగాని, మీరూరుకోండి.

రాఘు : ఏమీ లేకపోవడ మేమిటి ? త్రోవలో లక్షమంది నన్నీవిషయం అడుగుతూాంటె. ఇదేం అబద్ధమటనె. ఇంకా ఏమొహం బెట్టుకొని బ్రతికాడే ?

వెంక : అందాకా కూడా పోయిందిగాని-మీరింకా మాట్లాడి రెచ్చకొట్ట కండి.

రాఘు : ఏమిటో, యీ అబద్ధాల కమ్మి వెత ! (లోనికెడతాడు. లింగన్న పాట చదువుకుంటూ, తన ఒళ్ళును తానే కండవాతో కొట్టు కుంటూ ప్రవేశం.)

సంగమయ్యా సంగము మాయదారి సంగము మటుమాయ
దారి సంగమూ ఓ మాయా సంగమూ ॥సం॥

పొట్టకోసరం ఒకరి పొపుగుసేరి బతుకుతాంటె
సంగాల్ సంగాలంటూ బంగపరిసినారండి
సంగాలల సేరమని సంపుక తిన్నారండి
జీతం మానిందాకా జిమ్మదిసినారండి ॥సంగమయ్యా॥

(అంతా దిగాలుపడి చూస్తారు)

జాన : అదేమిటి లింగన్నా ?

వెంక : ఏమిటది, ఒకటే కొట్టుకుంటున్నావు ?

(లింగన్న శరీరాన్ని అలాగే 'సావు యెంపవ సావు' అంటూ కొట్టు కుంటుంటాడు.)

స్వామి : లింగన్నా ! ఏమిటా గమ్మత్తు ?

లింగ : ఇదానె! యీ యెదవచలీలం పడిత్తుంటదే. పడించోల్లనోల్లైనా చరే. అయ్యనైనా, అమ్మనైనా, వోరినైనా యాసుకునేదే.

జాన : బాగానే వుంది. నొప్పి లేవదూ ?

లింగ : నాకేంవుండీ ? నా చలీలం కాదుగదా !

వెంక : నీది కాకపోవడమేమిటి లింగన్నా ?

లింగ : కాదంటే కాదంతే. నాదైతె నన్నెందుకు పడిత్తది ? అందు కోసం కొట్టేది కొట్టేదే.

స్వామి : నేను కొట్టేదా లింగన్నా ?

లింగ : ఆఁ! మీవేరికి లేదా అక్కా. ఆ అక్కు నాదే.

వెంక : శరీరం నిన్నేమని బాధ పెడుతున్నది ?

లింగ : ఒసోస్ ! ఏంబాచెందుండీ ? ఒకచే పని సెయ్యనంటది; బువ్వ కావాలంటది.

వెంక : పని చెయ్యందే బువ్వెట్లా వస్తుంది లింగన్నా ?

లింగ : వత్తత్తల్లీ ! వత్తది. జీతం వూకోవాలంతే.

జాన : జీతం వూరుకోవడమంటే ?

లింగ : అంతేనుండీ. జీతం వూకొవ్వాలె, అందర్నీ కొట్టాలె, సంపాలె. బువ్వకేవుండీ. ఇన్నిబుద్దులున్నాంక బువ్వకు తక్కువైతాది ? (శరీరాన్ని మళ్ళీ కొట్టుకొంటూ) సూడుసండీ ! అసలే సెప్పిన మాటసటం లేదు. పెజాసేవ సెయ్యనంటే సెయ్యనంటుండది. ఎదవ చెలిలం !

జాన : ఇదంతా ఎవరో నెప్పిసట్టున్నారు. ఏం ?

లింగ : ఇంకోరున్నరు తల్లో ! మన సంగపోరే ! అదే-మన పెబయ్యో దొరా, బెమ్మంగాడూ, ఇంకో ఆడామె, పుసమ్మంటమ్మ పుసమ్మ ! ఇంకా మన సుబ్బిగాడూ, పెంటిగాడూ...ఆల్లంత.

జాన : ఓహెూ ! ఇదంతా వాళ్ళ నాటకమా ? ఇంకాయేం. కుట్ర బయట పడ్డది. అయితే యిందాక వచ్చి యింతగోల చేసిన పుష్ప, బ్రహ్మం అన్నవాళ్ళు వాళ్ళేనన్నమాట. ఓరి మీదుంప తెగా, ఎంత పని చేశార్రా !

వెంక : ఏమిటే నీవనేది ?

జాన : బ్రహ్మం, పుష్పలు అన్నవాళ్ళు కూడా ఆ సంఘంలోనే పని చేస్తున్నారన్నమాట. ఏరి పరువు ప్రతిష్ఠలు పోగొట్టి అపనిందల పాలు చేయడానికే ఈ కుట్ర పన్నారు.

వెంక : ఔరా ! ఎంత పన్నాగం పన్నార్రా !

లింగ : ఇంకంతేనానుండో ! అందరి బూవు(ల మీన జండాలు గట్టి ఆ బూములోల్లందర్నీ సంపుతరంట; యింకే(వే(వో( సేస్తరం టమ్మ.

వెంక : ఆ( అందాకా వచ్చిందీ ?

రాఘు : (చుట్టకాల్చుకుంటూ తిరిగి ప్రవేశిస్తూ) అందాకా యేమిటీ ? మనదాకా వస్తే నేమో ! మన భూమిమీద కూడా జెండాలు కట్టారు. చంపుతామని కరపత్రాలు కడుతున్నారు. యిలా వున్నాయి, మన ప్రబుద్ధుడి వేషాలు.

విశ్వం : ఇంకా మనవాడు, మనవాడనే మమకారం పట్టుకొని వున్నట్టే వుందే ?

వెంక : నీవూ, వాడూ ఒక్క పేగువాళ్ళు కాదురా ?

విశ్వం : ఏంచేద్దాం మరి. వాడు బాగుపడడు; వాణ్ణి బాగుపడనివ్వదా సంఘం !

జానకి : అంత క్రూరత్వ మేమిటో ?

విశ్వం : ఏమిటో, అంత్యకాల మొచ్చింది.

వెంక : సరె ! వాడి చేతులోవున్నపని, జీతగాళ్ళ మాన్పించా డనుకో ! ఊరుకుంటిమి. మన భూములు మనం దున్నుకుంటున్నామా, లేదా ? మన చాకిరీ మనం చేసుకుంటున్నామా లేదా ? ఇవేళ వడ్లు దంచేసరికి చూడు, చేతులెలా బొబ్బలెక్కాయో !

విశ్వం : ఏంచేస్తామే ! అదే అలవాటు పడుతుంది· కానీ, యిదివరకు దంచుకోలే ?

జాన : అంతేలెండిగాని, మధ్యలో అలవాటు దప్పబట్టి కాస్త బాధ. అంతే.

రాఘు : ఏమిటేం, అలవాటుపడక! అదేమైనా బ్రహ్మవిద్యా? ఏదో సాగినప్పుడు, సాగించుకుంటారు. లేనప్పుడు చేసుకోక చస్తామా?

విశ్వం ; అదే వచ్చిన చిక్కు! మనిషి ఎప్పుడూ స్వయం శక్తి మీదనే ఆధార పడాలి. అదే మంచిది.

రాఘు : మరి మన లింగన్న మానుకోలేదే. ఏం లింగన్నా! నిన్ను జీతం మానుకోమని బలవంతం చేయలేదూ-వాళ్ళు?

లింగ : ఒసోస్! బలవంత వేందుండోయ్! మెడల్ల పట్టునేట్టుకు సిత గ్గొట్టిన్రు.

వెంక : అఁహాఁ! ఆపని కూడా అయిందీ?

లింగ : మరేందనుకున్రు?

రాఘు : మరి, నువ్వేమన్నావు?

లింగ : రాను పోరి యెదవల్లారన్న.

జాన : ఇంకా అంతేకాదు; పూళ్ళోవాళ్ళను కూడా మాట్లాడ వద్దంటున్నారు.

విశ్వం : ఇక్కడికి చాకలి, మంగలి వృత్తుల వాళ్ళను మాన్పించారు. జీతగాళ్ళ మాన్పించారు. ఇంకా చంపుతాం, చంపుతాం అని బెదిరిస్తున్నారు. ఇలా సాగిపోతున్నది-వాళ్ళ రాక్షస రాజ్యం!

వెంక : ఎక్కదిడిరా-వాళ్ళకీ మిడిసిపాటు?

విశ్వం : ఏవో అక్కడక్కడ సంపాదించిన తుపాకి లొట్టలున్నాయిగా. ఇంకాయేం, వాళ్ళయిష్టం.

జాన : ఇలాంటి గడ్డురోజు లెన్నాళ్ళుంటాయో?

విశ్వం : ఎన్నొరోజులుంటే, మనమేం బ్రతుకుతాం.

రాఘు : మరిచేపాయ్యా. ఇవేళ, రామానుజయ్యను చంపారటగా?

విశ్వం : అయ్యో పాపం! అంతపనీ చేశారూ! అనుకుంటూనే వున్నా.

వెంక : అతనెవరురా?

విశ్వం: అదే-యిందాక మనయింట్లో తుఫాను రేపినామె లేదూ, దొరసాని పుష్పగారు!

వెంక: పాపమా అమాయకు డేంచేశాడని?

జాన: ఏం చేయాలేమిటి? తన పని తాను చేసుకుంటున్నాడు. స్వేచ్ఛగా తిరగాల్సిన భార్యకు కంటకు డయ్యాడు, అందుకనే ప్రజాకోర్టులో అభివృద్ధి నిరోధకుడూ, నిరంకుశుడూ, పెట్టుబడిదారూ, ప్రజాద్రోహి అని నేరాలు మోపి తీర్పు చెప్పి వుంటారు. అది కాస్తా అమలు జరిపి వుంటారు. ఆశ్చర్య మేముంది?

వెంక: ఏమిటొనమ్మ! పట్టపగలే-వాళ్ళ ప్రతాపా లిలా పెరిగి పోతున్నాయే?

విశ్వం: అడ్డుపడేవా కా, యిలాగే పెరుగుతుంటాయి.

వెంక: ఇక-న్యాయమనేదె లెదా-లోకమ్మీద.

జాన: అన్యాయమంటూ పాయేదాకా వుండదు మరి.

రాఘు: ఏమైనా సరే! కష్టదినాలు జాగ్రత్తగా గడుపుకోవాలి.

విశ్వం: పట్టుపలగా వుండాలె.

వెంక: ఏమోనాయనా! కనిపెట్టుకొని తిరగాలి. గోడకే చెవులున్నాయి.

విశ్వం: మిగతా రైతులంతా కూడా మనవైపే మొగ్గుతున్నారు, అందరితో కలిసి కట్టుగా సమిష్టి వ్యవసాయాలు చేయించాలి. లింగన్నా! రైతులనూ, కూలీలనూ పిలుచు కొస్తావా?

లింగ: సెవుల్ల మందే పిచ్చుకొని పోత.

జాన: స్వామీ! లింగన్న చెవుల్లో మందెయ్యి నాయనా! (స్వామి మందుకోసం వెళతాడు.)

వెంక: చెవుడు తగ్గిందిగాని, అక్షరమ్ముక్క లేమైనా వొంటబడుతున్నాయా?

జాన: మాట లెన్ని వస్తున్నా భాష మారలే.

విశ్వం : తరతరాలనుంచి వస్తున్న అలవాట్లు ఒక్కసారి మారమంటే ఎలా మార్తాయి? అలాగే తంటాలు పడ్తూ పోతే అదే సాధ్యమవుతుంది.

లింగ : ఇంగ సావిః, మూన్నెల్లెల్ల పత్తిరీక సదివిత్తడంట పత్తిరీక.

రాఘు : అమ్మో ! మొనగాడివై పోతావన్నమాట. (స్వామి మందు తెచ్చి లింగన్న చెవులో వేశాక)

స్వామి : ఏం? ఇంతకూ మందు పని చేస్తున్నట్టుందా లింగన్నా ?

లింగ : పనా, పనా ! వొరాలపని ! గుసగుసలన్నీ ఇనబట్తాంటే.

స్వామి : ఇలా మాట్లాడడం ఇంకా పోలేదుగా ?

లింగ : పోద్ది పోద్ది. ఎట్టమరి ? అయినా ఎట్ట మాట్టాడితేం సావీః ?

విశ్వం : అంతేలేగాని, నేను చెప్పేసమాట మరిచిపోయినట్టుందే !

లింగ : అమ్మయ్యో. పోతనే ఉండ. (వెడతాడు)

# నాలుగవ రంగం

## రాఘవయ్య భూప్రదేశం

[సుబ్బన్న, పెంటన్నలు ఆయుధాలతో రంగమ్మీద కొస్తారు. సుబ్బన్న చేతిలో కొరడా, కరపత్ర ముంటుంది]

సుబ్బన్న : (ఈలవేసి) పెంటన్నా ! ఉషార్ ! వాల్లింపర్ని అన్నిపక్కలు కాయుమను. పోలీసోల్లు రాకుండ కనిపెట్టాల. రాగయ్యగా డొచ్చేప్పుడు సూసి, ఈల యేయుమను. పో ! (పెంటన్న వెళ్ళి వస్తాడు.) పెంటన్నా ! ఆ బూమ్మీన మల్ల జండా కట్టొచ్చినవా? నాకొడుకు, మొన్నకట్టింది తిసినట్టుండది.

పెంట : ఔ ఔ.మల్ల గట్టిన గద.

సుబ్బ : ఈ కాయితాలు, ఆడిపని పట్టిసంక అజండా కట్టిన సెట్టుకు కొట్టరావాల్నే తెల్చిందా ?

పెంట : గట్టినెలే ! (అకరపత్రాన్ని తీసుకొంటాడు)

సుబ్బన్న : పెంటన్నా! మన వెన్నదన్న యిట్టాటోల్ల వైతవంనుకున్నావేం! మనను కొట్టిన నాకొడుకులంత మన సేతుల్ల కొత్తుందరు.

పెంటన్న : చరెగాని చుబ్బన్నా! గిట్ట ఎన్నాల్లు జంపితె మనం పెద్దోల్ల వైతవేం?

సుబ్బన్న : అం ఎన్నాల్లు! ఇంకొక్క నెలంట. ఇంతట్ల, మన పెబువు లోరు యేరే వుందరు. అల్లు యివాంనాల మీన వొచ్చి యీ పోలీ సోల్లనూ, రైతోల్లందర్నీ కైమా కైమా సేస్తరు. ఇంగప్పుడు జూసుకో, నాయాల!

గయ్యాల సూసుకో పెంటన్నా
ముందు రాగయ్య లాంటోల్లు ముక్క సెక్క లౌతారు ॥గ॥
బూమిలంగ సంగపోరు - పుట్టుక పత్తుంటారు
మీనంగ యిమానాలు - బయ్యిమనీ పత్తాయి
సుట్టు పట్టు వూల్లల్ల - సూత్తేను సంగపోరె
యెతిరేకుల నందర్నీ - నాయాల సంపిపారేత్తరు ॥గ॥
బాజార్ల పొంటె సచ్చి - పడతాయిర పీనిగెలు
గొర్ల గోసినట్టు అల్ల - గొంతులన్ని గొయ్యొచ్చు
చొమ్ములని సూకొచ్చు - సూత్తుండగ బాగైతం
నెత్తురుల కుశాలుగ నువ్వు నేను ఎగరొచ్చు ॥గ॥

పెంట : సరెగాని చుబ్బన్నా! ఇప్పుడు లింగిగాడు జేసేది జీతం కాదంట గద! బూమింల బాగవింత్తుండంట గద!

సుబ్బ : అసలాడిచ్చే దేందిరా, బాగం! బూవంత మనదే గదరా!

పెంట : గంతేలేగాని, గీపద్దతి కొత్తగుండదేరా చుబ్బిగా!

సుబ్బ : ఇంగ యేదో సెయ్యక తప్పుతాదిర! (ఈల వినబడుతుంది) గద్దదిగో! నువ్వా పొదసాటుకు పో! నేనిటు బొత! (ఇద్దరు

చెరోవైపు వెడతారు...రాఘవయ్య, వెనక లింగన్న వ్యవసాయ పనిముట్లతో ప్రవేశిస్తారు)

రాఘ : (తేరిపారజూచి) లింగన్నా! మళ్ళీ యివేళేమో-జండా కట్టినట్టుందే!

లింగ : కడ్తరు, కడ్తరు, వాల్లెదన్నా కడ్తరు!

[హఠాత్తుగా పెంటన్న వచ్చి రాఘవయ్య పెడరెక్కలు విరిచి కడుతుండగా-సుబ్బన్న, లింగన్న వెంటబడి]

సుబ్బ : నాకొడక! మేవంత జీతాలు మానుకుంటె, నువ్వొక్కడివే సెయ్యడానికేం మొనగాడివా? (కొడుతుంటాడు)

లింగ : జీతంగాదే చుబ్బన్నా! బూవిల బాగవే!

సుబ్బ : మాకులేని బాగం నీకేం పాపం!

లింగ : సెట్టూ, పుట్టా యిడిసి రారాదే నీకూ బాగమిత్తడు.

సుబ్బ : నీ యెదవ బాగం కోసం పెజాసేవ మానుకుంటవేం! [ఇష్ట మొచ్చినట్టు కొట్టి లింగన్నను పంపేసి, యిక కొరడా తీసుకొని రాఘవయ్యను కొడ్తూ]

సుబ్బ : అరె, నా కొడక! నన్ను కొట్టినప్పు డెట్టుండది?

రాఘ : (ఏడుస్తూ) నిన్నిట్లా ఎన్నడు కొట్టాను సుబ్బన్నా! నన్ను క్షమించవూ! (కాళ్ళపైబడి) నన్నెందుకు కొడ్తావు సుబ్బన్నా! పెద్దవాణ్ణి! హబ్బా! కొట్టకు సుబ్బన్నా!

(ఇద్దరూ రాఘవయ్య మూతి గట్టేసి తెరలోనికి తీసికెళ్ళి చంపేస్తారు. రాఘవయ్య ఆర్తనాదపుధ్వనులు. సుబ్బన,పెంటన్నలు రక్తపుమరకలతో తిరిగి రంగమ్మీది కొచ్చి)

సుబ్బ : కండ్లు సితక బొడిసినవా?

పెంట : ఓ!

సుబ్బ ; ఆ కాయితం సెట్టుగట్టినవా?

పెంటి : ఓ!

సుబ్బ : పా! ఉరుకూ! (అని ఈలవేసి) జై ప్రజాసేవ సంగానికీ జై! (ఇద్దరూ అని వెళ్ళిపోతారు...... కాస్త నిశ్శబ్దం. శవం పడవేసిన ప్రక్కనుంచి రాఘవయ్య యింటి వాళ్ళంతా లబో లబోమని ఏడుస్తూ రంగమ్మీదికి ప్రవేశించి)

వెంక : ఎంత పాపాని కొడిగట్టుకున్నార్రా నాయనా!

జాన : జాలి, సానుభూతి లేని కరుకు గుండెలు.

స్వామి : వెధవలు, నీచులు, దుర్మార్గులు.

వెంక : తమ్ముడెంతపని చేశాడ్రా నాయనా ?

విశ్వం : (కసిగా) తమ్ముడట, తమ్ముడు! చిన్నప్పటినుంచీ కడుపులో పెట్టుకొని, గారాబంగా పోషించుకొని, విద్యాబుద్ధులు చెప్పించాడనే విశ్వాసం లేకుండా, క్రూరంగా, దారుణంగా, నీచంగా, పిరికితనంగా తండ్రిని చేతులారా ఘోరహత్యాకాండ గావించిన ద్రోహి.

స్వామి : ప్రజాసేవట! ప్రజాసేవ! ఎవరికావాలీ ప్రజాసేవ? ఎవరు సంతోషించ! న్యాయంగా హక్కుల సాధించుకునే శక్తిలేక, దొంగచాటుగా సాధిద్దామనుకున్నాడు, దోపిడీగాడు.

జాన : మానవత్వమే లేక, యిలా ముదుసలిని కన్నతండ్రి కనుగ్రుడ్లను పట్టపగలు బ్రతికుండగా తీయించి సంతోషిద్దామనుకున్న పాపి, రాక్షసుడు.

వెంక : ఏమిటో నాయనా-యిలా పట్టపగలే మానవ హత్యలు.

[లింగన్న, పెంటన్న చెట్టుకు కట్టపోయన కరపత్రం తీసుకొచ్చి]

లింగ: ఇదేంది సూడురుండీ! సెట్టుకు జెండా కట్టిను్రి, పయ్యంగ కింద గీకాయితం కొట్ట్రిను! సూడ్రి! (ఇస్తాడు. అంతా చుట్టూ మూగుతారు. విశ్వం బయటికి చదువుతాడు.)

"ప్రజాద్రోహికి శిక్ష పూర్తయింది. కుటుంబంలో మిగతా వారి కూ్కడా కొద్ది రోజుల్లో విధించి తీర్తాం. అనవసరంగా భూమ్మీదికి రాకండి! భూమిపై హక్కుమాది."

ఇట్లు,

ప్రజాసేవక సంఘం.

విశ్వం. ఏడిచాడు వెధవలు! అడవుల్లో, చెట్లల్లో, గుట్టల్లో, పుట్టల్లో కూర్చొని-మాదే హక్కని యేడుస్తాడేం వెధవ!

స్వామి : తాతను చంపగానే అంతా జడుస్తారనుకున్నారేమో ద్రోహులు.

వెంక : ఏమిటో నాయనా! ఇంకా ఒక్క నాన్నతోనే పోకుండా కుటుంబాన్నే నాశనం చేస్తానంటున్నారేంరా ?

విశ్వం : వాళ్ళకేవమ్మా. ఏవైనా నాశనం చేస్తారు. కుటుంబాలేం, గ్రామాలేం, చివరకు దేశాలేం. ఏదైనా ఒకటే. వాళ్ళకు వూళ్ళెందుకు ? మనుషులెందుకు? ప్రేమయెందుకు ? పూర్తిగా రాక్షసులయిపొయ్యారు. త్రాగుడు, తిండి, ఎక్కడ దొరికితే, అదే వారి గృహం. అదే వారి కుటుంబం. అదే వారి ప్రేమ.

వెంక : ఎట్లారా నాయనా ? వాళ్ళెంతకైనా సమర్థులే.

విశ్వం : ఏంచేస్తామమ్మా మరి ? అయ్యేదేమిటో అవుతుంది.

జాన : అవునండిమరి ! చచ్చేదేమిటో యిన్నిసార్లు చస్తామా ? ఎప్పుడో ఒకప్పుడు చావలసిందేగా ?

స్వామి : ఎందుకు నాయనమ్మా భయపడతావు ? చచ్చేదేమిటో ఎదిరించే చద్దాం; ఏమంట .

వెంక : ఏమోరా కుర్రకారు. మీకేంతెల్సు ? వాళ్ళదగ్గర ఆయుధాలున్నాయి. ఏదైనా చేయొచ్చుకూడా.

స్వామి : అలాగని చంపమని దగ్గరకు వెడదామా ?

జాన : భయపడి ఏదేశమైనా పారిపోదామా?

విశ్వం : ఇంతకూ నీవనే దేమిటే?

వెంక : వాళ్ళెక్కడున్నారో తెలుసుకొని, మన ప్రభాకరాన్ని కలుసుకొని బ్రతిమాలుదామని.

విశ్వం : ఇంకా మన ప్రభాకరమనేనా? గ్రామాలకు గ్రామాలు లూటీలు చేస్తూ, చివరకు బాటసార్లను కూడా దోపిడీలు చేస్తూ, పట్టపగలు హత్యలు సాగిస్తూ, త్రాగుడూ తిండితో వూగిపోతున్న ప్రభాకరం, యింకా మనవాడు! మన స్పృహ వుందనేనా, నీవూహ?

జాన : ఇంకా వాళ్ళు బైట తిరుగుతుంటారనేనా, నీవుద్దేశం!

స్వామి : ఏమిటో-నాయనమ్మ కలలు కంటున్నది.

వెంక : ఏమో, నేననుకుంటాను, వెడితే మిమ్ముల రక్షిస్తాడని ఆశగా వుంది.

విశ్వం - అది, నీతల్లిప్రేమ. అంతే.

జాన : నీవన్నీ గాలిమేడలు.

స్వామి : నీ వూహలన్నీ నీళ్ళల్లో మూటలు.

లింగ : వొద్దుతల్లో! వొద్దు. అల్లు అన్నాలంగ సంపేత్తరు! ఆనిక్కను కుంటవుండది?

వెంక : మీరేమన్నా అనండి. నేను వెడతాను. మిమ్ముల రక్షిస్తాను. (అంటూ లేచి వెళ్ళుతుంటుంది. అందరూ అమ్మా! అత్తయ్యా అంటూ కేకలు వేస్తుండగా)

—తెర—

# అయిదవ రంగం

## అడవిలో పొద

[రాళ్ళు, ఆయుధాలు, డ్రస్సులూ, పైళ్ళూ, కాయితాలూ. సుబ్బన్న, పెంటన్నకు పాట చెబుతుంటాడు. పెంటన్న ఏడుస్తూ చదువుతాడు.]

పెజాసేవ పెజాసేవ—ఒదలకురా వో పేద
కొండకోన లైనగాని—గోరారన్యాలుగాని
అగులు యేర్లైన గాని—నీడలేనెడారిగాని ॥పెజా॥

బందూకులు తల్వారులు—బన్లకొద్ది వున్నాయి
దోసుకొచ్చినట్టి డబ్బు—బోలెడు మనకేవిఁలోటు ॥పెజా॥

సంగపోరు పిలుత్తాంటె—సయ్యఁనిలేవాలయ్యో
అద్ధరేత్తిరంటె మనకి—అసలే బయవేఁలేదు ॥పెజా॥

(పెంటన్నకు ఎక్కెక్కి ఏడుపొస్తుంటుంది)

సుబ్బ : ఏందిర పెంటిగా, ఏడుత్తుండవూ ?
పెంట : ఇంకెన్నాల్లురా, యీ అపత్తలు ?
సుబ్బ : ఇంకెన్నాల్లే ! మా అంటె పదేను రోజులన్కొ.
పెంట : ధసెపో ! ఎప్పుడు పదేను రోజులేనంటవ్ గని, పదేనురోజు లెప్పుడైతయిరా చుబ్బిగా ?
సుబ్బ : దెగ్గరి కొచ్చిందే ! ఇయ్యాల్రేపట్ల మన సంగపోల్లంత ఒక్క పాలే మెరుపుదాడి జేసి పెజాదోవుల సందర్ని బట్టేత్తరంతే.
పెంట : ఏవోఁరా చుబ్బిగా ! మెరపకాయదాడి, మెరపకాయ దాడని యెన్నాల్లాశ పెడ్తివే ? చరెగని, గిట్ల యింక మనం ఎంత మందిని జంపాల్రా చుబ్బిగా ?
సుబ్బ : దొరికినకాడికి సంపాలెహే.
పెంట : పాపం మొన్న సంపిన ఆ రాగయ్యగారు నాకేం అన్యాలం జేసిండురా ? అన్యాలంగ నాతోని కనుగుడ్డు దీపిత్తివారీ.
సుబ్బ : ఏయ్, పెంటన్నా ! పిరికి పడతాండౌ. ఆ రాగయ్యగాడు నీకు యెక్తిగతంగ యెతిరేకం జెయ్యక బోతేం, నీ అసుంటోల్లకు లచ్చమందికి యెతిరేకం జేసిండు. అట్టాటి దోయిని సిచ్చించ టంల తప్పేంది ?
పెంట : పాపం ఆరేం జేసిన్రురా ! ఎన్నడన్న వొర్నన్న పల్లెత్తు మాట న్నాడా?
సుబ్బ : నీకు దెలవదులే. బోలెడు రిపోర్టుల్నన్నయ్.
పెంట : యాడియే రిపోర్టర్లు ?
సుబ్బ : పెజలయి.
పెంట : ఏగ్యామం పెజలయి?
సుబ్బ : దేశమ్మీని పెజలయి.
పెంట : దేశపోల్లతోటి ఆరికేంపనిరా ?

సుబ్బ : ఇట్టాటోడవు — నువ్వీ సంగంల వుండాల్సినోడవుకావుర పెంటిగా.

పెంట : అయితె, పోతలె అరీ. ఇంటికాడ పెల్లాం పిల్లలకు బువ్వలేక శెరైతుండదంట. ఏవో ఆత్తి దొరుకుద్దంటె యిన్నాల్లున్నగనారీ, యిదేం యెవారవేఁ?

సుబ్బ : ఎదవాత్తేందే? దేశపంత మనదే కాబోతాంటె నేఁవోఁ.

పెంట : ఇంకెప్పు డైద్దిరా? కంచెలు, కందకాలు దున్కలేక నాపానం సుడిబడ్తాందారీ.

సుబ్బ : మేమ్మెటుకు మీతోటి రాటంలేదే?

పెంట : ఏం రాటవోఁరా చుబ్బిగా! మొన్నొకంచె దున్కబోతె కాల్లల్ల నడువుఁల బెన్క బట్టి యింక యియ్యాల్దాక నడవనియ్యటం లేదారీ.

సుబ్బ : ఔ మరి, కట్టపడాలె.

పెంట : యాడి కట్టవోఁనాయినా! ఎరక్క సంగంల జేరిన. యాడికి బోయినా గంటసేపుండేది లేదాయె. సరిగ్గ బువ్వ దినేది లేదాయె. నిద్దర బొయ్యేది లేదాయె. చెంటర్లు కాసి కాసి, మేడలు కూల్సి కూల్సి, మడుసుల కోసి కోసి, తుపాకి లొట్టలు మోసి మోసి నా వొల్లంత పాడైందెహె.

సుబ్బ : అట్టంటెట్టనే! అత్తు లూకెనే వొత్తాయె?

పెంట : ఏవాఁత్తోగని చుబ్బిగా! ఎందుకే లేని పోనియి వొంటికి తెచ్చి పెట్టుకునుడూ? మనం మెటుకు యిన్లకు పోగూడదానె? రాచ్చసులోలె యీ సెల్లెమ్మటీ గుట్టల్లమ్మటీ ఎందుకే?

సుబ్బ : అమ్మో! ఊల్లల్లకు బోతె పోలీసోల్లూ, పెజలూ బట్టుకోరె!

పెంట : [పేదవాని కోపంగా] నీ......! ముందగాల పోలీసోల్లు పట్టుకోరు, పట్టుకోరని అబద్ధ వాడ్తివారీ? ఇయ్యాల్నోఁ మల్లిట్టం

టుండావ్, ఓసే సెరైపోతాండదిగదా. సచ్చిన సావూ గాదాయె, బతికిన బతుకూ గాదాయె. మొన్న వో బస్సురా చుబ్బిగా! బస్సు, పోలీసోల్ల బస్సు, బర్రున వొత్తాంటె, యీదుల్లంగ బడి మలుపు ల్తిరుక్కుంట వోసే వురుకుడు, వోసే వురుకుడారీ. బస్సట్టనే యెంటబడి లగెత్తుతాంటె గబాల్న బొయి కొచ్చేట రాయిమీన బడ్తె సూడారీ, ముక్కంత ఎట్ట పచ్చెలుపచ్చెలైందో!

సుబ్బ : ఇట్టాటియన్ని యీడ అనుకో గూడదే.

పెంట : ఈడగాక, యింకాడనుకుటవేఁ? ఏవేఁరా చుబ్బిగా! దినె వారం నాకస్సలె అంతుబట్టలెదనుకొ. ఊకున్నోల్లవూఁకోక, బంగారవఁసువంట పెల్లుకు యాడ్నో పాడు పని పెట్టుకుంటి వేఁవేఁ! ఓసే సంపుడు వోసె సంపుడుగ బొతుంటదెవారం. నువ్వేవన్నారీ. నాకండ్లల్ల మాసినోడు వోసె అడ్తాండారీ. నా గుండె టార్న బగిలిందారీ. చుబ్బిగా! నువ్వేందో మంచోడి వనుకున్నారీ. ఎంతపని జేత్తివేఁఏఁరా?

ఎంతపని జేత్తివిర చుబ్బిగా
దీని అంతు దెలవకుండ నేను ఆశపడితె గిట్టాయె ॥ఎం॥
మేడలన్ని కూలగొట్టి—గూడలన్ని నొప్పుబట్టె
ఆడికాడికి సూత్తుంటె—అంతులేని సంపుడాయె ॥ఎం
జితానికి జీతంబాయె—సేసుకున్న పెల్లాంబోయె
పాతిపెట్టిన గింజలుబాయె—కొత్తలేవేఁ ఎక్కువాయె ॥ఎం॥
బూములొస్తయంటివి—బువ్వదొరుకుద్దంటివి
పొలీసోల్లకు దొరికిపోరి—పూసలన్ని యిరుగుతాంటె ॥ఎం॥

సుబ్బ : అరె! నువ్వెక్కువగ మాట్లాడుతుండౌ. అంగో, బెమ్మంగా రొత్తుండరు. (బహ్మం వస్తాడు)

బ్రహ్మం : ఏమిటి సుబ్బన్నా ! ఒకటే చెబుతున్నాడేమిటి, పెంటన్న?
సుబ్బ : ఏందోనుండీ. ఆసి బుర్ర పుసుగు దొలుత్తుండది. ఇంటికి పోతనంటున్నడు.
బ్రహ్మం : ఇంటికీ ! పోలీసులు పట్టుకోరూ ?
పెంట: ఎట్టనో నేను తప్పిచ్చుకుంటలెరి.
బ్రహ్మం : అలాగా ? అయితే—యింకేం, వెళ్ళమను.
పెంట : ఎల్తున్నరో చుబ్బిగా ! (సంతోషంగా ఆయుధం తీసుకొని బయల్దేర్తాడు)
బ్రహ్మం : ఏయ్ ఆయుధ మక్కడ బెట్టు.
పెంట : నాకెందుకీ-ఆవుచం. (ఆయుధం అక్కడ పడేస్తాడు)
బ్రహ్మం : ఆс! సుబ్బన్నా! పెంటయ్యను . పంపించెయ్యి పాపం! (చంపమని సైగ చేస్తాడు)
సుబ్బ : ఆс! పెంటన్నా ! ఇక ఎల్లిపో! (పెంటన్న లోని కెడతాడు. సుబ్బన్న రంగమ్మీదినుండి గురిబెట్టి చూసి కాల్చేస్తాడు. 'హాс! చుబ్బిగా సంపితివి గదరా!' అని వినబడుతుంది. ఈ చప్పుడుకు అదిరి పడ్డట్టు మరోవేపునుండి ప్రభాకర్, పుష్పలు చేత సంచులతో, అస్తిపాస్తులూ, ఆయుధాలతో ప్రవేశిస్తారు. చెదిరిన జుట్టూ, వొంటిపై దుమ్మూ)
ప్రభా : ఏం బ్రహ్మం! ఏమిటీ చప్పుడు ?
బ్రహ్మం : ఆс! ఏమీలేదు. పెంటన్న యింటికి వెళ్ళిపోతా నంటూంటే పంపించాం, వీరస్వర్గానికి !
పుష్ప : మంచిపని చేశారు.
ప్రభా , వెధవకు అంతచక్కని శిక్ష వేశారేమిటి ? కాళ్ళూ చేతులూ తొలగదీసి కొన్నాళ్ళిక్కడ మూలగ దిస్తే బాగుండేది.

సుబ్బ : సరి. ఏదో అయిపోయిందిలేరి గాని, ఎళ్లినపని జయవైందా?

ప్రభా : ఆ. ఆ ద్రోహి దొరికాడు. ఇదిగో! యీ ఆస్తిపాస్తులు కూడా దొరికాయి. కాని, వాణ్ణి ఈ గుట్టల్లోకి తీసుకొస్తుంటే, పొలీసులు వెంటబడ్డారు. ఎంతో తంటాలుపడ్డాంగాని లాభం లేకపోయింది. మనవాళ్ళు కొందరూ ఆ ద్రోహి కూడా వాళ్ళ చేతుల్లో చిక్కిపొయ్యారు. మేము మాత్రమే ఇలా రాగలిగాం.

సుబ్బ : ఆఁ! ఓరు పట్టుబడ్డరుండీ?

పుష్ప : రాజయ్యా, వెంకటేశం యిద్దరూ పట్టుబడ్డారు.

సుబ్బ : అరె! ఉరకలేక పోయిందేమో పాపం!

ప్రభా : సరేగాని సుబ్బన్నా! ఆ వెంటిగాణ్ణి బొందలో పూడ్చావా? లేదా?

సుబ్బ : ఇంక లేదుండి.

ప్రభా : వెళ్ళు! ముందాపని చెయ్యి!

సుబ్బ : సర్లేరి! (వెడతాడు)

బ్రహ్మం ; ఆఁ! అయితే యీ పొలీసుల పనిబట్టడానికి తీవ్రంగా ఆయత్త పడాలి.

ప్రభా : తొందర పడితే లాభం లేదు. ప్రస్తుతానికి తప్పుకొని తిరగడమే మంచిది. ఈలోగా ఆయుధాలవీ కూడగొట్టాలి. ఇదిగో! ఇదొక ప్రజాద్రోహి ఆయుధం.

బ్రహ్మం : రైతో! ఆఁ! సరేగాని, వాడిమీద కాలగొట్టారా?

పుష్ప : వాడిది-పూరిల్లే. తగలెట్టేశాం.

బ్రహ్మం : మంచిపని చేశారు. పుష్పగారూ! అబ్బ! ఎంతగొప్పగా కార్యక్రమాన్ని సాగిస్తున్నారు! ప్రజలందరి తరఫునా మీకు తాలూకా నాయకత్వం కట్టిపెడుతున్నాం.

పుష్ప : ఏదో ప్రజలందరు కోరుకోవడంవల్ల చేయక తప్పుతుందా ?

బ్రహ్మం : మరక్కడి ధాన్యం గైరాజు, పూర్తో ప్రజలకు పంచి పెట్టారా ?

ప్రభా : వెధవలు ! ఊళ్ళో వాళ్ళు మన సంఘాన్ని వ్యతిరేకిస్తున్నారు.

బ్రహ్మం : ఎంత ఇదైనా-కొంతన్నా పంచినట్టు నటించకపోతే ఎలా గోయ్ ? వ్యతిరేకత రాదా?

పుష్ప : ఏడిచారు-వెధవలు ! ఎంత అనుకుంటేమాత్రం మననేం చేయ గలుగుతారని ?

బ్రహ్మం : అంతేననుకోండి గాని, ఏదో పనిమంది కదా క న బ డా లి చూడండి.

ప్రభా : మొదటిరోజుల్లో అంటే అలా చేశాంగాని, యింకా యిప్పటికీ అలాగే చేస్తూ పోతే మనచేతి కొక్క చిల్లిగవ్వైనా రాదు.

పుష్ప : అయితే ఒక్కపనిమాత్రం చేసొచ్చాం. ఆపూరి భూములన్నీ లేబర్ క్లాసు వాళ్ళకు గెట్టుపెట్టి పంచొచ్చాం.

బ్రహ్మం : ఇంకాయేం ? ఆ ఘనకార్యమొకటి చేసొచ్చాక యింకా ధాన్యం పంచడమెందుకూ ? అదిగూడా చేసేట్టయితే మన సంఘ మెలా బలపడుతుంది ?

పుష్ప : సరేగాని-మీరింకేమైనా తీర్పులు వ్రాశారా ?

బ్రహ్మం : ఆహా !

పుష్ప : చదవండి, విందాం.

బ్రహ్మం : (చదువుతూంటే అంతా కుర్చీలపై కూర్చుంటారు.)

1. రావూరి వెంకయ్య :—మొన్న మనవాండ్లను పోలీసులకు పట్టి వ్వడానికి ప్రయత్నించిన తొత్తు. చేతులు నరకడం.

2. సామ్యవాదపు రాజారావు :— మన పాలసీని ఖండిస్తూ-వెధవ నిర్మాణ కార్యక్రమ మంటూ, గాంధీ అడుగుజాడల్లో నడిచే ప్రబుద్ధుడు. కనుగ్రుడ్లు తీయడం, చెట్టుకు విరిచి కట్టి తుపాకితో కాల్చి చంపడం.

3. వేపీధరపు రంగయ్య :—మనం మహిళలను సంఘంలోనికి తీసుకొస్తుంటే హేళన చేసిన దుర్మార్గుడు. కత్తితో గాట్లు పడే టట్లు పొడిచి చంపడం.

4. చోడవరపు రంగమ్మ:— పోలీసుల కళ్ళల్లో కారంచల్లడం పోయి మన కళ్ళల్లోనే చల్లుతాననే నీచురాలు. కొద్దిగా చిన్న శిక్షే. వెంటనే తల ఏక్ దమ్ముగ నరకటం.

5. ఘరానా సోమప్ప:— మన ప్రజాసేపను సాగనివ్వకుండా— పాటలూ, పద్యాలూ, నాటకాలూ వ్రాస్తూ ప్రచారం చేస్తున్న ద్రోహి. వాడి కళ్ళు తొలగించి, చచ్చేట్టు చావమోది రావడం. ఇప్పటికి యింతేనండీ.

పుష్ప : మరి ప్రభాకర్ గారికి సంబంధించినవాళ్ళ సంగతులు వ్రాయ లేదే ?

బ్రహ్మం : ఏదీ-ఇప్పుడే వ్రాస్తుంటే మీరొచ్చారు.

పుష్ప : వాళ్ళను తొందరలో నాశనం చేయకుంటే దేశంలో మరీ దుర్మార్గం పెరిగేట్టుంది. సరేగాని, మనం డాక్టర్ విశ్వంగాడిపై చేసిన కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగినట్టు లేదే ?

ప్రభా : మన రహస్యం బైటపడినట్టు తెలుస్తున్నది.

బ్రహ్మం : ఇంకా-యిందాక పట్టుబడ్డవాళ్ళవల్ల కూడా మన విషయాలు బైటికొస్తాయి సుమా ; బహు జాగ్రత్తగా వుండాలి.

ప్రభా : అయితే-తొందరగా, యీనగలూ యివీ పాతేద్దాం పట్టండి. ఆఁ! సుబ్బన్నా ! (ఆఁ! అంటాడు) నగలు పాతేద్దాం; బొందతీసి శుభ్రంగా వుందా ?

సుబ్బ : అట్టైనేలేరిగాని (తల గోక్కుంటూ) మాయింటికాడ శెడ కట్ట వైలుండదంట. ఏవైఁన యిప్పియ్యరూ ?

బ్రహ్మం : ఇవెలా యిస్తామోయ్ ?

పుష్ప : మన సంఘపోషణ కుండొద్దూ ?

సుబ్బ : ఏదో ఒక్క నగ యిప్పియ్య కూడదు ?

ప్రభా : అమ్మమ్మో ! ఇవన్నీ లిస్టు వ్రాశాం. పైవాళ్ళూరుకుంటారా ? మనమొక్క చిల్లి గవ్వయినా ముట్టుకోడానికి వీల్లేదు.

సుబ్బ : మరి, మాయింటోల్ల సంగతి ?

పుష్ప : చూద్దాం. రాత్రికి వెళ్ళొద్దూ ! అప్పుడు తెచ్చుకుందువు గానిలే.

సుబ్బ : మరటు జీతానికి జీతప్పూఁపాయె; ఇటు డబ్బుకు డబ్బూ పాయె. ఎట్టనుండీ ! కాసిని తాగుడుకైన యిత్తరా ? అదీ లేక పోతె పనెట్ట సెయ్యాల్నండీ ?

ప్రభా : మేమ్మాత్రం లేవాఁ యేమిటి? సరేగాని, మొన్న పట్టుకొచ్చిన గొర్రెలు, మేకలు వున్నాయా ? ఎట్టైనా ఉడాయించాయా ?

సుబ్బ : ఉన్నయండీ.

ప్రభా : అయితే-యింకా కూర తయారు కాలే ?

సుబ్బ : అయిందండీ.

ప్రభా : మరి వెళ్ళి పట్టుకొనిరావేం, ఆలస్య మేమిటీ ? (సుబ్బన్న వెడతాడు.) ఆఁ! బ్రహ్మం! యిక యివి పాతేద్దావాఁ మరి ?

బ్రహ్మం : (నసుగుతూ) ఆఁ! పాతేద్దామా ?

పుష్ప : ఇవన్నీ పాతేస్తూ పోతే-మనగతో?

పభా : పుష్పగారు చెప్పేదీ బాగానే వుంది

బ్రహ్మం : కాదామరి.

ప్రభా : అయితె-ఏదో శాస్త్రానికలా పాతేద్దాం. ఏమంటారు ?

పుష్ప : అంతే, అంతే.

ప్రభా : అయితే, యివి తీసుకో ! (నగలు బ్రహ్మనికిస్తాడు)

బ్రహ్మం : (తిసుకుంటూ) ఆఁ! బంగారపువెందుకూ? ఆ వెండివీ, అవి ఇవ్వ చాల్లే ! (తీసుకెళ్ళుతాడు. సుబ్బన్న కొంత త్రాగుడుకూ,తిండికీ పదార్థాలక్కడ తెచ్చి పెడ్తాడు)

బ్బ : ఏవుండీ ! మనోల్లు ఆ రాగయ్య గాడి గొడ్లను తోలుకొచ్చిన్రు.

ప్రభా : అఁ! నిజమా?

సుబ్బ : అబద్ధ మెందుకాడ్తనుండీ ?

ప్రభా : రైతో ! ఇంకాయేం ? జయంమనదే. బోలో ప్రజాసేవక సంఘానికీ (బ్రహ్మంకూడా వచ్చి అందుకొని) జై (అని అంతా తిండిపై ఒడ్తారు. వెంకటమ్మ హఠాత్తుగా ఏడుస్తూ వచ్చి ప్రభాకర్ కాళ్ళమీదపడి)

వెంక : నాయనా, ప్రభాకర్! ఇవేంపనులురా ?

ప్రభా : (అసలే కోపంలో వున్నాడు. దానికి తోడు నిషా) ఏయ్ ముండా ! దూరంగా వుండు. (వెంకటమ్మ అలాగే కాళ్ళు పట్టుకొని పదలదు) ఏయ్ సుబ్బన్నా ! లేపి పట్టుకో. (సుబ్బన్నలా చేస్తాడు) ఎందుకొచ్చావే ఇక్కడికి ?

వెంక : కన్నతండ్రినలా చంపవచ్చునట్రా ?

ప్రభా : ఛా! మాకేంతెల్సు. మేమలాంటి పనులు ఎప్పుడూ చేయం

వెంక : మరెవరు చేశార్రా ?

పుష్ప : ఏమో, ఎవరికి తెల్సు? మామీద దుష్ప్రచారాలు చేసేవారెం దరు లేరు గనుక.

వెంక : అంతేనంటావా-నాయనా?

ప్రభా : కాకుంటే మా పవిత్ర సంస్థ అలాంటి పనుల కెప్పటికీ పూను కోదని గ్యారంటీ యిస్తున్నాం. మాసంఘ వ్యతిరేకులు ఎన్ని అబద్ధాలాట్టానికైనా సాహసిస్తారు.

వెంక : చూడు నాయనా ! నాకు పుత్రభిక్ష పెట్టవూ? అన్నను చంప కుండా కాపాడవూ ?

ప్రభా : మాకేం, వాడిని చంపడానికి. వాడి శత్రువు లెవరైనావుంటే అలా చేస్తారేమోగాని, మాకేమీ సంబంధం లేదు.

వెంక : వాడికి శత్రువు లెవరున్నార్రా?

ప్రభా : ఏమో ఎవరికి తెలుసు ? మొన్న పుష్పగారు వచ్చినప్పుడు, గుండె పరీక్ష చేస్తానని చెప్పి, బలవంతంగా అబ్బ ! ఎంత నీచా నికి పాల్పడ్డాడట.

వెంక : అదీ నిజమేనంటావా నాయనా ?

పుష్ప : అంటే, అబద్ధమనా మీ వుద్దేశ్యం ?

బ్రహ్మం : ఈ బూర్జువాలు, ఆడవాళ్ళయినా అబద్దా లాట్టానికి ఇట్టే తయారౌతారు. ఎంత స్వార్థపరులు ! అందుకే అన్నారు, వీళ్ళం దర్నీ.....

పుష్ప : ముక్కలు ముక్కలు చేసి చెట్టుకు వేలాడ దీయాలని.

వెంక : నాయనా ! ప్రభాకర్ ! ఎందుకురా, ఈ కష్టాలన్నీ పడుతు న్నావ్ ?

ప్రభా : ఎందుకేమిటి ? ప్రజాసేవ కోసం.

పుష్ప : అందర్నీ సమానం చేయడానికి.

బ్రహ్మం : దేశాన్ని బాగుచేయడానికి.
వెంక : ఇదేం బాగుచేయటం నాయనా ? కొంపలు కూల్చి, మనుషుల చంపి, పంటచేలు పాడుచేసి, లూటీలుచేసి, యిండ్లు తగులబెట్టి ఇదేనా, ప్రజాసేవ? పైగా ఇవేళ మన పశువులను గూడా తోలుకొచ్చారు.
ప్రభా : ఏయ్ ! నీవేమిటేమిటో పచ్చి అబద్ధాలు మాట్లాడి అపనిందలు మా కంటగడుతున్నావ్. మీ పశువులు మాకేం తెలుసు ?
వెంక : ఇప్పుడే చూశాను. మన పశువు లిక్కడే వున్నాయి.
ప్రభా : మాకావిషయం తెలియదు.
పుష్ప : మాకా జోక్యం లేదు.
బ్రహ్మం : మేమలాంటి పనులు చేయం.
వెంక : అవి మన పశువులే. నాకళ్ళతో చూస్తుంటే.
ప్రభా : అవి మీ పశువులు కాకపోవచ్చు.
పుష్ప : అవి నీకళ్ళు కాకపోవచ్చు.
బ్రహ్మం : అబుర్ర చెడిపోయి వుండవచ్చు.
వెంక : ఆడదాన్ని; పెద్దమనిషిని; కన్నతల్లిని.
ప్రభా : నీవు నాతల్లివి కావు.
పుష్ప : నీదగ్గర పెద్దమనిషి లక్షణాలు లేవు.
బ్రహ్మం : నీదగ్గర మంచితనమే లేదు.
వెంక : నేనంత కూ్రరురాలనా, నాయనా ?
ప్రభా : నీవొక బూర్జువావు.
పుష్ప : నీవొక నిరంకుశురాలవు.
బ్రహ్మం : నీవొక ప్రజాద్రోహివి.
వెంక : నేనంత నీచురాల నయ్యానురా, నాయనా !

ప్రభా : మాకళ్ళ కలా కనబడుతున్నావు.

పుష్ప : మా సంఘాని కలా కనపడుతున్నావు.

బ్రహ్మం : మా ప్రజల కలా కనపడుతున్నావు.

వెంక : నేనంత తప్పుచేశానా బాబూ ?

ప్రభా : బీదల రక్తం పీల్చావు.

పుష్ప : పేదల బొమికెలు కొరికావు.

బ్రహ్మం : ప్రజల మాంసం పిండావు.

వెంక : ఎప్పుడో జరిగిపోయినవన్నీ యెందుకు నాయనా ? ఇప్పుడేం చేస్తున్నామని.

ప్రభా : మీపనులు మీరు చెసుకుంటున్నారు.

పుష్ప : మీభూములు మీరు దున్నుకుంటున్నారు.

బ్రహ్మం : మీకూడు మీరు తింటున్నారు.

వెంక : అందులో తప్పేముందిబాబూ ?

ప్రభా : అయితే, మా బీదలేమైపోవాలి ?

పుష్ప : అయితే, మా ప్రజలేమైపోవాలి ?

బ్రహ్మం : అయితే, మా సంఘమేమైపోవాలి ?

వెంక : మరేం చేయమంటావు నాయనా ?

ప్రభా : మీభూములు మాకివ్వాలి.

పుష్ప : మీ అస్తులు మాకివ్వాలి.

బ్రహ్మం : మీరంతా మా సంఘంలో చేరాలి.

వెంక : అయితే-యీ దౌర్జన్యా లెందుకు నాయనా ?

ప్రభా : నిరంకుశుల హతమారుస్తాం.

పుష్ప : ప్రజాద్రోహుల శిక్షిస్తాం.

బ్రహ్మం : పోలీసు తొత్తులకు బుద్ధి చెపుతాం.

వెంక : అలాచేస్తే ఏమవుతుంది తండ్రీ ?

ప్రభా : ప్రజారాజ్య మేర్పడుతుంది.

పుష్ప : నియంతృత్వ మొస్తుంది.

బ్రహ్మం : శాంతి సౌఖ్యాలు నెలకొంటాయి.

వెంక : మీపనులు నాకేమి అర్థం కావడం లేదు నాయనా.

ప్రభా : అర్థంకావు.

పుష్ప : ఎప్పటికి అర్థంకావు.

బ్రహ్మం : అర్థంకావడానికి వీల్లేదు.

వెంక : (సుబ్బన్నను విదిలించుకొని, ప్రభాకర్ కాళ్ళపై బడి) నాయనా! మా ప్రాణాలను కాపాడవూ! మమ్ము రక్షింపవూ?

ప్రభా : అది మాచేతిలో యేముంది?

పుష్ప : మేము, పైవాళ్ళ చేతిలోనివాళ్ళం.

బ్రహ్మం : మేము విశ్వాసంగా పని చేస్తాం.

వెంక : పెద్దవాణ్ణి. కష్టంకడుపు పట్టలేక, యిక్కడికి వచ్చి ప్రాధేయ పడుతున్నాను. నామాట వినవా, నాయనా!

ప్రభా : హరిహరాదులైనా-మాప్రజ కడ్డొస్తే కాల్చేస్తాం.

పుష్ప : తల్లిదండ్రులైనా మాసంఘాని కడ్డొస్తే చంపేస్తాం.

బ్రహ్మం : భార్యా బిడ్డలైనా మాపని కడ్డొస్తే నరికేస్తాం.

వెంక : బాబూ! నామొరాలకించరా ?

ప్రభా : నీవిలాగే నిరంకుశంగా ఏడిస్తే పూరుకోబోము.

పుష్ప : నీవిలాగే బ్రతిమాలితే మన్నించబోము.

బ్రహ్మం : నీవిలాగే ప్రాధేయ పడితే సహించబోము.

వెంక : ఎంత బ్రతిమాలినా జాలిలేక, అలాగే కఠినాత్ములై అర్థం లేకుండా నన్ను మీపాట్టపెట్టుకొ పట్టుకుంటె యేంచేస్తాను? కానివ్వండి! కానీ-నను చంపి, మన కుటుంబాన్ని మాత్రం వదిలెయ్యండి.

ప్రభా : అవసర మనుకుంటే, ఎవరినయినా కాల్చేస్తాం.

పుష్ప : ప్రజల శ్రేయస్సు కోసం ఎవర్నయినా హతమారుస్తాం.

బ్రహ్మం : సంఘం బలపడటానికి ఎవర్నయినా చంపేస్తాం.

వెంక : (ఆవేశంగా) అంతకైతే చంపుతాం, చంపుతాం అంటే చంపం డేం? మరోచావు చస్తానా ? కానివ్వండి! ఇదేనా, మీ వీరత్వం? ఇదేనా, మీ ప్రతిభ? ఇదేనా మీ ప్రజాసేవ? ఇదేనా మీ దేశ మరమ్మత్? కానివ్వండి. (ధైర్యంగా నిల్చుంటుంది)

ప్రభా : (పిస్టల్ తీసి) మేం, మీలాంటి సత్యాగ్రహుల వదిలేవాళ్ళం గాదు. (పేలుస్తాడు. వెంకటమ్మ "చంపావా నాయనా! అంటూ తెరలోనికి పడిపోతుంది.) జై ప్రజాసేవక సంఘానికీ జై(అంతా అంటారు.) సుబ్బన్నా! పీనుగను తీసేసెయ్యి. (సుబ్బన్న వెడ తాడు) హమ్మయ్యా. కష్టపడకుండానే చేతికొచ్చేసింది. నాన్సెన్స్! ఇక అకొంప కాస్తా తగలేస్తే అంతా ఒకేసారి చచ్చి పోతారు వెధవలు!

పుష్ప : భలే! భలే! మంచి వుపాయం.

బ్రహ్మం : బ్రహ్మాండమైన ఆలోచన గదూ!

ప్రభా : సుబ్బన్నా! అః మరచేపొయ్యా. ఒంటిమీద నగలేమైనా వున్నాయేమో చూశావా?

సుబ్బ : (వచ్చి) లేవు గానీరి. ఇంగ నేని సంగంల పని సెయ్యనుండీ.

ప్రభా : (మండిపడి, గుడ్లెర్రజేసి) ఆఁ!

పుష్ప : ఒళ్ళు తెలిసే మాట్లాడుతున్నావా?

బ్రహ్మం, కట్టుబాట్లను మరిచిపొయ్యావా?

సుబ్బ ; ఇంగ లాబం లేదుండీ. రోజు రోజుకు మించిపోతుండది యవారం. అన్నాలంగ అమ్మగార్ని గూడ సంపుకుంట్రి.

ప్రభా : ఓరి ఫూల్ ! నీబుద్ధి పెడతిరుగుతున్నదేమిట్రా ? నిరంకుశు డెవడైతే మాత్ర మేమిట్రా ? హతమార్చాలిసిందే. అసలు వాండ్లను చంపండే, నీకీ భూము లెలా వస్తాయోయ్ !

బ్రహ్మం, ఇంకా సుబ్బన్న పాత ఫక్కీలోనే మాట్లాడుతున్నాడు.

పుష్ప : విప్లవమంటే ఒంటబట్టలే.

సుబ్బ : ఇయ్యాల డబ్బులే యియ్యరైతిరి. ఇంగ బూవులేవిత్త రయ్యా !

ప్రభా : ఔరా సోదరా ! మేము, అంటే ఈ ప్రజాసేవకులం యిలా అంటే, ఈవిధంగా కష్టపడుతూ, పేదల కష్టాలను అంటే నష్టాలను తొలగించడానికి కంకణం బద్ధకంకణులైన వాండ్లను యిలా అన్యాయంగా అపనిందల పాల్జేయడం, ఘోరం పాపం ! క్రూరం ! అన్యాయం ! నిరంకుశం! బూర్జువా మెంటాలిటీ! పచ్చిఅబద్ధం! ఎంత అవిశ్వాసంగా మాట్లాడావు సుబ్బన్నా!

సుబ్బ : ఏం పెజయోనయ్యా ! అన్నాలంగ నా సేతుల్తోటి పెంటన్నను సంపిత్తిరి.

బ్రహ్మం : అవునుమరి! అతను బైటపడితే మన రహస్యాలు చెప్పడూ?

సుబ్బ : ఎన్నాల్లీ తిప్పలో గందా.

పుష్ప : ఇంకెన్నాళ్ళు ! దగ్గరకొచ్చింది.

ప్రభా : సామ్రాజ్యవాదుల, ధనికవాదుల, పెట్టుబడివార్ల, జమీందార్ల, సంస్థానాధీశుల-మేడలన్నీ కూలగొట్ట బడుతున్నాయి వాళ్ళ పాపవృక్షం కూకటి వ్రేళ్ళతో పెకలింప బడుతోంది.

సుబ్బ : మేడలన్నీ కూలగొడ్తాంటివి గద. మల్ల మనం యాడ వుండాలె ?

బ్రహ్మం, మనమిప్పు డెదుతున్నామా యేమిటోయ్.

ప్రభా : మనకు మేడలకేం కొరత ?

పుష్ప : మన వ్యతిరేకులను నాల్గు తంతే వాళ్ళే కట్టిరి.

సుబ్బ : ఏవుండీ ! మేడలన్ని గట్టనే వుంచగూడదుండి.

ప్రభా : అందులో ఆందంలేదు.

బ్రహ్మం : పోలీసుల కవి పొజిషన్ తీసుకోడానికి పనికొస్తాయి.

పుష్ప : నీమీద నమ్మకం నీకే పోతున్నది సుమా .

సుబ్బ : అవును తల్లో! నమ్మకం పోతనే వుండది. అటు దనికులని పెద్దోల్లనూ సంపుతాంటివిఁ. ఇటుబువ్వబెట్టలేదని, సందాలియ్య లేదని పేదోల్లనూ సావనూకుతాంటివిఁ. ఇంగ మన మాటోరింటరు? ఓడూ దగ్గరికి సేరనియ్యడం లేదు. తాసును జూసినట్టు సూత్తండరు.

ప్రభా : అయితె, యీ గుట్టల్లోనే వుందాం.

బ్రహ్మం : ఈ పుట్టల్లోనే నివసిద్దాం.

పుష్ప : ఈ చెట్లల్లోనే కాపురం చేద్దాం.

సుబ్బ : ఏవోఁ, మీరూకెనే సెబుతరుగని యింగ నేనీ సంగంల పని సెయ్యనుండి. దీని యవారం అసలే అంతు పట్టడంలేదహె పోత.

ప్రభా : ఆఁ! (సుబ్బన్న లోనికి వెళ్ళిపోతాడు. వీపు తమవైపు తిరిగింది చూసి ప్రభాకర్ మరోదెబ్బ పేలుస్తాడు. "హమ్మా!" అంటూ సుబ్బన్న చచ్చిపోతాడు. అంతా) జై, ప్రజాసేవక సంఘానికి జై! (ఆ వూపులూ లోని కెడుతుండగా)

-గబగబా తెర-

# ఆరవ రంగం

## విశ్వం ఇల్లు

(విశ్వం, జానకి, స్వామి, లింగన్న-వెంకటమ్మ ఫోటోకు నమస్కరిస్తారు.)

విశ్వం : అమ్మ ఎంతచెప్పినా వినకుండా వెళ్ళింది.

జానకి : ప్రేమే, అత్తయ్య నలా లాక్కెళ్ళింది.

విశ్వం ప్రేమ కాదు; మృత్యువు.

స్వామి : అమ్మా ! చిన్నాయిన అందర్నీ చంపేస్తాడట గదే ?

జానకి : ఏమిటోరా-నాయనా !

స్వామి : ఎలాగే ?

విశ్వం : ఏమిటో-అన్నీ పాడు రోజులొచ్చాయి.

జానకి : ఎలా గడుస్తాయో మరి. ప్రతి నిమిషం ఒక యుగంలా తోస్తూంది.

విశ్వం : ఇంత గడ్డురోజు లొస్తాయని కలలోనైనా అనుకోలేదు

లింగ : ఏందన్నా! ఆ సంగపోల్లకిదేం రోగమే? మనుసుల నెత్తక పోటం; సంపటం, పూల్లకు పూల్లే తగల బెట్టటం, గొడ్ల తోలక పోటం, యియ్యాన్ని యేందో, మరెందుకో ?

విశ్వం : అదే తెలియకుండా వున్నది లింగన్నా! వాళ్ళేదో పేదలను బాగుచేయడానికని చెబుతారు.

లింగ : అదేం బాగుచేయడమన్నా! నీవోలె, ఏవ(న్న మందులిప్పిచ్చి రోగాలు నయం సేపిత్తా(రా ? బల్లుపెట్టి సదువులు నేర్పిత్తుం డరా ? అందర్నీ కలిపి యెగసాయం సేపిత్తుండరా.

జాన : చదువు లెందుకు నేర్పించడం లేదూ?

లింగ : ఆ. నేర్పుతనే వుండరు—సావనూకే సదువులు. ఏం బతు కులు; బతికి లాబం? బతుకంటె- తనుదినాలె, నలుగురికి పెట్టాలెగని, ఇదీ ఓ బతుకేనానె?

విశ్వం : వాళ్ళూ బ్రతికిస్తూనే వున్నారుగా, ఒక సంఘాన్ని.

లింగ : సంగమేం సంగం, దొంగలసంగం; దోపిడి సంగం. కాకుల గొట్టి గద్దలకేసినట్టుండది—అల్లయేడుపు. సంగాన్ని గట్ట బతి కియ్యడం ఓగొప్పానె? తాను కట్టపడాలె; పదిమందికి పని జెప్పాలె గని.

జాన : పాపం! వాళ్ళు మాత్రం కష్టపడటంలే- రాత్రనక పగలనక ఒకటే చెట్లల్లో, గుట్టల్లో, పావు(లూ; తేళ్ళనే భయంలేకుండా- ఎంత అవస్థలు పడున్నారు!

లింగ : ఏంలాబం? కట్టపడంగనె పలిత వుండొద్దె? నేను కట్టపడనా, బింగిలు దిసి. ఒకటే తియ్యొచ్చు, కాల్లు నొప్పులు పుట్టేదన్క. కని, లాబం? గట్ట కట్టపడ్తె బువ్వకొత్తదా ? బట్టకొత్తదా ?

విశ్వం : ప్రజాద్రోహు లందర్నీ శిక్షించాకగాని- బువ్వా, బట్టా.

లింగ : ఏం పజా ప్రలన్నా! మంచి మంచోల్లందర్ని దొంగోతు పట్టకపోటం బలంతంగ సాపసూకటం. నిజంగ సచ్చినోల్లంత ఏసుంటు మడుసులే? పరాల మడుసులుగాదె! లచ్చ రూపా యలు పోత్తె పాత్తరం మల్లి యీ బామ్మిన గట్టాటోల్లు మల్లి బుత్తరంటవా? గామద్దె, రామాంజయ్యగార్ని సంపిర్నుగద! అయిన ఓరి జోలికన్న పొయ్యోపోడేనా? బబాపు కొచ్చిన పాపాన పోయిండానె? పెద్దపెద్ద సదువులు సదివినోడు. బల్ సక్కాటి మనిసిగద. గట్టాటోర్ని సాప సూకిరి. పెజాదెయుంటె యేం పెజాదెయే? సరె. అయ్యగార్ని సంపడం మాటట్టబోనిరి, అమ్మగార్ని సంపుడేపంటరు?

జాన : ఆమె నిరంకుశురాలు, పెట్టుబడిదారు, ప్రజాద్రోహి అయి వుంటుంది.

లింగ : సూడబోతె గట్టనే ఉంటది యవారం. యాడి అమ్మగారు! యాడి పెజాదెవమ్మే అన్నా!

విశ్వం - మరి. వాళ్ళ పద్ధతు లంతే లింగన్నా!

లింగన్న : ఏం పద్దతే. పాడుపద్దతి. మన పద్దతంత మంచిదెముంటది సెప్పవే? ఊల్లోల్లందర్కి మన పద్దతే ఇట్టంగని, పాడు మడు సులకు దడిసి వూరుకుంటుండరు. అప్పుడే పెంటిగాడు, చుబ్బి గానంతోల్లు బైటికి రావాలనుకున్ను గద!

విశ్వం, వచ్చారా మరి?

లింగ : ఆఁ! రానిత్తరేంది! ఆసంగంలకు పొయివెల్లు అటు తోవేగని మల్లి యింగ యింటికి రాటం యాడిది? ఇంటికి వద్దాయను కుంటె కొట్టి సంపిరంటగద.

జాన : ఈ విషయం బైటికి రాలేదే, పూర్తిగా!

లింగ : నేనూకుంటున్నానా, అడాడ దిరిగి సంగతులు తెలుసుకొత్తనే వుంటి.

విశ్వం : నిన్ను వాళ్ళను పట్టుకోడానికి పంపితే బాగుంటుందను కుంటా.

లింగ : ఓ! ఎల్తనేం. అల్లు బావుల్ల, సెర్లల్ల, గుట్లల, చెట్లల్ల, కంచెల్ల వుండేది వోరికి దెలుస్తది? (లోపల గడియారం తొమ్మిది కొట్టిన ధ్వని)

జాన : అఁ! అదిగో తొమ్మిదైనట్టున్నది. మాటలతో అలాగే పొద్దు పోతున్నది. భోజనానికి లేద్దాం లేవండి.

(విశ్వం, జానకి, లేస్తారు)

విశ్వ : ఏం లింగన్నా, లేవవూ! కాళ్ళు కడుక్కో.

లింగ : నాకీ పూట బువ్వొద్దే అన్నా!

జాన : లింగన్నకు భయ మెక్కువౌతున్నట్టుంది.

లింగ : అఁ! బయమేం బయం. సావ బొయ్యి సత్తవాఁ? తల్లి కడుపుల మల్ల బుడ్తవా ?ఁ

విశ్వం : మహా ధైర్యశాలివిగాని, లే, ఒక్క ముద్ద తిందువుగాని.

లింగన్న : ఎహె, నిజంగనేనే. నాకు అకలి అయితలేదే.

జాన : అఁ మహాబాగా అవుతుంది లెద్దూ, కంచంముందు కూర్చుంటే.

లింగన్న : నాకు ఓ అంటే రమ్మంటరు. నేనైతెరానమ్మ. సదువుకో వాలె. సావీఁ! ఇంగ పుత్త కాలు తేవూ? సదువు జెప్పవ్? [జానకి, విశ్వం లోని కెడతారు. స్వామి లేచి పలక, బలపం తెచ్చి పాఠం చెబుతుంటాడు. డిక్టేషన్ చెబుతాడు.]

స్వామి : అఁ వ్రాయి లింగన్నా! [స్వామి చెబుతుంటాడు. లింగన్న వ్రాస్తుంటాడు.] మానవుడు-దేశం- తాలూకా- ఊరు- పల్లె-

సంఘుం - ప్రజలు - తిండి-బట్ట - కూలి......ఆఁ! లింగన్నా!
ఎన్నయ్యాయో లెక్కపెట్టు!

లింగ : (లెక్కించి) పదయినై!

స్వామి : ఇక చాలు. (స్వామి, పలక తీసుకొచ్చి చూచి) సరేగాని లింగన్నా! 'సంఘుం' అంటే పత్తు లేకుండా "సంగం" అని వ్రాశావేం?

లింగ : 'సంగం'ల పత్తాడ వుందె?

స్వామి : పత్తు పలకాలి. లేకుంటె, తప్పున్నమాట.

లింగ : మరి, సంగంల తప్పుగాకుంటె వొప్పుండదందేం?

స్వామి : ఛా. అలా అనగూడదు. తప్పు. 'సంఘుం' అనాలి.

లింగ : ఏఁవనే? 'సంగం' అనా? (పత్తులేకుండా గట్టిగా అంటాడు)

స్వామి : అలా కాదు 'సంఘుం' అనాలి.

లింగన్న : ఆఁ! సంఘుం. (సరిగ్గా అంటాడు.)

స్వామి : (ఆపలించి) లింగన్నా! నిన్న వస్తున్నదే! ఇది పొయ్యేట్టు ఒక పాట చదవవూ?

లింగ : అమ్మో! నేనా రేత్తిరైంది. పండుకో! రేపు సదువుతలే.

స్వామి : కాదు, యిప్పుడే చదవాలి.

లింగ : మరి, యింగ తప్పేది లేదానె. నాకైతె బాగోతం పాటొచ్చు మరి.

స్వామి : అదే చదువు.

లింగ : (రెండు గొంతులతో)

యాటా మార్గము నేనూ-యెలదీరో పొయ్యేత్తూ ఆదీలచ్మీ
యాటా మార్గము మనమూ-ఎన్నాడూ ఎరుగాము పానానాధా
గిరగిరా తిరిగొత్తూ సింతా నీకెందూకే-ఆదీలచ్మీ ॥యాటా॥

గుట్టలెక్కగలవా-నరహరి, చెట్టులెక్కగలవా
గుట్టల వుండే గుంటి తేనియలు తెచ్చిపెట్టగలవా
గుట్ట లెక్కగలనే బామా-సెట్టులెక్కగలనే
గుట్టలవుండే గుంటితేనియలు తెచ్చిపెట్టగలనే

(పాట అవుతుండగా స్వామి నిద్రపోతాడు. విశ్వం, జానకి భోం చేసి వస్తూ)

విశ్వం : స్వామి నిద్రపోతూన్నట్టుందే ?
జాన : లింగన్నే నిద్రపుచ్చినట్టున్నాడు.
విశ్వం : ఏం లింగన్నా ! ఇప్పుడైనా ఆకలి అవుతోందా ?
లింగ : ఎందుకె బలవంతం అన్నా ! నాకాకలైతె నే వూకుంటానె? ఎగిరి గంతేసి, ఇంట్లజొరబడి, తపాల లంకిచ్చుకోని తిననహె. నాకామాత్తరం సతంతరంలెదానె ?
జాన : అమ్మో ! నీవు స్వతంతుృడ వయ్యావన్నమాట !
విశ్వం : ఇక-కొంపతీసి చాపగొట్టటాలూ, కొంపలు తగుల పెట్టటాలూ సాగిస్తా వన్నమాట.
లింగ : అదేం మాటన్నా. సతంతరవంటె గదానె ?
జాన : మరేమనుకున్నావు ?
లింగ : ఏదో మొదల్లె సతంతర మొచ్చింది, సతంతర మొచ్చిందంటె వూరంతెనికిన్నే, యాడ దొరకలే. ఆనిక్కె తెల్చింది, సతంతర వంటేందో. మనతో యెట్టి జేపిచ్చుకునే దొరోల్లూ- గొర్లూ, మేక పోతులూ తిస్కపొయ్యే జమీందోర్లూ పోతరని.
విశ్వం : ఇప్పుడూ వున్నారుగా- గొర్లూ, మేకపోతులూ తిస్కపాయే వారు.

లింగ , అ, అ. కొత్త యీ సంగపోల్లకన్న ఆ దొరలే నయమనిపిత్తాంది. ఆదొరోల్లు-సెప్పినమాటినకుంటె నాలుగు దెబ్బలు కొటో, బంధ లెత్తి, దండగేసో, ఎట్టనైన పెల్లాం పిల్లలకు మాత్తరం దక్క సిచ్చేవోల్లు. ఇంగ యిప్పు డెచ్చింరయ్యా సంగపోరు. ఆల్లకు లంచా లియ్యాల్రయ్యా, లంచాలు.

విశ్వం : లంచాలు కావవి; విరాళాలు.

లింగ : ఎట్టైడిత్తేవుండదే. బలపంతంగిచ్చుడేగద! డబ్బుకు డబ్బు యియ్యాలె, మేకలకు మేకలూ యియ్యాలె. బువ్వకు బువ్వా బెట్టాలె. ఆదొర్లు పోంగనే యీవోర్లు పుట్టుకొచ్చిన్రు పుట్టకొక్కు లోలె! ఈల్లు పెట్టే బాధలింగ-సాపసూకటం, బాంబంటయ్యా బాంబు. బాంబేసి సాపగొట్టటం, ఇల్లు తగుల బెట్టటం, ఇట్లుం డయి, ఆల్ల యవారాలు.

విశ్వం : లింగన్న పెద్ద రాజకీయ వెత్త అయిపోతున్నాడే. (ఆవలించి) ఆఁ! నిద్ర వస్తూంది. పడుకుందాం. (అంతా పక్కలపై ఒరుగు తారు. విశ్వం, ఏదో చదువుకుంటుంటాడు ....... కొంత సేప య్యాక ఏదో చప్పుడవుతుంది. అంతా లేస్తారు.) ఏమిటా చప్పుడుంలింగన్నా ?

లింగ : ఆసేతెలుగుడి దిటు దేవే; సూసొత్త.

విశ్వం: నేనూ వస్తానుండు. (ఇద్దరూ లేస్తారు)

జాన : అనవసరంగా బైటికి వెళ్ళకండి; పొంచుంటారు. అయినా ఎందుకులెండి, పడుకోండి.

లింగ : ఏంబయం. రావే పోదాయిఁ. (ఇద్దరూ కొన్ని అడుగులు ముందుకు వేసి, బ్యాటరీ పైకి వేసి చూచి)

విశ్వం : లింగన్నా ! ఏమిటది ? ఏదో-నల్లటి ముసుగులాగా వుందే ?

జాన : అమ్మయ్యో, ముసుగే. (గట్టిగా కళ్ళు మూసుకుంటుంది.)

లింగ : (జంకి) ఏందే! పడుకుండాయిరా అన్నా! (మళ్ళీ యిద్దరూ మంచాల దగ్గరికి వచ్చి కూర్చున్న తర్వాత) అన్నా! నిదర యెగిరి పొయ్యింటదుకు యేదన్న పాట పాడనా?

విశ్వం: ఒకపక్క ప్రాణాలు డుక్కుడుక్కు మంటుంటే నిపాటెవ రికొవాలి?

లింగ : అరిశేతుల్లో ప్రాణాలు పెట్టుకొని గిట్టెన్నాళ్ళుండాల్నే?

విశ్వం : మంచిరోజులు వచ్చేదాక. (మళ్ళీ చప్పుడు) అదిగో మళ్ళీ చప్పుడు. చూద్దాంరా లింగన్నా! (ఇద్దరూ వెళ్ళి బ్యాటరి వేసి చూచి) ఏంటా ముసుగు లింగన్నా! అల్లాగే వుందేదే?

లింగ : ఏది ఆబ్యాట్రి యింకాత్త పైకెయ్యి? (విశ్వ మలా చేస్తాడు) ఓసోస్ అది పిల్లిగాదే! ఉట్టిమీది అటికెల సల్ల దాగుతుండది.

జాన : (ముసుగుతీసి) హమ్మయ్య! పిల్లేనా?

విశ్వం : ఎంత గాభరా పడుతున్నాయో చూచావా ప్రాణాలు. (జానకితో) సరేగాని, పిల్లి అటికెమీది మూత పడగొట్టినట్టుంది. అన్నీ సరిగ్గా పెట్టొస్తావా?

జాన : అఁ! పడుకుందురూ! తాగితే తాగింది. అది మాత్రం తాగొద్దా యేమిటి? పడుకోండి. ప్రొద్దున్నే చూచుకోవచ్చు.

లింగ : బాగనే వుండది దరువు! బ్యాట్రిటుతేవే. నేను పొయ్యి మూత పెట్టొత్త.

విశ్వం : నీవొక్కడివే ఎందుకు? నేనూ వస్తా పద! (ఇద్దరూ లోనికి వెళ్ళొచ్చి పడుకుంటారు. కొంత సేపు నిశ్శబ్దం. స్వామి ఉలికి పడ్తాడు)

జాన : స్వామి ఉలిక్కి పడుతున్నాడండి!

లింగన్న : ఎప్పుడయ్యో ముచ్చట్లాయె. భయపడ్డడు పాపం!
విశ్వ : ఇక వాడిముందు, యీ విషయాలు ఎక్కువగా మాట్లాడకండి.
జాన : మనకన్న ముందు వాడే వార్తలు తెస్తాడు.
విశ్వం : ఏమో-అనుకుంటున్నాంగాని, వాళ్ళకుమాత్రం జ్ఞానం లేదూ?
స్వామి : (కలవరింతలో బిగ్గరగా కాళ్ళు, చేతులూ ఆడిస్తూ) చిన్నాయినా! చంపకు, నేనేమనలెదు నిన్ను. అబ్బ! చంపకు చిన్నాయినా, నొప్పి లేస్తున్నది. కొట్టకు చిన్నాయినా! (ఏడుస్తుంటాడు. అంతా గబగబా లేచి స్వామిని లేపుతారు)
జాన : ఏమిటిరా నాయనా, కేకలేస్తున్నావు ?
స్వామి : (ఉలిక్కిపడిలేచి తేరుకొని) కేకలేశానా ?
విశ్వం . ఏమిటో, అరుస్తున్నావు గదరా ?
స్వామి : (స్పృహ తెచ్చుకొని) కలవచ్చింది. చిన్నాయనట—తాత, నాయనమ్మల తలకాయలు పట్టుకొని సుబ్బన్నను వెంటబెట్టుకొని వచ్చాడే. నన్ను చిన్నాయిన, కొరడా తీసికొని ఒకటే కొడుతున్నాడే. ఏమిటో నమ్మా! భయమవుతున్నదే. (బిక్కమొహంతో తల్లి వొడిలోకి దూరుతాడు)
జాన : ఏమిటో నాయనా, నిన్నెట్లా బ్రతికించుకుంటామో? ఏమండీ, లేకుంటే-ఏవూరైనా వెడదామండి.
విశ్వం : ఎక్కడికెడతామే, యిల్లూ వాకిలీ బ్రతుకు దెరువూ పదిలి.
జాన : ఏమో-నాలుగురోజు లెక్కడైనా తల దాచుకుందామని.
విశ్వం : ఆ! అనుకోనడమేగాని, వూళ్ళో పోలీసు లుండగానే యింత భయపడుతూవుంటే- యిక యింకొచోటమాత్రం ఎలా నిభాయిస్తాం ?
జాన : ఏమిటోనండీ! దినగండం నూరేండ్లాయువులా వుంది.

లింగ : నిజంగనేనే. వూళ్ళో పోలీసులుండంగ మనకేం బయమే ?
జాన : ఏం పోలీసో! ఒక ప్రక్క ఈ పోలీసూ, మరో ప్రక్క ఆ పోలీసూ.
విశ్వం : మరీ అంత భయపడి మాత్రం ఏంచేస్తాం ?
లింగ : ఆల్లముండ ! ఆల్లేమొత్తరు. ఆల్లకూ పొయ్యేకాలం దగ్గరి కొచ్చింది. ఓటూ-కొంపల తట్టు రానియ్యటంలేదు. ఒక్కొక్కల్ని సర్కారోరు పట్టక పోతనే వుండరు.
జాన : ఏమిటో లింగన్నా ! నీవన్నీ ధైర్యం చెప్పే మాటలేగాని-
లింగ : అదేమ్మాటే. ఆల్లకింక ఊల్లను రాటానికి గుండె లుండాయే?
జాన : ఏదో ఒక పిచ్చిపని చేయడానికి పెద్ద గుండె కావాలాయేం ?
విశ్వం : పిల్లవాని ముందు మరీ నిరుత్సాహంగా మాట్లాడకండి. అరప కుండా నిద్రబోండి.
జాన : అదొకటి వస్తేగా-పోవడానికి. యెన్నాళ్ళాయె నిద్రలు లెక.
విశ్వం : వాళ్ళు నిద్రపోరు, మనను పోనివ్వరు.
లింగ : అల్లకేవన్నా. పైటింతల నెంటర్లు పెట్టి పురికాగులనింత పండు కుంటరంట.
విశ్వం : సరెలెండిగాని, యిక పడుకోండి.

(అంతా పడుకుంటారు ..బ్యాక్‌గ్రౌండున పాట ప్రారంభమవు తుంది.)

ఈ ఘోరకర్మమును యినుమడిపంగజేయ
నేతెంచె నీరేయి ఎటుతెల్లవారునో
ఆకైన అల్లాడ నీకున్నదీ రేయి
భీకర ధ్వనులచే భీతిగొల్పగజేయు
చీకటులు జిగిబిగిగ పాకి భయమునుగూర్ప

వేకువౌ జెప్పుడో ఎటు తెల్లవారునో
ఎటు తెల్లవారునో ఎటుతెల్లవారునో

(పాట చివరి చరణాలు పైస్థాయిలో అంటున్నంతసేపూ యిల్లు తగులబడుతుంటుంది. అంతా హడావుడిగా లేచి భయపడ్తారు. అవీ యివీ సామానులు బైట పడేస్తారు. స్వామి గజగజ వొణుకుతూ ఘోరున ఏడుస్తుంటాడు. లింగన్న ఎత్తుకొని లోపలికి తీసుకెడతాడు. ఈదృశ్య మంతా నిమిషంపాటు జాగ్రత్తగా జరుగుతుంది. గబగబా తెర పడ్తుంది... తిరిగి తెర ఎత్తేసరికి-అక్కడక్కడా మసి అంటిన గుడ్డలతో యింటివాళ్ళు)

విశ్వం : హమ్మయ్య! ఇప్పటికి వాడి కసి తీరిందన్నమాట.

లింగ : ఓకాడ్నుంచి నిద్దరే పోలేదు; అప్పుడే వచ్చిన్రు.

జాన : ఏమోనండీ. ఇక యిప్పుళ్ళో లాభంలేదు.

స్వామి : అమ్మా! ఎట్లాగే?

విశ్వ : స్వామీ! భయపడకుబాబు

జాన : పెద్దలమే హడలిపోతుంటే, యిక వాడు మాత్రం భయపడ కుండా ఎలా వుంటాడు?

లింగ : మరేంజేద్దామంటవ్?

జాన : ఈ అల్లర్లు తగ్గేదాకా ఎక్కడైనా వెళ్ళడమే మంచిది. (కొందరు ప్రజలు ప్రవేశం)

ఒకడు : మేవంత వుండంగ యాడికి బోతరు?

విశ్వం : మీరుండి మాత్రం యేంచేయగలరు, నిరాయుధులు?

మరొకడు : ఏంజెయ్యవన్నరు జెప్పురి. అన్నిండ్లకు బైట గొళ్లాలు బెట్టి, బైటి కెల్లితె సంపుతరవన్నరు.

ఇంకొకడు : ఆడికీ-యింటెకనించి గోడ దునికొచ్చినం.

ఒకడు : కట్టవోఁ, నిట్టూరవోఁ యీడ్నే బతకాలెగని, యింకోకాడెట్ట కుదురుతది ?

లింగ : నేనదే అంటుండనే అన్నా.

మరొకడు : మరింకేంది ? పారి, మాయిండ్లకాడ్నే వుందాయిఁ. (అంతా తలో సామాను తీసుకొని వెడుతుంటారు. సబినస్పెక్టరు ప్రవేశం)

స. ఇ : ఏమండీ విశ్వంగారూ ! అంతా క్షేమంగా బైటపడ్డారా ?

విశ్వ : పోయినవారం పోగా—

ఇ. ఇ. : ఏం, అంత యిదిగా అన్నారు.

లింగ : గిప్పుడొచ్చినారుండి? అయ్యాగార్ని సంపిరి; అమ్మగార్ని సంపిరి; కొంప తగల బెట్టిరి.

విశ్వం : అలా అనకు లింగన్నా ! వారూ శ్రమ పడుతూనే వున్నారు.

స. ఇ : చాలామంది దొరికి పోతూనే వున్నారు.

లింగ : మా సేతికి టుపాకు లియ్యారాదురి; దెబ్బ సూసుకునేటోల్లం.

విశ్వం : నీకు తెలియదు లింగన్నా. ఊరుకో ! మనమంతా వాళ్ళను దగ్గరకు చేరనివ్వకుంటే అదే చాలు.

స. ఇ : భయపడకండి. కొద్దిరోజుల్లోనే వాళ్ళంతా పట్టుపడ్తారులెండి. మొన్ననే వాళ్ళ నాయకులు కొందరు దొరికారు. వాళ్ళద్వారా మన కార్యక్రమం సులువవుతున్నది. ఏం చేయమంటారు— దేనికైనా కష్టాలు వొస్తాయి. ధైర్యంగా ఎదుర్కోక తప్పదు. ఆఁ! ఎటో వెళుతున్నారు ?

విశ్వం : ఎటు పెళ్ళాం తిరిగి యిల్లు చేసుకునేదాకా వీళ్ళవగ్గరికి వెడుతున్నాం.

స. ఇ : మంచిది. (అంతా వెడుతుండగా తెర)

# ఏడవ రంగం

## గుట్టల ప్రదేశం

[కొన్ని రాళ్ళూ, పైళ్ళూ. బ్రహ్మం —కాయితాలేవో తిరిగేసి, నెమ్మదిగా లేస్తాడు. ఏమి తోచదు. అటూ యిటూ పచార్లు చేస్తుండగా పుష్ప వస్తుంది]

బ్రహ్మం : ఏం పుష్పా! ఎటైనా వెళ్ళిపోదామా ?

పుష్ప : అదెలా ?

బ్రహ్మం : ఏంచేస్తాం చెప్పు ! ఎప్పుడూ యిక మనం చెప్పినట్టు వినేట్టు లేదాయె.

పుష్ప : ఏం ? ప్రజలు మీ సేవను వొద్దంటున్నారా ?

బ్రహ్మం : ఆఁ! ఎందుకేడిపిస్తావు లెద్దూ !

పుష్ప : నేనేడిపించేదాన్ని; మీరేడిచేవారూనా ?

బ్రహ్మం : అదే-యిక ఎలాగైనా లాభంలేదు. ఎన్నాళ్ళీ గుట్టల్లో, చెట్లల్లో తపస్సు చేస్తాము చెప్పు !

పుష్ప : వెళ్ళడానికేం-వెళ్ళొచ్చు గాని, ఎటు వెళ్ళగలమా అని.

బ్రహ్మం : ఇతర దేశాలకు.

పుష్ప : ఇతర దేశాలకే! ఈదేశమొకటి పూర్తిగా దాటవేస్తామా అని!

బ్రహ్మం : ఏం ?

పుష్ప : పోలీస్ పూర్తిగా నలువైపులా కట్టుదిట్టంగా పని చేస్తున్నదిగా.

బ్రహ్మం : అలాగని యిలా వెడతామాయేం ? మనకుండనేవున్నాయి, మారువేషాలు.

పుష్ప : ఏం వేషాలో ! కనపడ్డామో చంపేస్తారు.

బ్రహ్మం : అదే వచ్చిన భయం.

పుష్ప : ఏమిటో-ఇలా అవుతుందనుకోలేదు.

బ్రహ్మం : నేనుమాత్రం అనుకున్నానా యేమిటి ? ఏదో - ప్రజాసేవ చేద్దాం, బీదల బాగుచేద్దామనుకుంటే-చివరకు మనం మనం మిగిలామేగాని-ఒక్క వెధవా వుండేట్టులేదే.

పుష్ప :- అప్పను మరి; ఎన్నాళ్ళుంటారని. అటు వాళ్ళకా హక్కులు వచ్చేట్టు లేదాయె. పైగా - మనమా, చెట్లల్లో గుట్టల్లో వున్న న్నాళ్ళూ ప్రజ లనేక అవస్థలు పడ్డారయ్యో.

బ్రహ్మం :- అయితే పైటు మారుద్దామా యేమిటి ?

పుష్ప :- ఏది మార్చినా, ప్రజల్లోకి పోవాలిగా.

బ్రహ్మం:- ఆహా , అదేమ్మాట ?

పుష్ప :- మన నిప్పుడెవడు నమ్ముతాడు ? ప్రతివాడూ మనసొక రాక్షసుని చూసినట్టు చూస్తున్నాడు.

బ్రహ్మం:- ఛీ! లోకంలో న్యాయానికి తావు లేదుగదా. ఏదో సౌఖ్యవంత మైన రాజ్యాన్ని స్థాపిద్దామంటె...

పుష్ప :- ప్రజాస్వామ్య పద్ధతుల ద్వారా పద్ధట.

బ్రహ్మం:- వాళ్ళముండ. వాళ్ళకేం తెల్సు- ఏం కావాలో ? ఏదో కష్ట పడిభూములిప్పిస్తాం రాండిరా అంటే ఒక్క వెధవా మాట వినకుండా పోవటం, ఎంత ఘోరమంటావు ?

పుష్ప :- ఏమిటో ఈ చదువు రానివాళ్ళ కెంతబోధిస్తే మాత్రం ఏం లాభం ?

బ్రహ్మం:- అంతటితో ఆగు ! చదువురానివాళ్ళే ఈ మాత్రం వింటే యిక చదువుకున్నవాళ్ళు అసలు వింటారా అని ?

పుష్ప :- అక్కడక్కడ దోచుకొచ్చిపెట్టినన్నాళ్ళు వెంటవున్నారు వెధవలు.

బ్రహ్మం:- ఏమిటో అంతా స్వార్థపరులు !

పుష్ప :- ఈలోకమంతా స్వార్థమయమే.మనమేదో కాస్తో కూస్తోనగలు దాచుకోబట్టి సరిపోయిందిగాని, లేకుంటే మనను యీ కాస్తా అడిగే దిక్కుండేది కాదు.

బ్రహ్మం:- అలా వుండడానికి మనమేమన్నా పిచ్చివాళ్ళమా ?... అఁ ! ఇంతకూ ప్రభాకర్ దళం రాలేదెందు చేతనో ?

పుష్ప :- వస్తామన్నటైమౌతోంది. మరి రావాలిగా.

బ్రహ్మం:- మరి, మనం యీలోగానే ఉడాయిస్తే—

పుష్ప :- చిక్కేలేదు.

బ్రహ్మం:- అయితే, యింకేం! నగలూ, అవి సంచికలో పెట్టెసెయ్యి. (పుష్పలోనికి వెళ్ళి తిరిగి నగలూ, ఆస్తిపాస్తుల సంచితో ప్రవేశించి)

పుష్ప :- రండి వెడదాం (ఇద్దరూ వెడుతుండగా హటాత్తుగాప్రభాకర్ వచ్చి)

ప్రభా :- ఏయ్ బ్రహ్మం! ఇదేంపని? నేనెన్నోసార్లు చెప్పాను, పుష్పగారితో సరససల్లాపాలాడ కూడదని. అప్పటికీ వినలేదుగనుక నీపై

డిసిప్లినరీ చర్య తీసుకోక తప్పిందిగాదు. (కాగితమందిస్తాడు) నీవు రెండేళ్లదాకా ఈ సంఘంలో వుండటానికి వీల్లేదు. పుష్ప గారూ! మీకిదే ఫస్టువార్నింగ్!

పుష్ప :- (నీళ్ళు నములుతూ) నేనేమనలేదు ప్రభాకర్‌గారూ! ఆయన గారే నన్ను బలవంతంగా...

ప్రభా :- ఆc! బ్రహ్మం! సంఘ నిబంధనల నుల్లంఘిస్తున్నావా?

బ్రహ్మం :- పుష్పా! జరిగిందేమిటో నిజంచెప్పు!

పుష్ప :- నిజమింతకంటే యేముంది?

బ్రహ్మం:- ఆc! ప్రజల ప్రమాణంగా చెప్పు!

పుష్ప :- కాకుంటే నాకబద్ధమాడాల్సిన గతేమిటి?

ప్రభా :- మీరిలా తగాదా పెట్టుకుంటున్నారు. సంఘ శ్రేయస్సును మరిచారా?

బ్రహ్మం:- పుష్ప అబద్ధమాడుతున్నది.

ప్రభా :- బ్రహ్మం! నీవుచేసిన తప్పేమిటో నాకుతెలుసు. వెంటనే లెక్క లప్పగించి బయటికి నడువు.

బ్రహ్మం:- అంతయిద్దైతే వెళ్ళకేంచేస్తాంగాని, పుష్ప విషయం తెలుసు కోకపోవడం....

పుష్ప :- ఏమిటా తెలుసుకునేది?

బ్రహ్మం:- నీవిలారంగులు మారుస్తావనుకోలేదు.

పుష్ప :- మనకలవాటేగా పైటుమార్చడం.

బ్రహ్మం:- పచ్చి అబద్ధాలాడుతున్నావు.

పుష్ప :- అది మనకు వెన్నతో పెట్టిన విద్యేగా?

ప్రభా :- ఏయ్! ఇదేమన్నారచ్చకొట్ట మనుకున్నారా? కాస్త కట్టుబాట్లు తెలుసుకొని మాట్లాడండి.

బ్రహ్మం:- ఇంతకూ పుష్పచేసినతప్పు ఒప్పుకోదుగా?

పుష్ప :- నేనో తప్పంటూ చేస్తేగా, ఒప్పుకోడానికి.

బ్రహ్మం:- ఇంకా అలాగే అంటావుగదూ!

పుష్ప :- న్యాయకోసం నేనేమైనాసరే, గట్టిగా మాట్లాడేదే.

బ్రహ్మం:- ఆడది ఎంతకయినా తగు.

ప్రభా :- బ్రహ్మం! చివరకు నీవు తోటి మహిళాపర్కర్తను దూషిస్తు న్నావుసుమా! బూర్జువామాటలు మాట్లాడుతున్నావు.

పుష్ప :- జాగ్రత్తగా మాట్లాడు. పిచ్చపిచ్చగా వాగబోకు తెలిసిందా

బ్రహ్మం:- ఓసిముండా!

పుష్ప :- ప్రభాకర్‌గారూ! చూస్తూ ఊరుకుంటున్నారా?

బ్రహ్మం:- ఊరుకోక ఏంచేస్తాడే బద్మాష్.

(ప్రభాకర్ బ్రహ్మాన్ని నెట్టివేయడానికి చెయ్యి చేసుకుంటాడు. బ్రహ్మం ఫెళ్ళున ప్రభాకర్‌ను వేస్తాడు. అదింతింతై పోట్లాటగా పరిణమిస్తుంది. ప్రభాకర్ పిస్తల్‌తీసి బ్రహ్మాన్ని కాల్చబోతాడు. ఆ దెబ్బ పుష్పకు తాకి 'హబ్బా' అని లోనికి కూలిపోతుంది. బ్రహ్మం తన పిస్తలు లాగేసరికి బయటనుంచి కొని కాల్పుల ధ్వనులు, విజిల్స్ వినబడ్తాయి. ప్రభాకర్ బ్రహ్మం లిద్దరూ 'పోలీస్ పోలీస్' అని తప్పుకోవడానికి ప్రయత్నించేసరికి అవతలినుంచి దెబ్బఒకటి ప్రభాకర్ చేతికి తాకుతుంది. అక్కడక్కడా గాయాలవుతాయి. వాటి నదిమి పట్టుకొని గభాల్ని జారుకుంటాడు. చప్పున పోలీస్ అందుకని పారిపోవడానికి తడుముకుంటున్న బ్రహ్మాన్ని పట్టుకుంటుంది. పోలీస్ 'హాల్ట్' అనగానే బ్రహ్మం ఆగిపోతాడు. 'హ్యాండ్స్ అప్' అనగానే పిస్తలు పారేసి చేతులు ఎత్తుతాడు. పోలీస్ యిన్‌స్పెక్టరూ, మరియిద్దరు భటులూ ఆయుధాలతోవచ్చి బ్రహ్మాన్ని పట్టుకుంటారు.)

స. ఇ:-ప్రజాసేవ అనే పేరుతో అన్ని సక్రమ సంఘాలకూ అప ఖ్యాతి తెస్తున్న ఫూల్స్. (బేడీలు వేస్తాడు).

బ్రహ్మం :- పోలీస్ జులుం నశించాలి. (అని ఆవేశపడ్తాడు.)

స. ఇ :- ఆc! ఇంకా పొగరు తగ్గలేదన్న మాట. (దెబ్బవేసి) ఎవరీ పడిపోయినావె ?

బ్రహ్మం :- తెలియదు (దెబ్బవేశాక) పుష్ప.

స. ఇ: :- పుష్పా ? నాయకురాలన్న మాట; మీలో మీరే చంపుకుం టున్నారన్న మాట. ఆc! ప్రభాకర్ ఏడీ ?

బ్రహ్మం :- తెలియదు (దెబ్బ) పారిపొయ్యాడు.

స. ఇ :- మీ దళమంతా ఎక్కడుంది ?

బ్రహ్మం :- తెలియదు (దెబ్బ) చూపుతాను.

స. ఇ :- నగలన్నీ ఎక్కడున్నాయి ?

బ్రహ్మం :- తెలియదు (దెబ్బ) కొన్నిక్కడే వున్నాయి. మిగతావి పాతిపెట్టాం; చూపుతాను.

స. ఇ :- రికార్డెక్కడుంది ?

బ్రహ్మం :- తెలియదు. (దెబ్బ) హబ్బా! ఆ పావలో వున్నాయి. చూపుతాను.

స. ఇ :-పద, స్టేషనుకు నడు. (భటులతో) శవాన్ని కారులోకి తీసుకొని రండి.

(వెడుతుండగా)

తెర

# ఎనిమిదవ రంగం

## రాఘవయ్య భూప్రదేశం

(రంగస్థలంలోని ముందరి సగభాగం. బ్యాక్‌గ్రౌండ్‌స పాట ప్రారంభమవుతుంది. చిరిగిన గుడ్డలపై రక్తపు మరకలు, చెదిరిన జుట్టుపై దుమ్ము, మాసిన గడ్డంతో ప్రభాకర్ గాయానికి కట్టుగట్టుకొని బాధపడుతూ ప్రవేశం)

తప్పు త్రోవనుబట్టి పోయావా
తప్పు లెన్నింటినో చేశావా
ప్రజల సేవనుపేర ప్రకటనలు చేయుచూ
ప్రజల అండను వదలి పెడమార్గమునుబట్టి
హత్య లెన్నింటినో చేశావా కొంపలెన్నింటినో కూల్చావా
॥తప్పు॥

కల్లబొల్లులు ఎన్నొ చెప్పావా
కానిమాటల మాల గుచ్చావా

దేశమంతా నేడు గగ్గోలుపడుతుంటె
పోరాటమంచును ప్రజల దోపిడిచేసి
తిరిగి అల్లర్లనే రేపావా
నీవు చిత్రహింసలనెన్నొ చేశావా ॥తప్పు॥
ప్రేమానుబంధాలు వీడావా
నీతియను మాటనే విడిచావా
అర్ధజ్ఞానములేని అజ్ఞానులనుకూడ
అరమరే లేకుండ హత్యగావించావు
కరకురక్కసివోలె మెలిగావా
నిలుప నీడేలేక పోయిందా ॥తప్పు॥

(పాట పూర్తయ్యేసరికి ప్రభాకర్ పడిపోతాడు. విశ్వం ప్రవేశిస్తాడు. ఆశ్చర్యంతోపాటు కోపమూ)

విశ్వం :- ఓహెూ! నీవా, సోదరుడవు! కన్న తల్లిదండ్రులను పొట్టబెట్టుకొని, వ్యవసాయం సాగకుండా సమ్మెలు చేయించి, పశువులను దొంగతనంగా తోలుకెళ్ళి, కొంపలో మే మంతా నాశనం గావాలని నిప్పు ముట్టించినా చావలేదని, తిరిగి ఈ రూపంలో ప్రత్యక్షమయ్యావా సోదరా? మళ్ళీ చంపడాని కొచ్చావా? నీ కసిదీరాచంపు! గాట్లు గాట్లు పడేట్టు పొడువు! కనుగుడ్లుతీయి; చేతులు నరుకు; కాళ్ళుతెగ్గెట్టు; కీళ్ళు తొలగదియ్యి; తల కోసెయ్యి (నిటారుగా నిలుచుంటాడు. ప్రభాకర్ భోరున ఏడుస్తూ అన్న కాళ్ళపై బడి)

ప్రభా:- అన్నా! నా తప్పులను క్షమించవా అన్నా!

విశ్వం:- (దూరంగా తోసి) ఛీ! నీచుడా! దూరంగావుండు. నే నెవర్నిరా, నిన్ను క్షమించడానికి. అందరికీ ఆ భగవంతుడు

న్నాడు, క్షమించడానికి. ఒక్కసారి నీ నిర్మల హృదయాన్ని విప్పుకొని పవిత్రాత్మతో ప్రార్థించు. ఏమైనా క్షమించగలిగితే ఆ మహనీయుడే క్షమించాలి, నీ దోషాలను.

ప్రభా:- ఇలా జరుగుతుందనుకోలేదు అన్నా!

విశ్వం:- ఔను! రక్త ప్రవాహంలో ఓలలాడదామనుకున్నావు. అశాంతి పరిస్థితులన్నీ రేపి దేశాన్ని అల్లకల్లోల పరుద్దామను కున్నావు. కాని - సాగలేదు. ఏంలాభం, యిప్పుడనుకొని? విఫలమయ్యాక యిలా కాక ఏమవుతుందిరా దుర్మార్గుడా?

ప్రభా:- ఏమిటో - ప్రజలకు కొంతసేవ చేద్దామనుకున్నా మన్నా!

విశ్వం:- ఛీ! నీ నీచపు పనికి ప్రజాసేవనే పేరుబెట్టి, నిజమైన ప్రజా సేవకులందరికీ అపఖ్యాతి కల్గింపకు ద్రోహీ!

ప్రభా:-ఈ ధనిక వాదులకు బుద్ధి చెపుదామని......

విశ్వం:-బుద్ధి చెప్పడమంటే ఘోర హత్యాకాండ సాగించడమా దుర్మార్గుడా? నిన్ను తుపాకితో కాల్చే వానిని చంపడం ధర్మం గాని ఏమీ చేతగాక, నిరాయుధులై, నిరాశ్రయులై ఎక్కడో మూలనున్న కొంపల్లో మూలుగుతున్న అమాయకులందర్నీ - తుపాకి లొట్టలున్నాయనే గర్వంతో పట్టి లాగి బలవంతంగా చంపడంకూడా ధర్మమే నంటావా నీచుడా? ఏం, ఇప్పుడు నిన్ను చంపితే దిక్కేమిటి? కాని, లాభం?

ప్రభా:- వాళ్ళ నిరంకుశత్వం అలా సాగుతుంటే చూస్తూ ఊరుకోవాలి సిందేనా అన్నా?

విశ్వం:- ఎందు కూరుకోవాలి? అరికట్టు. బీద ప్రజలందరినీ కూడ గొట్టి - ఒక్క త్రాటిపైనడుపు. నీవు కావాలంట్ను్న వ్యవస్థకై సక్రమాందోళన జరిపించు. ప్రజల్లో పలుకుబడి సంపాదించు.

ఓట్లల్లో నెగ్గు. ప్రభుత్వస్థాన మలంకరించు. నీ యిష మొచ్చిన వ్యవస్థను తెచ్చిపెట్టు. అంతే కాని వాళ్ళ నిరంకుశత్వమని వాగుతావెందుకూ ? ఆ మాటకొస్తే -.మీకూ కరడుగట్టిన ధనికులకూఎంతమాత్రంభేదంకన్పించడంలేదు. అయితే-వాళ్ళుచేసిన క్రూరకృత్యాలు దొరలనే హెూదా, దేవుడూ, కర్మ అనే సాకులతో బలవంతంగా చేశారు. ఇక మీరో- ప్రజా నాయకులు, ప్రజాసేవ, సంఘ పోషణ అనే ముసుగుతో చాటుగా మోసంచేసి కనరాని, వినరాని కిరాతక కృత్యాలన్నీ చే శా రు. అంతే తేడా. గట్టిగా మాట్లాడాల్సివస్తే - నీచత్వంలో వాళ్ళకంటే మీదే పై చెయ్యి. వాళ్ళింత క్రూరంగా ఎవర్నీ హింసించలేదు. మీరింత రాక్షసు లవుతారనుకోలేదు.

ప్రభా:- మేమంత రాక్షసుల మయ్యామా అన్నా ?

విశ్వం:- అంతకన్న మంచిపదం దొరకలేదు. కాకుంటే - యమకింకరులందాం. అయినా, వాళ్ళుకూడా సిసలైన పాపి యెవడో వారికే శిక్షలు విధించారు. కాని, మీ శిక్షలు బాబో! కాటికి కాళ్ళు చాచిన వానిమీదా, రాజకీయాలంటే తెలియని ఆడదాని మీదా, మీ పాలసీకి యిష్టపడని చదువుకున్న వాళ్ళమీదా, మీకు యిష్టంలేని మనుష్యుల మీదా; మీతో సహకరించని మానవులమీదా. ఇంకా మీరు రాక్షసులనడానికి ఏం నిరూపణ కావాలి ? ప్రజా కోర్టులూ! చిత్రగుప్తుడూ! శిక్షలు విధించడం! అయితే - వాళ్ళకూ, మీకూ తేడా యేమిటంటే- వాళ్ళకు కోరలున్నాయి; మీకు లేవు. అంతే తేడా .

ప్రభాకర్:-మమ్ములనంత నీచంగా పోలుస్తున్నావా అన్నా !

విశ్వం:- ప్రజల్లోకివెళ్ళి అడుగు - మీ నీచత్వమేమిటో! ఇంత యజమానులు మీ చేతుల్లో మరణించి బ్రతుకుతెరువులేక మొత్తుకునే అనాథల మొరలూ, కొంపలు తగులబడి నిలువ నీడ లేక అల్లాడుతున్న పేద కుటుంబాలగోడూ, దొక్కాడడానికి ఆస్కారంలేక పశువుల గోల్పోయి, అల్లాడుతున్న వ్యవసాయదార్ల ఆర్తనాదాలూ, అమ్ముకొని జీవించడానికైనా లేక ఆస్తులు గోల్పోయిన అమాయకుల ఆలాపనలూ, దళంలోచేరి కాల్పులకు గురియై జీతంతో పోషించుకునే బిడ్డలు పోయిన తల్లుల ఏడుపులూ, బంధుమిత్రులు మీ చేతుల్లో ప్రేమానుబంధాలు వీడుతున్నవారి తిప్పలూ, నోటిదాకా వచ్చిన పంటలు పాడైపోయి కృశిస్తున్న కర్షకుల దుఃఖాలూ, మీతో చేరినందుకు ప్రజల సానుభూతిని కోల్పోయి తలయెత్తుకొని తిరగలేని పరిస్థితిలో కుములుతున్నవారి హాహాకారాలూ, మీ వల్ల పవిత్ర కుటుంబాలన్నిటికీ అపఖ్యాతి గలిగి సందేహాలతో జీవిస్తున్న మీ కుటుంబ వ్యక్తులూ, మీ పొడగనబడితే - బాంబులు విసిరి చంపుతారని పరుగెత్తే పసిపిల్లల భయాలూ, మీరు కనపడితే యేం మోసం వస్తుందోననే అనుమానంతో ప్రాణాలు బిగబట్టుకొని జీవిస్తున్న మానవుల బ్రతుకులనూ, మీరేరాత్రివచ్చి ఏం మోసం చేస్తారోనని రాత్రింబవళ్ళు కాపలాలు కాస్తున్న గ్రామస్తుల బాధలూ, ఏ చప్పుడైనా మీరేమోనని అలికిడితో నిమిషమో యుగంగా భయంగా జీవిస్తున్న ప్రజల పరిస్థితులనూ - ఒక్కసారి హృదయాన్ని కేంద్రీకరించి ఆలోచిస్తే తెలుస్తుంది - మీ నీచత్వమేమిటో.

ప్రభా:-అన్నా! ఇంత ఘోరంగా విమర్శించడం...

విశ్వం:- అవును. మీ తప్పులను విమర్శించడమే తప్పంటావు. అంతేనా! పైగా మీ తప్పులను వొప్పుకునే ధైర్యంలేక, ఎదుటి వానిపైబడి ఏడపడం, అబద్ధాలాడడం అలవాటయి పోయింది. ఇంకా ఎందుకీ వాగుడు? చేసిన దోషాలను తెలుసుకొని, సిగ్గు పడే సాహసం లేక, ఎదుటి వానిపై ప్రజాద్రోహమనే నేరం మోపి, ప్రజాకోర్టులో తీర్పులివ్వడానికి చూస్తారంతేనా? అంత కంటే మీరు చేయగలిగిందేమిటిరా? ఏమయినగానీ-యీ కుంకాకులకు జడిసి ఎవరి పద్ధతులనూ విడనాడుకోరనితెల్సా?

ప్రభా :- అన్నా! చేస్తున్న పనికి అడ్డుగా.........

విశ్వం :- (చెంపపై లాగికొట్టి) ఇంకా తెలుకోలేక పోతున్నావా? చూడు—నీ దేశం వంక! మొన్నటిదాకా బ్రిటిష్ సామ్రాజ్య వాదులతో వందలకొలది సంవత్సరాలు క్రుంగి కృశించి పోయింది. ఎన్నో విప్లవ శక్తులు న్యాయసమ్మతంగా పోట్లాడి, త్యాగాలుచేసి, ప్రాణాల నర్పిస్తే ఈ రాజకీయ స్వాతంత్ర్యం వచ్చింది. దీన్ని దోపిడీగాండ్లు, అభివృద్ధి నిరోధకులు, మత తత్వ వాదులూ, స్వార్థపరులూ కాజేయాలని చూస్తున్నారు. అది వారి బారిపడకుండా వుండాలంటే ప్రజల్లో పనిచేసి, వారికి సరియైన బాటలుచూపి, వారి తరఫున సక్రమ మార్గా లతో ప్రభుత్వాన్ని చేపట్టాలి. దేశంలో ఆర్థిక, సాంఘిక సమత్వాన్ని నెలకొల్పాలి. అంతేకాని - యిప్పటికే సంస్థానాధీ శులతో, రజాకార్లతో పోరాడి అలసిపోయినవారిని తిరిగి అర్థం లేని కార్యక్రమాలకు పురికొల్పి వారిని అన్యాయంగా తుపా కులకు గురిచేయడం ధర్మమేనా? అదేనా - జీవిత పరమా వధి?

ప్రభా :- అన్నా ! మంచో, చెడో అయిపోయింది. నన్ను క్షమించు.

విశ్వం :- మీరెన్నడూ మంచి చేసెరుగరు. ప్రతిదీ సాగినన్నాళ్ళు మంచి; సాగనప్పుడు చెడు. ఇట్లా ఎన్నాళ్ళు యితరులను మోసగిస్తారు ?

ప్రభా :- ఇప్పుడర్థమైందన్నా—తప్పు చేశామనీ, పొరపడ్డామనీ. అబ్బా ! నన్ను తిట్టకన్నా. గాయంతో బాధపడుతున్నాను. ఆకలవుతున్నది. అన్నం పెట్టించవా - అన్నా !

విశ్వం :- (కరిగిపోయి నీరవుతాడు. కన్నీరు బొటబొటా కారుతుంది. నెమ్మదిగా లేపి దగ్గరికి తీసుకుంటూ) నీ పరిస్థితిచూస్తే కోపంతో పాటు జాలివేస్తున్నది ప్రభాకర్ ! నీవు నా తమ్ముడవే అయినా, నేను నీకు సహకరించే పరిస్థితి దాటిపోయింది ప్రభాకర్ ! (కౌగలించు కుంటాడు.)

ప్రభా :- (ఏడుస్తూ బహుదీనంగా) ఎలాగో నన్ను బ్రతికించుకోవా అన్నా ! మూడు రోజులనుండి అన్నం లేక. ఈ కడుపు కాలిపోతున్నది. అన్నా! శోషవస్తున్నది. (క్రింద పడబోతుంటే— విశ్వం తన భుజాలపై వేసుకొని, ప్రభాకర్‌పై తన వుత్తరీయం ముసుగు కప్పి లోనికితీసుకెడుతాడు..............
ఈ దృశ్యంవెనుకవున్న తెరలేస్తుంది వెనుక భాగం విశ్వం యిల్లు. జానకి - ఏదో పిండివిసురుతూ వుంటుంది.)

స్వామి :- అమ్మా ! ఏమిటే విసురుతున్నావు ?

జానకి :- పిండి.

స్వామి :- ఎందుకే ? అప్పచ్చులు చేస్తావా ? తొందరగా చెయ్యవే.

జానకి :- పిండైతె విసరాలా ? వద్దా ?

స్వామి :- అబ్బ ! ఎంత సేపమ్మ.

జానకి :- నీకేం. వండిపెడ్తే తింటావు. కష్టమంటే నీకేం తెల్సు?

స్వామి :- అయితే - నేనూ విసురుతా లే (స్వామి కూడా విసురు తుంటాడు. లింగన్న అప్పుడే భోంచేసి లోపల్నుండి వస్తాడు.)

జానకి ;- ఏం లింగన్నా ! భోంచేశావా ?

లింగ :- బోజనమ్మా! ఇంగజూడూ, పొట్టబగిలి పోతాంటు నేవోఁ.

జానకి :- చాల్లెగాని, అన్నిటి మీద మూతలు బెట్టావా ?

లింగ :- ఓ, బల్ పకడ్‌బంద్ జేసొచ్చినగని యిదేంది! సావిఁ గూడిసురుతాండూ ?

జానకి:- నేను వద్దంటే వినడు చూడూ !

లింగ:- సావీఁ ! నువ్వొందు కయూ, సదువు కున్నోడవు లే.

స్వామి :- ఆఁ! నే లేవను.

లింగ :- అట్టగాదు సావీఁ ! సువ్విసిర్తె, అలిస్యమైఁద్ది. జల్ది అవ్వలు గావుమరి. ఏదీ, నువ్వు లేసి పాటలు జదువుతాండు. నే నిసు రుకుంట యింటాంట. నువ్వులే అక్కా ! (జానకి లేస్తుంది. లింగన్న విసరడానికి కూర్చుంటాడు.)

స్వామి :- నాకు చేతగాదంటరిగా.

లింగ: -అమ్మో! నీకు సేతగాదని వోరంటరు గని లే. (స్వామి అక్క డ్నుంచి లేస్తాడు. (ఇంతలో విశ్వం ముసుగు గప్పిన ప్రభా కరాన్ని భుజాలపై వేసుకొని వస్తాడు. అంతా ఆశ్చర్య పోతారు.)

స్వామి :- ఏమిటి నాన్నా ! ఎవరు ?

జానకి :- ఎవరండీ ?

లింగ :- ఓరన్నా ?

విశ్వం :- ఒక భిక్షుకుడు.

స్వామి :- మరిదేమిటి నాన్నా ?

విశ్వం: - రాయి తగిలి పడిపోయి గాయపడ్డాడు పాపం!
జానకి :- గుడ్డివాడా ?
విశ్వం :- అవును; కళ్ళు కనపడడం లేదు.
స్వామి :-మందుతేనా నాన్నా? (లోనికెళ్ళ బోతాడు.)
విశ్వం :- వద్దు వద్దు. పాపం! మూడురోజులనుండి అన్నం లేక శోష వచ్చి పడిపోతే ఎత్తుకొచ్చాను. ముందితనికి అన్నం పెట్టాలి.
జానకి:- తెస్తానుండండి. (లోనికి వెళ్ళిబోతుంది.)
విశ్వం :- వద్దు జానకీ! వద్దు; లోనికే తీసుకెడదాం.
లింగ :- మరెందుకే సంకోచం అన్నా! (ముసుగు తీస్తాడు. తటాలున ప్రభాకర్ ప్రత్యక్షం) బిచ్చగాడూ! పెబాకరయ్య గదా!
స్వామి :- ఆఁ! నాన్నా! నీ వేం పని చేస్తున్నావో గుర్తుందా?
జానకి :- ఏమండీ, యీ కాస్తకూడా బ్రతుక నివ్వదలుచుకో లేదా యేమిటి?
విశ్వం :- తప్పయిందని పశ్చాత్తాప పడుతుంటే.........
స్వామి :- పశ్చాత్తాపం! ఇదొకటి చులకనగా దొరికింది, ప్రతివానికీ. దయాదాక్షిణ్యాలు లేకుండా - కనరాని, వినరాని కిరాతక కృత్యాలు చేయడమూ, చేసిన పాపాలన్ని నశించాలని పశ్చాత్తాప పడడమూ! ఆ మాత్రం తేలిక పని నేనూ చేస్తానునాన్నా.
విశ్వం :- అలా కాదు స్వామీ! హృదయ పూర్వకంగా పశ్చాత్తాప పడుతున్నాడు.
జానకి:- హృదయమూ, మనస్సూ అనే పవిత్ర వస్తువులకు నీచాన్నాపాదిస్తున్నారు. హృదయ మంటూ వుండబట్టేనా, ఇన్ని దుష్కృత్యాలు?
విశ్వం :- జరిగిపోయిన వాటని మళ్ళీ రెచ్చగొడతా వెందుకు జానకీ?

లింగన్న :- సేసిన వోటన్నిటికి పాపం లేదానె అన్నా ?

విశ్వం :- హృదయ పూర్వకంగా పశ్చాత్తాపపడి సత్క్రమ పంథా కొస్తా సన్నాక భగవంతుడైనా క్షమించక పోడు.

స్వామి :- మంచి చెడ్డలన్నీ ఆ భగవంతునికి వదలక మధ్య నీ కెందుకీ శ్రమ?

విశ్వం :- మానవుడూ, తోటి సోదరుడూ, మన కుటుంబీకుడూ స్వయంగా తమ్ముడు - బాధపడుతుంటే చూస్తూ ఊరు కోవడం......

జానకి :- బాధ ! బాధ ! ఓ అని మొత్తుకుంటున్న తండ్రిని హింసించినప్పుడూ, న్యాయాన్ని కోరిన తల్లిని కాల్చినప్పుడూ ఈబాధ ఎటు పోయిందేం పాపం !

విశ్వం :- ఎదుటి వాని బాధలు తెలిస్తే అలా చేస్తాడా జానకి !

లింగన్న :- అన్నా ! తెల్చి సేసినా, తెల్వక సేసినా తప్పు తప్పేగదే అన్నా ! నీకు తెలివందేవుండదె ?

విశ్వం :- కావచ్చు. వాడి పాపాలకు వాడే శిక్ష ననుభవిస్తాడు. కాని - మానవుల మైనందుకు మన తోటివాడు బాధపడుతుంటే సహ కరించడం మన విధి.

స్వామి :- నాన్నా ! త్రాచుకు పాలు పోస్తానంటున్నావా ?

విశ్వం :- త్రాచో తేలో మన యింట్లో పుట్టాడు; మన కుటుంబికుడు, వానికి మనతో పాటు జీవించే హక్కుంది.

జానకి :- మామనూ, అత్తనూ చంపి కొంపను తగుల బెట్టిన నాడే ఆ హక్కుపోయింది.

విశ్వం :- అలాగని - వీనికీ లోకంలో నిలువ నీడే లేదా జానకీ ! ఇక, మనమే ఆదరించకుంటే - యింకా యెక్కడికెళ్ళుతాడు ?

లింగ:- యాడికా? పెజలకాడికి పొమ్మను.

విశ్వం:- ఆ సహకారం లేకపొబట్టే ఈ అవస్థ.

స్వామి :- మరి, మనమేం చేస్తాం నాన్నా?

విశ్వం :- ఇంట్లో వుంచుకోవాలి; ఆదరించాలి. మనం అనుభవించే హక్కే వాడూ అనుభవిస్తాడు.

జానకి:- మీకిదేం పిచ్చండీ?—సరే! అంత ప్రేమ వుంటే - మీరే యీ యింట్లో వుండండి. మేమే వెళ్ళిపోతాం. రా స్వామీరా! మనం వెళ్ళిపోదాం.

స్వామి :- ఎక్కడి కెడతామమ్మా, ఒకరికి జడిసి? ఇంకో చోట మనను మాత్రం దిక్కెవ్వరు? ఉండు! ఏ పాటలోనికి వస్తాడో చూద్దాం. (గడపకడ్డంగా నిలుచుంటాడు. విశ్వంలోనికి వెళ్ళబోతూంటే) నాన్నా! ఆగు! అక్కడే ఆగు! నీకూ తమ్మునితో జీవించాలని బుద్ధుంటె వెళ్లు! ఆయనతో పాటు వెళ్ళి దళంలో పనిచెయ్యి! కౌగలించుకో! నెత్తినెక్కించుకొని ఊరేగు! అంతేగాని, యీ యింట్లోకి మాత్రం అతన్ని తీసుకొని రావడానికి వీల్లేదు. జాగ్రత్త! ని హక్కులుగూడా పోతాయి. తండ్రివైతే తర్వాత చూద్దాంగాని ఇదేనా ని ధర్మం? నీ వెక్కనికి ప్రేమ వుందని ఒక దుర్మార్గుని, నీచుని యింట్లో తెచ్చిపెట్టి మమ్ముల సంపర్క హత్యలను గురి చేద్దామనుకున్నావా నాన్నా! ఇదేనా రోజూ నీవు నాకు నేర్పే నీతి? ఈ గూండాలందర్నీ ప్రభుత్వాని కప్పగించాలని చెప్పి, యిదా నీవు చేసేపని? మేమంతాబ్రతకాలనివుంటే అతన్నిప్రభుత్వాని కప్పగించి నీవు ఇంటకి రానాన్నా! వాళ్ళే శిక్షిస్తారు; వాళ్ళే క్షమిస్తారు. ఆ బాధ్యత వాళ్ళది; ఆ న్యాయాన్యాయాలు వాళ్ళవి:

ప్రభుత్వ విధానాలు అన్ని మనకు నచ్చినా నచ్చకున్నా చట్టాలను మనం అర్థం లేకుండా వుల్లంఘించడం ధర్మం కాదు. మనం పౌరులం; మనం మన విధులను గుర్తిస్తేనే స్వాతంత్రం నిలుస్తుంది; దేశం బాగుపడుతుంది. ఇది నీకు తెలియంది కాదు నాన్నా! విను!

విశ్వం:- అలా కాదు స్వామీ! ముందితనికి అన్నంపెట్టి శోష తీర్చనీ; మన భారతదేశ గౌరవ ప్రతిష్టలను నిలుపనీ స్వామీ!

స్వామి:- దుర్మార్గుల నాదరించుటేనా, భారతీయుల పరువు ప్రతిష్టలు! సరే - నా విధులను నేనూ నిర్వర్తిస్తాను. అమ్మా! వెడదాం రావే!

విశ్వం:- నీవూ వెళ్ళుతావా జానకీ! ముందితనికి అన్నం పెట్టాలి. లోపలికి రా! (జానకి, విశ్వం, ప్రభాకర్‌లు లోనికి వెళ్ళిపోతారు. స్వామి బయటికి వెడతాడు)

లింగ :- సిన్నపంతులు ; మా సిసింద్రీ అనుకోరి. (అతపక్కడి విసుర్రాయీ, అదీ తీసి లోపల పెడ్తుండగా కొందరు ప్రజలు కర్రలతో వస్తారు)

ఒకడు :- ఏందిర లింగా! పెబాకరంగారొచ్చింటంట గదరా!

లింగ :- ఒచ్చిండులే . బువ్వ దింటాండు.

మరొకడు:- మా కొట్టందగల బెట్టి మల్లొచ్చినాడు ?

ఒకడు :- మా వోల్లందర్ని సాపసూకి ఏం మొకంబెట్టుకోనొచ్చిండు ?

లింగ:-ఎవో మా దెబ్బలు తగిలినట్టుందది; ఊకోరి.

ఒకడు:-ఊకోవాల్నేం ? మా కడుపు మండటంలె. డాక్టర్ గారెట్ల రానిచ్చిన్రు ?

లింగ:- ఎట్టనైన పేమ గదే !

ఇంకొకడు :- పేమంట, పేమ! అయ్యను, అమ్మను జంపుకున్న నాడెటు బోయింది ?

లింగ:- ఏదో అయిపాయె.

మరొకడు:- అయిపోయిందేం ? రానియ్యి - అని పని జెపుతం.

లింగ:- అదేందిరో—కొత్తరా ఏంకత ?

ఒకడు:- కొట్టుడేంది ! నరకవేఁ.

లింగ:- ధసెపో ! జరాగురి.

(విశ్వం—నెమ్మదిగా ప్రభాకరాన్ని తీసుకొని రంగమ్మీది కొస్తాడు. ప్రజలు—ప్రభాకరాన్ని కొట్టబోతే విశ్వం అడ్డుపడ్తాడు. ఆ దెబ్బలు విశ్వాని క్కూడా తగులుతాయి. రక్తం కారుతుంది. ఇద్దరూ పడిపోతారు. లింగన్న కలుగ జేసుకొని)

లింగ:- ఏందిర అన్నాలంగ అయ్యగార్ని గొడ్తిరి ?

ప్రజలు:- మీకు దగుల్తదనుకో లేదుండీ ! (సిగ్గుపడి వెళ్ళిపోతారు. లింగన్న వెళ్ళి తలుపు పెట్టివచ్చి మంచం వేసి వారిద్దర్నీ వాటిపై పడుకో బెడ్తాడు. జానకి విశ్వం గాయానికి కట్టుగడు తుంది. విశ్వం నెమ్మదిగా లేచి ప్రభాకర్‌కు కట్టుగడ్తాడు. ప్రభాకర్ కళ్ళు తెరుస్తాడు. అన్న తలకు కట్టు వుంటుంది.)

ప్రభా:- (లేస్తూ) అన్నా ! నా కోసం నీవు దెబ్బలు తిన్నావా అన్నా !

విశ్వం:- లేవకు బాబూ ! విశ్రాంతి తీసుకో తమ్ముడూ !

ప్రభా:- (దుఃఖిస్తూ) విశ్రాంతి! ఎక్కడ తీసుంటానన్నా విశ్రాంతి?... నా యిల్లు కాదిది.. నా యిల్లును తగుల బెట్టాను...ఈ పూరి పాకలో వుంటున్నావా అన్నా ! అబ్బ ! ఎన్నిబాధలు పడు తున్నావు !...నాన్నను చంపించాను...అమ్మను చంపాను... అబ్బా ! ఏమైందా వుద్రేకం ? ఎటు పోయిందా ఆవేశం?...

ప్రజల అండ లేకుండా విప్లవాలు నెగ్గవు......ఎందర్ని చం పుతాం ?...పదులా - వందలా - వేలా ? కోట్లు!...లాభం లేదు, సాధ్యపడదు......అన్నా! పోరాటం విఫలమైంది; ఓడిపొయ్యాం. ఇలా అవుతుందనుకోలేదు... అంచనా అంతా తప్పుడై పోయింది. అబ్బా! బాధ.

స్వామి :- (బయటినుండి తలుపు కొడుతూ) నాన్నా! నాన్నా!

జానకి:- స్వామి, పోలీసుల వెంటబెట్టుకొని వచ్చినట్టుందండీ.

విశ్వం:- తలుపు తీయక తప్పదు జానకీ! (అని తమ్ముని దగ్గరి నుంచి తలుపు తీయడానికి లేచి వెళ్ళేసరికి ప్రభాకర్ నిక్కర్ జేబునుండి పిస్తల్ తీసి పేల్చుకుంటాడు. అంతా అటు మళ్ళు తారు. విశ్వం "తమ్ముడూ!" అని మీద పడ్తాడు. సబినస్పె క్టరూ, స్వామీ వచ్చి దిగాలుపడి నిలుచునే సరికి గబగబా తెర.)

## అంకితం

తప్పుడు ఆలోచనల ఫలితాలను
చూడనోచుకోలేని తోటి మానవాళికి

'తెలుగు స్వతంత్ర'లో ప్రచురితమైన
'భవదీయు'ని లేఖల సంపుటి

# తెలంగాణా తీరుతెన్నులు

వెల : రూపాయి

కావలసినవారు :— **జనపద ప్రచురణలు,**

**A–18/452,** చిక్కడపల్లి, హైద్రాబాదు

---

(పత్రికల, ప్రముఖుల అభిప్రాయాలు)

## A BOOK OF THE TIME

---

## *Trends in Telangana*

---

Volumes have been written and said about the Communist atrocities in Telangana; little is said about the police excesses on the innocent people and nothing about the real causes for the failure of the authorities to bring back peace and order in those disturbed areas. The credit now goes to *Bhavadeeyudu* who, by his brilliant exposition of the actual state of affairs has done a singular service to the people of this State, through his book in Telugu.

## II

Never before was the satanic philosophy of murder and loot of the Telangana Communists more strongly assailed, the excesses committed by the police and military on the innocent masses better brought to public attention and the woeful failure of the leaders to come to the rescue of the distressed people, more skilfully exposed than now by *Bhavadeeyudu* in his book, the contents of which have already appeared recently in the *Telugu Swatantra* of Madras.

People have often been blamed and quite uncharitably too, for their non-co-operation with the authorities in curbing the Communist menace. But the writer who seems to possess a good amount of political acumen argues that the people's co-operation was there always, but it was the Government which did not extend its co-operation to the people. There was not a single instance where people have refused to pay taxes to the authorities, the recognised form of non-co-operation. People have not forgotten the leaders. On the other hand it was the leaders, who having once got to the top of the ladder of popularity despised the rungs that helped them to build up a career. That i why the Government's policy of supplying arms to the villagers to resist the Communist attacks has failed. The response to this policy was not at all encouraging because there were some among the people who still believed in the good intentions of the Communists,

others were cynical of the advantages that would acrue to them if they co-operate with the authorities and others, never bothered themselves with what was happening under their very nose. But this, however should not be construed that the people were on the side of the Communists A large majority of them had nothing to lose; if they were afraid of their lives they moved on to safer zones.

The main reason for this indifferent attitude of the people, the writer says was that no efforts were made by the leaders to better the lot of the villagers; leaders have not come forward to champion the cause of the villagers when they were harassed by the Communists on one side and the Police on the other. Leaders, ever since Police Action, engaged themselves in the art of grabbing power for themselves and had little time to think of the people and their problems thus unconsciously throwing the people into a slough of despair and despondency.

The writer contends that the authorities would have succeeded in curbing the Communist menace if arms were given to such of those who had fallen victims at the hands of the Communists, because the victims had a special interest to fight the Communists. These persons could have been absorbed in the State police itself thus minimising the costs of operation. Even certain elements in the police force whose loyal-

ties to the State were of a doubtful nature, could have been replaced by these patriotic elements. Further the writer says that the authorities should have employed the same technique which was adopted by the Communists for winning over the people to their side in the last few years.

There is another feature which played no mean part in the failure of the authorities in Telangana and that is the excesses committed by the police and military on innocent villagers which unfortunately were never brought to public attention. Police who should have behaved like teachers in a school were too egoistic and self-centred to realise the difference between human beings and mere chattels. There were innumerable instances where the police behaved worse than beasts in a jungle against innocent women and men Further in order to cover up their follies and failure. the police are alleged to have extracted statements from the villagers to the effect that peace was established in various regions while the fact was otherwise. The writer believed that if a leader of the stature of Pandit Nehru were to undertake a short tour of the affected areas it would have created more confidence among the people and better atmosphere.

In the last chapter the writer foresees only three alternatives in which the persent policy of the Communists might end (1) they might succeed if present

circumstances change in their favour, (2) being vexed of killing and killing they might, like Asoka, turn non-violent (3) or seeing no prospects of pushing through their programme they might lose heart.

The writer deserves high commendation for presenting the real picture of the Telangana in a most convincing manner. I wonder if he has taken cover under a pseudonym for security reasons. The technique adopted—the letter form—is the best media for a forceful representation of facts, which is unique in Tulugu literature.

This is a book everyone should read Communist, to know what havoc his philosophy of destruction has wrought on peace-loving villagers, a Congressman to realise how he has failed the people in times of need and the authorities charged with the task of establishing law and order in those regions, to know what excesses in the name of fighting the Communists were committed on innocent masses.

*—Romero in "The Deccan Chronicle"*

## "THE HYDERABAD BULLETIN"

This is what can be described as the Book of the Day. One who knows "Red Telanganaism" inside out, assumed a pen-name 'Bhavadiyadu' meaning 'Yours' and produced this booklet for the express purpose of telling the truth, the whole truth and nothing but

the truth, as he has grasped it, in a very dispassionate manner, about the matter, to one and all.

In short, it is a plea for return of sanity in human affairs. In a sense, it is a regular paraphrasing of the massage of Acharya Vinoba delivered daily, at this moment, to the people, Government and the hot-headed Reds too.

## "INDIAN EXPRESS"

Letter writing is not a familiar art with Telugu scholars. The style in this branch of art tends to be simple and direct, as one is addressing somebody though not in person. The present author has attempted to write letters to his friend, giving his views on various problems connected with the Telangana districts of Hyderabad. History and politics are brought in and the present condition of the country and people is explained. Simplicity is one of the most commendable features of this book. —N. R.

## "STRUGGLE"

This is a collection of articles which appeared in SWATANTRA (Telugu. Madras The author, who has scrupulously avoided his identity being known, deserves praise for throwing light on the real problems facing Telangana.

Eventhough one may not entirely agree with the solution he has shown in the booklet, it must be admitted that the suggestions given by the author would have been attempted at by the government had it acted a little bit cautiously and sagaciously.

The booklet is in the form of letters which are obviously convincing and piercing. This is one of the books that need to be studied by all those who want to understand the truth of the Telangana problem.

—*V. G. S.*

---

## 'గోలకొండ'

తెలంగాణా భూసమస్యా పరిష్కారానికై కమ్యూనిస్టులు అవలంబించిన సాయుధ పోరాటం ఎలాటి పరిణామాలకు దారితీసి నానాభత్త్యాన్ని సృష్టించినదో లేఖలరూపంలో యిందు వివరింపబడినది. రచయిత తెలంగాణా పరిస్థితులను లేఖలద్వారా కండ్లకుకట్టినట్లు చిత్రించారు. పుస్తకం చదవ మొదలు పెడితే పూర్తి చేసేందుకు చదువరులను వదలనివ్వదు.

ఈ లేఖలవల్ల తెలంగాణాను కలవరపెడుతున్న సమస్యలను, పరిస్థితులను వ్యక్తం చేయుటమే రచయిత ప్రధానోద్దేశంగా కాన్పిస్తున్నది. పాఠకులకు ఒక దారిని నిర్దేశించి దాన్ని అనుసరించమని ఆదేశించేకన్నా స్థితిగతులను యథాతథంగా వివరించి పరిష్కార మార్గాన్ని వారినే చూచుకొనమని వదిలివేయుటంగూడా సరియైనదేనని మా అభిప్రాయం.

మనకు కొద్దిగా గల లేఖా సాహిత్యంలో 'తెలంగాణా తీరుతెన్నులు' ఉత్తమ శ్రేణికి చెందినది. తెలంగాణాను సరిగా అవగాహన చేసుకోదలచిన ప్రతి ఒక్కరూ దీనిని చదువవలసిన అవసరం కలదు.

# VIII

## "జనశక్తి"

తెలంగాణా వాస్తవిక పరిస్థితిని చూడలేక కార్చిన కన్నీటి చుక్కలు భవదీయుని లేఖలు. 'సోదరుడు' రామారావు, అతని అనుచరులు సిద్ధాంతాల పేర సాగించిన ఘోర హింసాకాండ, అమాయక జీవుల మారణహోమం ఇతి వృత్తం.

గమ్యమేదో తెలుసుకోకుండానే పురోగమిస్తున్నామనుకొనే 'అభ్యుదయ వాదుల' కరుడుతత్వాన్ని శుద్ధ అవివేకంగా నిరూపించి, ఈ అంధకారంలో పార పాటుపడి, తాను గాఢంగా విశ్వసిస్తున్న జాతీయ నాయకత్వాన్ని ఎక్కడ విస్మరిస్తారోయని ఆవేదన పడతాడు 'భవదీయుడు'.

ఒక రకం సిద్ధాంతవాదులు తమ సిద్ధాంతాల ప్రాబల్యానికై ఇతరుల ప్రాణాలను తృణప్రాయాలుగా ఎంచడాన్ని తీవ్రంగా గర్హిస్తాడు. అంతగా ప్రాణాలుతీసే సరదా గనక ఉంటే ముందు ప్రాణాలుపోసే యంత్రాన్నొక దానిని కనిపెట్టి తర్వాత ఆ పని చేయండని మాంచి విసురు విసుర్తాడు.

గమ్యాన్ని చేరాలంటే తోటి ప్రయాణీకుల హృదయాల నర్థం చేసుకొని ప్రగమించమని ప్రబోధిస్తాడు,

అవసరమైనపుడు అష్టకష్టాలుపడి లోకపు సానుభూతి సంపాదించి బ్రహ్మాండమైన మార్పులను సాధించడం రచయిత సూచిస్తున్న మార్గం.

రచనలో చాలా చోట్ల అహింసా విధాన ప్రబోధము, ప్రేమార్ద్ర హృదయ పరితప్తత కనపడ్డా రచయిత నూటికి నూరు పాళ్ళు అహింసావాది కాడేమోనన్న సందేహం కలుగుతుంది! అయితే విప్లవ సిద్ధి ప్రజల హృదయపూర్వక సహకారంవల్ల కావాలని రచయిత ఆకాంక్ష.

అర్థంలేని సిద్ధాంతాల మైకంలో మైమరచి చిందులు తొక్కే రామారావును పడిపోకుండా పట్టుకోవాలని రచయిత పడే తాపత్రయాన్నిచూస్తే - రెండు పరస్పర విరుద్ధ భావాలు గల హృదయాల మధ్య తెగిపోయినట్టు అగుపడుతున్న ప్రేమానుబంధానికి పురివేస్తున్నాడా అనిపిస్తుంది.

భవదీయుడు విప్లవవిరోధికాడు. నిరాశావాది కాడు. అతడొక మార్గాన్వేషి. సంఘంలోని కుళ్ళునుచూచి అతని హృదయం తరుక్కుపోతుంది. మార్గదర్శకత్వంవహించే పరిస్థితిలో లేనంటూనే సరియైన మార్గాన్ని కనుక్కోగలిగినాడు.

కృత్రిమ 'కంచుకోట'ను మానవత్వపు బలంతో ఛేదించడంలో భవదీయుడు కృతకృత్యుడైనాడనొచ్చు.

యువరచయితలకు భవదీయునిభావవాహినీ తీరుతెన్నులు ఆదరణీయాలు, అనుసరణీయాలు.

—రఘువీర్.

# IX

## 'ప్రగతి'

తెలంగాణాలో (ముఖ్యంగా రెండుజిల్లాలలో) తీరు, తెన్ను లేకుండాపోయి చాలా కాలమైనది. ఇందుకు కారణం తెలంగాణీయమనే రాజకీయ పంథా.

దాని విస్తరణ, విపులీకరణం ఈ గ్రంథం. దీనిని లేఖల ద్వారా మనకు అందించినందువల్ల విసుగు లేకుండా, శ్రద్ధతో మనం చదవడానికి వీలు కలుగుతున్నది.

ఇందులోని ఒక్కొక్క లేఖ జీవితపు లోతుపాతుల్ని మనచేత వెతికిస్తుంది. ఏ భాగం చదివినా, హృదయం ద్రవించి పోతుంది.

'భవదీయుడు' రచన జీవనంగా పెట్టుకున్నాడో లేదో తెలియదు గాని, సానబెట్టిన రచనలోవలెనే ఇందులోని శైలి హాయిగా, పదజాలం సరళంగా వున్నది.

తెలంగాణీయపు దుష్ఫలితాన్ని కండ్లకు కట్టినట్లు రచయిత చిత్రించాడు.

'సూరి చేసిన నేరం' క్రూరమైన దమననీతిని ఖండించడానికి అంతకంటె ఎక్కువ ప్రస్ఫుటమైన రీతిగలదా ?

తెలంగాణీయంవల్ల ఆ పంథా ననుసరించిన వారికీ, ప్రజకూ వల్లకాడే ప్రాప్తమయినది. ఇంతటనైనా, ఆ ప్రజకు విముక్తి కలిగించవలసిందని ఇతర రాజకీయ వాదులను, నేతలకు 'భవదీయుడు' విజ్ఞప్తి చేసుకుంటున్నాడు.

ప్రజల బాధలను భరించలేని మహా వ్యథతో రచయిత కలం సాగించాడు.

బుద్ధిమంతులైన వారు తెలంగాణీయపు తప్పును తెలుసుకుంటే ఇంతటనైనా వ్యవహారం నవరింపు కాగలదు. కాని ఈ నాటికీ అనేక మంది విద్యార్థులకు వాస్తవిక పరిస్థితి తెలియక, తెలంగాణీయపు స్తుతిలో మునిగి తేలుతున్నారు. అట్టివారికి ఈ గ్రంథం కనువిప్పు కాగలదు.

తెలంగాణానికి తిరిగి తీరూ, తెన్నూ రావలెనంటే, తెలంగాణీయం అంతం కావలెను. ఈ అవసరాన్ని తెల్పడమే ఈ పుస్తకం విధి.

—చుండి జగన్నాథం

# X

## ‘సంఘం’

“తెలంగాణా తీరుతెన్నులు” అనే శీర్షిక ఆంధ్రప్రదేశానికి చిరపరిచితం. ‘భవదీయుడు’ తెలుగు స్వతంత్రలో తెలంగాణాలోని సాయుధ పోరాటం గురించి తన దృష్టితో సహేతుకంగా, సవివరంగా వ్రాసిన లేఖల సంకలనం. నేడది పుస్తక రూపం దాల్చింది.

ప్రస్తావికలో నారాయణరావుగారు అన్నట్లు తెలుగులో లేఖా సాహిత్యము తక్కువ. అట్టి విధానాన్నవలంబించిన ఈ యువరచయిత పాఠకులకు దగ్గరగా ఉంటారు.

ఇందులో తెలంగాణాలో కమ్యూనిస్టుల హింసావిధానాన్ని, దాన్ని అరికట్టలేని ప్రభుత్వ అసమర్థతను ఖండిస్తారు.

ప్రభుత్వ విషయంలో ప్రభుత్వ సహకారమే ప్రజలకు దొరకడం లేదని ఖాయం చేస్తారు...............

ఇందు పరిష్కార మార్గం చూపడం కాక, పరిస్థితులను తెలుపుటే రచయిత ఉద్దేశ్యమన్నారు ప్రస్తావకులు.

‘తెలంగాణా తీరుతెన్నులు‘ ఒకవైపు నుంచి అమితమైన ఆవేదనను కనపరుస్తుంది. సందేహం లేదు.........

—లవణం

## “ములుకోల”

తెలంగాణాలో కమ్యూనిస్టులు అనుసరిస్తున్న హింసా విధానం యెంత నిర్హేతుకమో, అనాలోచితమో, అవివేకపూరితమో, అ...వాయుకమో యీలేఖల సంపుటిలో రచయిత మధురమైన భాషలో చక్కగా ఉల్లేఖించాడు. ఉదాహరణకు “మానసికత లేని భౌతికతగాని, భౌతికతలేని మానసికతగాని రెండూ సంఘాన్ని పాడుచేస్తాయి. అందరిని సుఖపెడుతున్నామని కబుర్లుచెప్తూ తోటి వారిని బానిసలుగాచూచే ధనికత్వంగాని అవేమాటలతో తోటివారిని హత్యలుచేసే పశుత్వంగాని యేదీ మానవ సంఘానికి సౌఖ్యాన్ని చేకూర్చలేదు” అనే వివరణలో వాస్తవికత తొణికిసలాడుతుంది.

హింసాచర్యలలో పాల్గొంటున్న సోదరుడు రామారావును రచయిత గుక్క తిప్పుకోటానికి వీలులేనంత బలీయమైన హేతు వివరణతో లేఖాపూర్వకమైన హితబోధ చేస్తాడు. ఈ గ్రంథం అభ్యుదయ కాములైన అందరూ - అందు ముఖ్యంగా దౌర్జన్యవాదులైన కమ్యూనిస్టులు చదువదగినది.

## XI

# 'సంస్కారి'

కమ్యూనిస్టుల సాయుధ పోరాటంవల్లా - ప్రభుత్వ హింసాకాండవల్లా తిరుగలిలో గింజలవలె ప్రజలు నలిగిపోతున్నారనీ, విప్లవం పేరుతో విప్లవవాదులు అమాయక ప్రజలను చంపుతున్నారని చూపడం, ఈ పుస్తకం యొక్క ముఖ్య ఆశయం....

రచయితకలం మంచి పదునైనది. చెప్పదలచుకొన్న విషయాన్ని హృదయానికి సూటిగా తగిలేటట్లు చెప్పగల నేర్పుఉన్నది. రాజకీయాలను లేఖా రూపంగా తెలుపడానికి ప్రయత్నించి రచయిత కృతకృత్యుడయ్యాడు. అందుకు అభినందనీయుడు...

—ఎమ్. ఆర్.

## శ్రీ శ్రీరామ కవచం సత్యనారాయణగారు

తెలంగాణా తీరు తెన్నులు, ఒక జీవిత పరిశీలన - దేశంయొక్క వాస్తవ పరిస్థితుల చిత్రణతో సమాజిక మానసికావస్థలను ప్రతిబింబిస్తూ వున్నది. ఇదే నా అభిప్రాయం. యీ అభిప్రాయాన్నే చదివిన ప్రతివారూ వెలిబుచ్చారు.

పుస్తకం చివరపేజీ మూసి, ఆలోచిస్తే అంతా అయోమయంగా వున్నట్లు వుంటుంది. పరిస్థితుల చిత్రణ, సినిమాల్లోని దృశ్యాల్లాగా నడిచి పోయాయి. సినిమా చూసి బయటకువచ్చిన తర్వాత కలిగే మైకంలాంటి మైమరపు, పుస్తకం చివరపేజీ మూసి ఆలోచించినప్పుడు కలుగుతుంది. ఇంతా చదివింతర్వాత ఏమిటి చేయవలెను? అనే ప్రశ్నకు జవాబు దొరకటంలేదు. యీ విపరీత విషపూరిత వాతావరణాన్నుంచి విముక్తిపొందటానికి మార్గం ఏమిటో స్పష్టీకరించబడలేదు. అదిగూడా చివర రెండువుత్తరాల్లో చేరిస్తే బాగుండేది.

## శ్రీ ఇంటూరి వెంకటేశ్వర్రావుగారు

లేఖా సాహిత్య రచనలో కలాన్ని మీరు మనోజ్ఞంగా నడిపారని నేను నా అభిప్రాయాన్ని వెల్లడించక తప్పదు. తెలంగాణా కమ్యూనిస్టుల నగ్న స్వరూపాన్ని మీ లేఖా సాహిత్యంలో మీరు చక్కగా చిత్రించ గలిగారు. ఈ లేఖా సాహిత్యంలో మీరుపయోగించిన భాషయొక్క సరళిగూడా నిర్దుష్టంగా ఉందనే చెప్పొచ్చు. లేఖా సాహిత్య రచనలోనే యికముందు గూడా మీ కలాన్ని నడిపి ప్రత్యేకత మీరు సంపాదించుకోవాలని నా కోరిక.

## 'సుజాత'

ఇవి మొన్నటి వరకు తెలుగు స్వతంత్రలో ప్రకటింపబడిన లేఖలు. వాటిని గ్రంథ రూపముగా ప్రకటించినారు జనపద ప్రచురణ మండలివారు.

రచయిత సుప్రసిద్ధ లేఖకుడు. రాజకీయములను క్షుణ్ణముగా ఎరిగిన సహృదయుడు. సంభాషణలను సహజముగ సరళమయిన శైలిలో నడపుట యందు ఈయన అందెవేసిన చేయి. ఉత్తమ నాటక రచయితగా పేరుకెక్కినవాడు.

ఈ లేఖలు పోలీసు చర్యల తరువాతి తెలంగాణా సత్యస్వరూపమును సంపూర్ణముగ చిత్రించుచున్నవి. వెనుకబడియున్న రాష్ట్రేతరులును, తమ దైన్యావస్థలను తెలుసుకొన దలచుకొన్న రాష్ట్రీయులును విధిగా చదువవలసిన గ్రంథము. అభివృద్ధి చెందుచున్న తెలంగాణా వాఙ్మయమున ఉత్తమ లేఖా సాహిత్యము లేని కొరతను ఈ చిన్న పొత్తము దీర్చగలదు.

విపరీత పరిస్థితులకు లోనైన నల్లగొండ వరంగల్లు జిల్లాలను గూర్చి విచిత్రముగ ప్రవర్తించుచున్న ప్రభుత్వము ఈ గ్రంథమును సాంతముగ చదివినచో తన కర్తవ్యమును నిర్ణయించుకొనగలదని గట్టిగ చెప్పవచ్చును. ఈ యువ రచయిత లేఖినినుండి ఉత్తమ వాఙ్మయము వెలువడగలదని లోక మెదురు చూచుచున్నది.

## "ఆంధ్రపత్రిక"

ఒకరి కొకరు వ్రాసుకున్న ఉత్తరాల సంపుటమైన ఈ పుస్తకం ద్వారా రచయిత తెలంగాణాలో కమ్యూనిస్టు ఉద్యమ ఫలితంగా ఏర్పడిన పరిస్థితులను క్రోడీకరించాడు. 'అర్థంలేని సిద్ధాంతాల మైకానికి గురియై అతి విలువైన ప్రాణాలను అన్యాయంగా కోల్పోతున్న తోటి మానవ సంతతికి' అంకితమైన ఈ పుస్తకంలో దేశాభిమానం కల ఒక యువకుడు తాను ప్రజాస్వామ్య సిద్ధాంతాన్ని నమ్మి నవాబైకమ్యూనిజంవంటితదితరసిద్ధాంతాలకు లొంగినవారిని విమర్శిస్తాడు. కలవరపెట్టుతున్న అన్ని పరిస్థితులను వ్యక్తం చేయుటమే ఈ రచనకు లక్ష్యం. కాని, పరిష్కార మార్గాన్ని సూచించడం కాదు. పరిష్కార మార్గాన్ని నిర్ణయించేందుకు కావలసిన అన్ని అంశాలను సేకరించి హాజరు పెట్టడానికి రచయిత పాటుపడ్డాడు.

## ఆలిండియా రేడియో'

చరిత్రంటే తేదీలూ, వంశానుక్రమణికలు కావని విశ్వసించే వారు ఈ రచన కూడా ఒక తెలంగాణా సమగ్ర చరిత్ర అని విశ్వసించగలరు. 'వాక్యం రసాత్మకం కావ్యం' అన్న సిద్ధాంతాన్ని నమ్మేవారు యీ రచన ఒక చక్కని కావ్యమని అంగీకరిస్తారు. గాఢంగా ఉన్న విషయాన్ని బయల్పరచడమే పరిస్థితి పర్యాలోకన అయినప్పుడు యిదొక విమర్శగ్రంథమని పరిగణించక తప్పదు. ఇది తనతో పాటు బతుకుతున్న సమాజం కోసం చేసిన రచన.

"మనవాళ్లు" ఈ విలువైన ప్రాణాలను అంత తేలిగ్గా ఎలా తీయ గలుగుతున్నారో, ఆకిటుకేమిటో నాకంతుపట్టకుండా ఉంది" అని రచయిత బాధపడ్డాడు. కాగా ఈ రచన అర్థం లేని సిద్ధాంతాల మైకానికి గురియై అతివిలువైన ప్రాణాన్ని అన్యాయంగా కోల్పోతున్న తోటి మానవసంతతికి అంకిత మియ్యబడింది. రచన అంతటా ప్రజాస్వామ్య హృదయము, సామ్యవాదమూ ప్రస్ఫుటిస్తున్నాయి. తెలంగాణా అంటే ఏమిటో 19 లేఖల్లో 'భవదీయుడు' సులభ గ్రాహ్యంగా వివరించారు. ఆయన కలంనిశితమైందైనా ఆ విషయాన్ని అది ఆర్భాటంతో ప్రదర్శించుకోదు. రచనతీరులో అభ్యుదయం గోచరిస్తున్నా, విప్లవతంత్రాలు, రక్తాలూ మొదలైన పారిభాషిక పదాల్తో భీభత్సంసృష్టించబడలేదు. ఈ రచయిత చెప్పదలుచుకున్నదాన్ని చెప్పడానికి ప్రజలచెవుల దగ్గరికి

వెళ్ళి ఉపన్యసించరు; సమాజాన్ని రక్తంలో కరిగించుకొని, తనగుండెతీసుకొచ్చి ప్రజలచెవులవద్దపెట్టి ఇదుగో! యీ రక్తప్రసారధ్వని వినమంటారు. ఈ రకమైన రచన యిది. ఈ పుస్తకంలో సమస్యల్ని సమూలంగా చర్చించడమే జరిగింది గాని- పరిష్కారమార్గం చూపించబడలేదు. అయినా సమాజంలోని లోటుపాట్లన్నీ సమగ్రంగా చర్చించిన సిమ్మటనే పరిష్కార మార్గం సూచించ బడటం సాధ్యపడుతుంది. ఒక లోటు చర్చిస్తుంటే మరోలోటు చర్చించబడడానికి సిద్ధంగా నిలబడుతున్న సమాజంలోవున్న రచయిత జీవితం లోటుల్ని లెక్కించడంతోనే తీరిపోవాల్సి వుంటుందేమో?

'సీ' స్వరూపంయిది అని విస్పష్టం చేస్తూచక్కని లేఖా సాహిత్యాన్ని సృష్టించారు- 'భవదీయుడు'. శైలిధారాళంగా వుంది, గెటప్ బాగుంది అనే అభిప్రాయాలకు యీరచన అతీతమైంది. పాఠకుడు తాను తెలుసుకోలేక బాధపడేది యీరచన ద్వారా తెలుసుకొని తిరిగి ఆ తెలుసుకున్నదాన్నే తన చుట్టూ వున్న సమాజంలో చూసి అనుభవాన్ని సంపాదించుకోగలుగుతాడు.

[ ఆలిండియా రేడియో, హైద్రాబాద్ కేంద్రం నుండి ప్రసారమైన శ్రీ పి. యస్. ఆర్. ఆంజనేయశాస్త్రి గారి సమీక్ష ]

## ' జయభారత్ '

ఆంధ్రదేశమునకు "ఆదర్శలోకాలు" అను నాటికా రచయితలుగా వీరు చిరపరిచితులు. విద్వద్ఘనుల మన్ననలను, పత్రికా ప్రశంసలగాంచినారు. వీరి రచనలుత్తేజకరముగ నుం డును. ప్రస్తుత గ్రంథము లేఖల రూపమున నున్నది. అయితే యిందలి విశిష్టత యేమనిన లేఖలన్నియు విసువుగల్గింపక గ్రంథమాదినుండి తుదవరకు చదువరులకు కుతూహలముగా నున్నది. ఈలేఖలు తెలుగు "స్వతంత్ర" ద్వారాంప్రకటితమయి పలువుర చన్నులూరించినవి. వాటినే గ్రంథ రూపేణ ప్రకటించి తెనుగు భాషాధ్యయనులకు మహోపకారము గావించినారు. సస్యశ్యామలమగు తెలంగాణయందు శాంతి నికేతనములుగా వెలసిన పల్లెసీమలన్నియు దుండగీండ్ర బాహాటముగా సాగిం చుచున్న మారణ హోమము ఫలితముగా స్మశానవాటికలుగా మారినవి. ఆయుదంతమే యిందలి యితివృత్తము. ఇది ప్రత్య క్షముగా వర్ణింపబడినది. ఈ గ్రంథకర్త దుండగీండ్ర మనస్తత్వ మును జీర్ణించుకొనుటకుగాను కల్లోలిత ప్రాంతమును పర్యటిం చుటవలన పడినపాటులన్ని గ్రంథ రచన నుండి యూహింపవ గును. వీరిరచనలు జగజ్జాగరణ వైతాళికులై విలసిల్లుచున్నవి. వీరి రచనల ప్రత్యేకత యేమనిన వీరి అసంఖ్యాక సాంఘిక నాటి కలన్నియు తెలంగాణపు వాడవాడల ప్రదర్శితమయినవి. తత్ఫ లితముగా తెలంగాణమున మంచి కలవరము కలిగించినవి... వీరిట్లే నచిరకాలములో తదితర నాటకములను, నవలలను వరుసగా ప్రచురించి నాంధ్ర భారతికి పరివస్య గావించి సాహితీ సేవయందగ్రగణ్యులగుదురు గాత.

— వెల్దండ ప్రభాకరరావు

# 'పల్లెటూరు'

'తెలంగాణా తీరు తెన్నులు' తెలుగు ప్రజల భావ తరంగములు. అణగియున్న భావాలన్నీ యున్నదున్నట్లు ప్రస్ఫుటముజేయు గ్రంథకర్తగారి నేర్పు పాఠకులకు పదపదమున స్ఫూర్తికి వచ్చుచుండును. పుస్తకము చదువ మొదలిడిన విడువ బుద్ధి వొడమదు. పల్లెవాసుల జీవితాలను తెలుగువారి సలుబాములను, కమ్యూనిస్టుల కార్యకలాపాలను కార్యకర్తలందరము కన్నకలుషిత వాతావరణమున కలవరపెట్టు స్థితిగతులను కండ్లెదుట కనపడునట్లే గ్రంథకర్తగారు రచనారంగమున తేటపరచినారు. అనేక సమస్యలను లేఖా రచన మార్గమున యథార్థ యుద్దేశములను నిష్పక్షపాతముగా వెల్లడిచేసినారు శ్రీ 'భవదీయుని' యున్నత భావములు ఈ రచనలవలన తెలియుచున్నవి. ప్రతివారూ చదువయోగ్యముగా నున్నది.

★